PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 45 సంచిక : 124 | విజయవాడ, శనివారం 6 డిసెంబర్ 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Saturday 6 December 2025 | Rs

స్క్రాప్ పేరుతో 'లిక్విడ్' అమ్ముకునే కుట్ర!

- విలువైన స్టీల్ నేలపాలు
- యాజమాన్యం లూటీపై విచారణ జరపాలి: నర్సింగరావు

2

సెమీస్‌కు భారత్

- షూటౌట్‌లో బెల్జియంపై 4-3గోల్స్‌తో గెలుపు
- ప్రపంచకప్ జూనియర్ హాకీ

8

ఒత్తిళ్లున్నా ఆగదు

ఇంధన సరఫరా కొనసాగిస్తాం
వాణిజ్య చెల్లింపులకు ఇరు దేశాల కరెన్సీ

- సంయుక్త పత్రికా సమావేశంలో పుతిన్
- ఉగ్రవాదంపై ఉమ్మడి పోరు : మోడీ



మీడియా సమావేశంలో ప్రధాని మోడీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్

న్యూఢిల్లీ : అమెరికా వంటి దేశాల నుంచి ఒత్తిళ్లు ఎదురవుతున్నప్పటికీ భారత్ - రష్యా మధ్య ఇంధన సరఫరా కొనసాగుతుందని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ స్పష్టం చేశారు. భారత్‌లో పర్యటిస్తున్న పుతిన్‌తో ప్రధాని నరేంద్ర మోడీ శుక్రవారం హైదరాబాద్ హౌస్‌లో గంటకు పైగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఇరువురు నేతలు ఉక్రెయిన్‌లో పరిస్థితి పైన, ఆర్థిక, రాజకీయ, వ్యూహాత్మక రంగాలలో సహకారం పైన చర్చించారు. అనంతరం మోడీతో కలిసి సంయుక్త విలేకరుల సమావేశంలో పుతిన్ మాట్లాడారు. పశ్చిమ దేశాల ఒత్తిళ్ల కారణంగా రష్యా నుంచి చమురు దిగుమతులను భారత్ కొంతకాలంగా తగ్గించుకుంటున్నప్పటికీ సరఫరాలను పెంచేందుకు త్వరలో చర్యలు చేపడతామని ఆయన చెప్పారు. గత సంవత్సరం ద్వైపాక్షిక వాణిజ్యం రికార్డు స్థాయిలో 12 శాతం పెరిగిందని గుర్తు చేశారు. ఈ ఏడాది కూడా ఇదే పరిస్థితి కొనసాగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. భారత్‌తో వాణిజ్య సహకారంతోపాటు రక్షణ సహకారాన్ని కూడా మరింత పెంచుకుంటామని తెలిపారు. రెండు దేశాలు చెల్లింపుల కోసం తమ జాతీయ కరెన్సీలను ఉపయోగించుకుంటున్నాయని, సుమారు 96 శాతం వాణిజ్య చెల్లింపులు జాతీయ కరెన్సీ (రూపీ-రూబుల్)ల్లో జరుగుతున్నాయని చెప్పారు. భవిష్యత్తులోనూ జాతీయ కరెన్సీల్లోనే వాణిజ్యాన్ని పెంపొందించేందుకు ఇరు దేశాలు అంగీకరించాయని ఇరువురు నేతలు తెలిపారు. 'భారత్‌లో అతి పెద్ద అణు విద్యుత్ ప్లాంటును నిర్మించడానికి ఒక ప్రధాన ప్రాజెక్టును చేపడుతున్నామని చెప్పారు. "ఆరు రియాక్టర్ యూనిట్లలో ఇప్పటికే రెండింటిని గ్రిడ్‌కు అనుసంధానించామని, ఈ ప్లాంటు పూర్తి సామర్థ్యంతో పనిచేస్తే భారత ఇంధన అవసరాలు తీరతాయి. పరిశ్రమలు, నివాస గృహాలకు చౌకగా విద్యుత్ లభిస్తుంది' అని పుతిన్ తెలిపారు.

సైనిక సాంకేతిక రంగంలో రెండు దేశాలు సన్నిహిత సహకారాన్ని పెంచుకుంటున్నాయని ఇరు దేశాల నేతలు తెలిపారు. భారత సైనిక దళాల ఆధునీకరణకు గత అర్ధ శతాబ్ద కాలంగా రష్యా సహకరిస్తోందని అన్నారు. వచ్చే ఏడాది భారత్ బ్రిక్స్ సమావేశాలకు అధ్యక్షత వహించనుందని, భారతీయ స్నేహితులకు అన్ని రకాల సహాయ సహకారాలను అందిస్తామని అన్నారు. మోడీతో జరిపిన చర్చలు సంతృప్తిని కలిగించాయని పుతిన్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.

ఉగ్రవాదంపై పోరులో కలిసి నడుస్తాం

ఉగ్రవాదంపై పోరులో భారత్, రష్యా కలిసి నడుస్తాయని ప్రధాని మోడీ అన్నారు. శాంతి కోసం జరిపే ప్రయత్నాలకు భారత్ మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు. ఈ ప్రయత్నంలో తాము భుజం భుజం కలిపి నడుస్తామని చెప్పారు. ఇటీవల పహల్గాంలో జరిగిన దాడికి, గత సంవత్సరం రష్యా రాజధాని మాస్కోలోని క్రాకస్ సిటీ కాన్సర్ట్ హాలులో జరిగిన దాడికి మూల కారణం ఉగ్రవాదమేనని అన్నారు. మానవత్వ విలువలపై జరుగుతున్న ఈ ప్రత్యక్ష దాడులను ఎదుర్కొనేందుకు ఇరు దేశాలు ఏకమయ్యాయని అన్నారు. భారత్, రష్యా, అమెరికాతో పాటు జి-20, బ్రిక్స్ వేదికలు కూడా ఉగ్రవాదంపై పోరులో పరస్పరం సహకరించుకుంటున్నాయని మోడీ వివరించారు.

వడ్డీ రేట్లు పావు శాతం తగ్గింపు

ముంబయి : రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) మరోమారు వడ్డీ రేట్లకు కోత పెట్టింది. రెపోరేటును పావు శాతం తగ్గించి 5.25 శాతానికి పరిమితం చేసింది. ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా అధ్యక్షతన మూడు రోజుల పాటు సాగిన ఆర్‌బిఐ మానిటరీ పాలసీ కమిటీ (ఎంపిసి) నిర్ణయాలను ఆయన శుక్రవారం మీడియాకు వెల్లడించారు. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి జూన్ కాలంలో మూడు సార్లు వడ్డీ రేట్లను 100 బేసిస్ పాయింట్లు తగ్గించామని గుర్తు చేశారు. నాలుగోసారి కూడా 25 బేసిస్ పాయింట్లు తగ్గించామని చెప్పారు. దీంతో ఈ ఏడాదిలో ఇప్పటివరకు రెపో రేటు 1.25 శాతం వరకు దిగొచ్చింది. ఈ క్రమంలో గృహ, వాహన, రిటైల్, వ్యక్తిగత రుణాలపై భారం తగ్గుతోంది. రూపాయి పతనం కొనసాగుతున్న ప్పటికీ.. ద్రవ్యోల్బణం కనిష్ట స్థాయికి పడిపోవడంతో వృద్ధి రేటు పెరగడంతో రేట్ల కోత చేపట్టామని మల్హోత్రా అన్నారు. బాహ్య వాతావరణం ప్రతికూల సవాళ్లతో కూడుకున్నప్పటికీ భారతీయ ఆర్థిక వ్యవస్థ మెరుగైన ప్రగతిని ప్రదర్శించిందన్నారు. తగ్గిన ద్రవ్యోల్బణం మరింత వృద్ధికి మద్దతుగా నిలవడానికి వీలు కల్పించనుందని పేర్కొన్నారు.

"జిఎస్‌టి శ్లాబుల తగ్గింపునతో కొనుగోళ్లు పెరగడంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్‌తో ముగిసిన రెండో త్రైమాసికంలో 8.2శాతం వృద్ధి నమోదయ్యింది. దీంతో 2025-26 ఆర్థిక సంవత్సరానికి గానూ జిడిపి అంచనాలను 6.8 శాతం నుంచి 7.3 శాతానికి పెంచుతున్నాం. ధరలు కూడా తగ్గుముఖం పట్టినందున 2025-26కు గాను ద్రవ్యోల్బణం అంచనాలను 2.6 శాతం నుంచి 2 శాతానికి అంచనా వేస్తున్నాము. విదేశీ మారక నిల్వలు 686 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. రాబోయే 11 నెలల వరకు దిగుమతులకు ఇవి సరిపోతాయి." అని మల్హోత్రా తెలిపారు. ఆర్‌బిఐ వడ్డీ రేట్ల కోత వార్తలతో స్టాక్ మార్కెట్లు సానుకూలంగా ట్రేడింగ్ అయ్యాయి. వారాంతం సెషన్‌లో బిఎస్‌ఇ సెన్సెక్స్ 447 పాయింట్ల లాభంతో 85,712కు చేరింది. ఎన్‌ఎస్‌ఇ నిఫ్టీ 153 పాయింట్లు పెరిగి 26,186 వద్ద ముగిసింది.

విద్యార్థి ప్రోగ్రెస్‌ను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకుంటున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్

విద్యలో ఆంధ్రప్రదేశ్ రోల్ మోడల్

- పావలా వడ్డీతో విదేశీ విద్యకు రుణాలిప్పిస్తాం
- పిల్లల ప్రతిభను గుర్తించి రివార్డులు అందిస్తాం
- మెగా పేరెంట్స్ టీచర్ సమావేశంలో సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి, పార్వతీపురం

ప్రభుత్వ విద్యారంగంలో ఆంధ్రప్రదేశ్ రోల్‌మోడల్‌గా నిలుస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. రానున్న మూడేళ్లలో రాష్ట్రాన్ని విద్యారంగంలో ఆదర్శంగా తీర్చిదిద్దడానికి చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. పార్వతీపురం మన్యం జిల్లా భామిని మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో నిర్వహించిన మెగా పేరెంట్స్ అండ్ టీచర్ సమావేశంలో ముఖ్యమంత్రితో పాటు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. 18 నెలల్లో ప్రాథమిక విద్యారంగంలో 28 సంస్కరణలు, ఇంటర్ విద్యలో పది సంస్కరణలు తీసుకొచ్చామన్నారు. ఉన్నత, విదేశీ విద్య కోసం 'కలలకు రెక్కలు' పేరిట పథకం ప్రారంభిస్తున్నామని, పావలా వడ్డీతో విదేశీ విద్యకు రుణాలిప్పిస్తామని తెలిపారు. స్టూడెంట్స్ ఇన్నోవేటర్స్ పార్టనర్‌షిప్ సమ్మిట్ నిర్వహించాలని భావిస్తున్నామని, పారిశ్రామికవేత్తలను ఈ సదస్సుకు ఆహ్వానిస్తామని చెప్పారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి రివార్డులు అందిస్తామని తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లాలో అమలు చేస్తున్న 'ముస్తాబు' కార్యక్రమాన్ని రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలన్నీ పాటించాలని సూచించారు. ప్రైవేట్ విద్యా రంగంలో ప్రతి ఉపాధ్యాయుడికి 25 మంది విద్యార్థులుంటే ప్రభుత్వ రంగంలో 18 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు ఉన్నారని తెలిపారు. ఫ్లిక్కర్ యాప్ ద్వారా వినూత్న కార్యక్రమాలు రూపొందించామని, 53 పాఠశాలల్లో ఈ విధానం ప్రారంభించామని తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లా గిరిజన విద్యార్థి కరుణకుమారి.. ప్రభుత్వ పాఠశాలలో చదువుకుని అంధ మహిళల క్రికెట్ ప్రపంచ కప్ సాధించడం, భారత క్రికెట్‌లో రాణించడం గొప్ప విషయమన్నారు. 24 గంటలూ

మిగతా 7లో

తాత్కాలిక అకడమిక్ కన్సల్టెంట్ల నోటిఫికేషన్ అమలు నిలిపివేత

- 'వర్సిటీ'లను నాశనం చేస్తే ఊరుకోం : హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం (ఎస్‌వియు)లోని పలు విభాగాల్లో 2025-26 ఏడాదికి తాత్కాలిక ప్రాతిపదికన అకడమిక్ కన్సల్టెంట్ల నియామకం కోసం యూనివర్సిటీ రిజిస్ట్రార్ వెలువరించిన నోటిఫికేషన్ అమలును హైకోర్టు నిలిపింది. చట్ట నిబంధనల్లో అకడమిక్ కన్సల్టెంట్ పోస్టు ఎక్కడ ఉందో చూపాలని యూనివర్సిటీని ప్రశ్నించింది. రూల్ ఆఫ్ రిజర్వేషన్లను అమలు చేయడం లేదని తప్పుపట్టింది. అకడమిక్ కన్సల్టెంట్ల నియామకం కోసం ఎస్‌వియు రిజిస్ట్రార్ ఈ ఏడాది అక్టోబరు 31న జారీ చేసిన నోటిఫికేషన్ అమలును నిలిపివేస్తూ జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ ఎ హరిహరనాథ శర్మతో కూడిన డివిజన్ బెంచ్ శుక్రవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలను నాశనం చేసే దిశగా చర్యలుంటే తాము చూస్తూ ఉండబోమని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించింది. విద్యా వ్యవస్థ నాశనం అవ్వడానికి వీల్లేదని పేర్కొంది. ప్రభుత్వ అధికారుల అసంబద్ధ వైఖరుల కారణంగా విద్యా రంగంలో నాణ్యమైన విద్య అందడం లేదని ఆందోళన వ్యక్తం చేసింది. విద్యను విద్యార్థులు పొందడం రాజ్యాంగం ఇచ్చిన హక్కని గుర్తు చేసింది. అనుచిత, అసంబంధ నిర్ణయాల కారణంగా విద్యా సంస్థలు అడ్డా కూలీల కేంద్రాలుగా మారుతున్నాయని వ్యాఖ్యానించింది. ఈ విషయాలను తాము తీవ్రంగా పరిగణిస్తామంది. టీచింగ్ స్టాఫ్‌ను రెగ్యులర్ విధానంలో కాకుండా కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, టెంపరరీ విధానంలో కొనసాగించడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. యువశక్తిని దోచుకోవడమే కాకుండా నిర్వీర్యం చేయడమేనని పేర్కొంది. అకడమిక్ కన్సల్టెంట్ల నియామక నోటిఫికేషన్ రూల్ ఆఫ్ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా ఉందని, సుప్రీంకోర్టు ఆదేశాలకు, రాజ్యాంగ అధికరణాలకు వ్యతిరేకంగా ఉంటూ డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్ అకడమిక్ కన్సల్టెంట్లుగా పనిచేస్తున్న డాక్టర్ కె కిషోర్ కుమార్‌రెడ్డి, డాక్టర్ ఎస్ శివశంకర్, మరో ప్రైవేటు ఉద్యోగి రెడ్డివారి అర్జున్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన సింగిల్ జడ్జి ఆదేశాల జారీకి నిరాకరించింది. దీంతో వారంతా అప్పీల్ దాఖలు చేయడంతో డివిజన్ బెంచ్ విచారించింది. తాత్కాలిక పద్ధతిలో పోస్టులను భర్తీ చేయడమంటే విద్యావంతులైన యువతను దోపిడీ చేయడమేనని వ్యాఖ్యానించింది. విచారణను వాయిదా వేసింది.

చెవిరెడ్డి బెయిల్ పిటిషన్ తిరస్కృతి

- మద్యం కేసులో నిందితులకు 19 వరకు రిమాండ్ పొడిగింపు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా రాజకీయ దుమారం లేపిన మద్యం కుంభకోణం కేసులో బెయిల్ కోసం దరఖాస్తు చేసుకున్న నలుగురి పిటిషన్లను విజయవాడ ఎసిబి కోర్టు శుక్రవారం డిస్మిస్ చేసింది. బెయిల్ కోరుతూ పిటిషన్ వేసిన వారిలో వైసిపి నేత, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, వెంకటేష్ నాయుడు, నవీన్‌కృష్ణ, బాలాజీ యాదవ్ ఉన్నారు. ఈ కేసుకు సంబంధించి 9 మంది రిమాండ్‌లో ఉండగా, అందులో నలుగురు మాత్రమే బెయిల్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. పిటిషన్‌ను డిస్మిస్ చేసిన అనంతరం ఈ కేసులోని నిందితులందరికీ ఈ నెల 19 వరకు రిమాండ్ గడువును పెంచుతూ ఎసిబి కోర్టు తీర్పును వెలువరించింది. నిందితుల్లో ఆరుగురు విజయవాడ జిల్లా జైలులో ఉండగా, మరో ముగ్గురు గుంటూరు జిల్లా జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు.

విమాన సంక్షోభం మరింత తీవ్రం

- మూడో రోజూ వెయ్యికి పైగా ఇండిగో విమానాలు రద్దు
- ప్రయాణికుల అగచాట్లు
- ఇదే అదునుగా భారీగా ఛార్జీల బాదుడు
- మరి కొన్ని రోజులు ఇదే స్థితి

ఇండిగో సంస్థ సర్వీసులను ఆఖరి నిమిషంలో రద్దు చేయడంతో బెంగళూరులోని కెంపెగౌడ అంతర్జాతీయ విమానశ్రయంలో లగేజీ కోసం ప్రయాణీకుల తిప్పలు

న్యూఢిల్లీ : దేశీయ విమానయాన రంగంలో సంక్షోభం మరింత తీవ్రతరమైంది. అతిపెద్ద విమానయాన సంస్థ ఇండిగో వరసగా మూడో రోజైన శుక్రవారం కూడా పెద్ద సంఖ్యలో విమానాలను రద్దు చేసింది. శుక్రవారం ఉదయం 400కుపైగా సర్వీసులు రద్దు చేసినట్లు ఆ సంస్థ ప్రకటించింది. సాయంత్రానికి ఇలా రద్దయిన విమానాల సంఖ్య భారీగా పెరిగింది. దాదాపుగా వెయ్యికిపైగా విమానాలు రద్దై ఉంటాయని అంచనా! రాత్రి 8 గంటల ప్రాంతంలో ఆ సంస్థ సిఇఓ పీటర్స్ ఎల్బర్స్ విడుదల చేసిన ప్రకటనలో శనివారం నాడు కూడా ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉందని తెలపడం పరిస్థితి తీవ్రతకు నిదర్శనం. 'శనివారం నాడు వెయ్యికన్నా తక్కువ విమానాలు రద్దు అయ్యేలా చర్యలు తీసుకుంటాం' అని ఆయన పేర్కొన్నారు. ఈ నెల 10-15 మధ్య కాలంలో సాధారణ పరిస్థితులు నెలకొనే అవకాశం ఉందని ఆయన తెలిపారు. పెద్ద సంఖ్యలో విమానాలు రద్దు కావడంతో ఎయిర్‌పోర్టులలో ప్రయాణికులు తీవ్ర స్థాయిలో ఇబ్బందులు పడుతున్నారు. గంటల తరబడి విమానాశ్రయాల్లో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తమకు సమాచారం ఇచ్చేవారు కూడా లేరని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇండిగో కౌంటర్లు ఖాళీగా ఉన్నాయని, ఉన్న సిబ్బంది కూడా ప్రయాణీకులు చెప్పారు. ఆహారం, నీరు కూడా ఇవ్వడం లేదని చెప్పారు. తమ లగేజీలను తీసుకునేందుకు 12 గంటలకు పైగా సమయం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎయిర్ పోర్టు లాంజ్‌లో సరైన సదుపాయాలు లేక అనేక మంది నేలపైనే నిద్రించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఢిల్లీ నుంచి వెళ్లే అన్ని సర్వీసులను ఇండిగో శుక్రవారం రద్దు చేసింది. రోజు సాధారణం గా ఇక్కడి నుంచి రోజుకు ఇండిగో 230కు పైగా సర్వీసులను నిర్వహిస్తోంది. బెంగళూరులో

మిగతా 7లో

సొసైటీలలో 'నానో' తప్పనిసరి!

- యూరియా,డిఎపిలకు లింక్
- కేంద్రం, కంపెనీలు, డీలర్ల ఒత్తిళ్లకు లొంగుబాటు
- ఈ రబీ నుంచి అమలుకు ప్రభుత్వం యత్నం
- సంక్షోభ రైతుకు వృధా ఖర్చు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల (పిఎసిఎస్)లో నానో ఎరువుల అమ్మకాలను ప్రభుత్వం తప్పనిసరి చేసే యోచనలో ఉన్నట్లు సమాచారం. ఘన రూపంలో ఉండే సంప్రదాయ యూరియా, డిఎపి కొనుగోలు చేసే రైతులు తప్పనిసరిగా నిర్దేశించిన పరిమాణం మేరకు నానో ఎరువులను కొనుగోలు చేయాలన్న నియమాన్ని ముందుకు తీసుకొస్తున్నట్లు తెలిసింది. ఎరువుల కంపెనీలు, ప్రైవేటు డీలర్ల ఒత్తిడి మేరకు ప్రభుత్వం సొసైటీలలో సంప్రదాయ ఎరువులకు నానో ఎరువులను లింక్ చేసి అమ్మించేందుకు కసరత్తు చేస్తోంది. ఈ రబీ నుంచే నానో లింక్‌ను అమల్లో పెట్టేందుకు యత్నాలు ముమ్మరం చేసింది. ఎరువుల సబ్సిడీని వీలైనంతగా తగ్గించుకునేందుకు మోడీ ప్రభుత్వం పథకాలు రచించింది. ముందటి మూడేళ్ల వినియోగం సరాసరి లెక్కగట్టి దానిపై ఏడాదికి పది శాతం వాడకం తగ్గించాలన్నది లక్ష్యం. అత్యధికంగా సబ్సిడీ ఇస్తున్న సంప్రదాయ యూరియా, డిఎపిలకుకు ప్రత్యామ్నాయంగా ద్రవ రూపంలోని నానో ఎరువులను ప్రవేశపెట్టి వాటిని రైతులకు అలవాటు చేసేందుకు టార్గెట్లు నిర్ణయించి బలవంతంగా అమ్మిస్తోంది. శాస్త్రీయంగా ఎంతమాత్రం నిరూపణకానందున, సరైన అవగాహన కల్పించనందున రైతులు నానో ఎరువులను తిరస్కరిస్తున్నారు. కేంద్రం ఒత్తిడి మేరకు సంప్రదాయ ఎరువులు కావాలంటే తప్పనిసరిగా నానో ఎరువులను కొనాలని కంపెనీలు బలవంతంగా అంటగడుతుండగా, అలవాటైన సంప్రదాయ ఎరువుల కోసం తమకు ఇష్టంలేకపోయినా రైతులు అవసరం లేని నానో ఎరువులను విధిలేని పరిస్థితుల్లో కొనుగోలు చేసి వాడకుండా పక్కన పడేస్తున్నారు. ఇప్పటి వరకు ఈ లింక్ విధానం కేవలం ప్రైవేటు డీలర్లకే పరిమితమైంది.

ప్రైవేట్‌కు బ్యాలెన్స్

కంపెనీలు బలవంతంగా నానో ఎరువులను అంటకట్టడం పట్ల రైతులు ప్రైవేటు దుకాణాలకు కాకుండా సొసైటీల వద్దకు పరుగులు తీస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో అదనుకు కేంద్రం నుంచి రాష్ట్రానికి యూరియా సరఫరా కాకపోవడంతో తీవ్ర కొరత ఏర్పడింది. ఈ సమస్యను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తన అధికారాన్ని ఉపయోగించి రాష్ట్రానికి వచ్చిన యూరియాలో 70 శాతం తన అధీనంలోకి తెచ్చుకొని మార్క్‌ఫెడ్ ద్వారా సొసైటీలకు పంపి అమ్మించింది. సొసైటీలు అధికారపార్టీ పెత్తనంలో ఉండటంతో యూరియా పక్కదారి పట్టి కొరత సమస్య తీవ్రమై సరఫరా గొలుసు అస్తవ్యస్తమైందన్న విమర్శలను ప్రభుత్వం ఎదుర్కొంది. కాగా డిమాండ్ ఉన్న ఎరువును ప్రభుత్వం 50 శాతం కాకుండా 70 శాతం తీసుకోవడంతో కంపెనీలు, ప్రైవేటు డీలర్లు అసంతృప్తిగా ఉన్నారు. బహిరంగ మార్కెట్‌లో ఎరువు కనబడకపోవడంతో రైతులు

మిగతా 7లో

'సోలార్' ప్రజలకు శాపం కాకూడదు

- వ్యవసాయ పంపుసెట్లకు సౌరీకరణపై ఎపిఇఆర్‌సి బహిరంగ విచారణలో నిపుణుల అభిప్రాయాలు

3

సిగరెట్లలో గంజాయి

- ఏలూరులో విచ్చలవిడిగా విక్రయాలు
- మత్తులో ఊగుతున్న యువత
- పోలీస్ నిఘా లేని ప్రాంతాల్లో గుప్పు

3

శ్రమ దోపిడీకే లేబర్ కోడ్లు

- తక్షణమే ఉపసంహరించుకోవాలి
- సిపిఎం రాజ్యసభ పక్షనేత జాన్ బ్రిట్టాస్ డిమాండ్

సభలో మాట్లాడుతున్న జాన్ బ్రిట్టాస్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఎం రాజ్యసభ పక్షనేత జాన్ బ్రిట్టాస్ డిమాండ్ చేశారు. వ్యాపారాన్ని సులభతరం చేయడం పేరుతో ప్రవేశపెట్టిన లేబర్ కోడ్లు వాస్తవానికి శ్రమ దోపిడీని సులభతరం చేస్తున్నాయని విమర్శించారు. పార్లమెంటులో చర్చ కూడా లేకుండానే కార్మిక చట్టాలను హడావిడిగా ఆమోదించారని విమర్శించారు. కార్మిక సంఘాల వ్యతిరేకత కారణంగా వాటిని సంవత్సరాలుగా అమలు చేయలేదని, కానీ ఇప్పుడు ఎటువంటి సంప్రదింపులు లేకుండానే లేబర్ కోడ్లు అమల్లోకి వచ్చాయని ప్రకటించారని విమర్శించారు. నాలుగు లేబర్ కోడ్లు దాదాపు 70 శాతం ఉపాధి సంస్థలను, అదే సంఖ్యలో కార్మికులను కార్మిక చట్టాల రక్షణ నుండి తొలగిస్తాయని పేర్కొన్నారు. మోడీ రాజ్ హయాంలో నియామకాలు సులభతరం కావడం లేదని, అయితే కార్మికులను ఉద్యోగాల నుంచి తొలగింపు సులభతరం అవుతుందని విమర్శించారు. సామూహిక తొలగింపుతో కార్మికులను ఉపాధి నుంచి నెట్టేసేందుకు మార్గం సుగమం చేసే వ్యవస్థగా మార్చబడిందని అన్నారు. గతంలో వంద కంటే ఎక్కువ మంది కార్మికులు ఉన్న సంస్థల్లో తొలగింపు, మూసివేత సాధ్యం కాదని, ఇప్పుడు అది మూడు వందల మంది వరకు ఉన్న సంస్థలుగా సవరించారని అన్నారు. కార్మిక చట్టాలు కార్మికులు సమ్మె చేసే హక్కులను కూడా తిరస్కరిస్తున్నాయని తెలిపారు. దీనికి పరిస్థితులు కఠినతరం చేయబడ్డాయని అన్నారు. కార్మిక చట్టాలు యజమానుల ప్రయోజనాలను పూర్తిగా రక్షిస్తాయని, దశాబ్దాల పోరాటంతో కార్మికవర్గం సాధించుకున్న హక్కులను ఒకేసారి దొంగిలించారని విమర్శించారు. కార్మికుల సమాన అవకాశాల ఉమ్మడి జాబితాలో ఉందని, కానీ కేంద్ర ప్రభుత్వం

మిగతా 7లో

టెట్‌పై 'సుప్రీం' ఆదేశాలను పునఃసమీక్షించాలి

- టిడిపి ఎంపి శ్రీకృష్ణ దేవరాయలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

టెట్ విషయంలో సుప్రీంకోర్టు ఆదేశాలను పునఃసమీక్ష చేయాలని, ఉపాధ్యాయులకు న్యాయం జరిగేలా చూడాలని టిడిపి ఎంపి లావు శ్రీకృష్ణ దేవరాయలు డిమాండ్ చేశారు. లోక్‌సభలో శుక్రవారం ఆయన ఈ అంశాన్ని లేవనెత్తారు. ఇటీవల సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం దేశంలోని సర్వీస్‌లో ఉన్న ప్రతి ప్రభుత్వ టీచర్ రెండేళ్లలోగా టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) తప్పనిసరిగా ఉత్తీర్ణత సాధించాల్సిందేననే నిర్ణయం ఉపాధ్యాయ వర్గాల్లో తీవ్ర ఆందోళనకు దారితీసిందని అన్నారు. 2010 ఆగస్టు 23కు ముందుగా నియమితులైన ఉపాధ్యాయులకు అప్పటి ఆర్‌టిఇ చట్టం ప్రకారం టెట్ నుండి మినహాయింపు ఇచ్చిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ప్రస్తుతం 15 నుండి 30 ఏళ్ల అనుభవం కలిగి గ్రామీణ, ఏజెన్సీ, గిరిజన ప్రాంతాల్లో విద్యా వ్యవస్థను నిలబెట్టే ఈ అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు మరోసారి టెట్ వంటి ప్రవేశపరీక్ష రాయాల్సిన పరిస్థితి కలగడం వారిని ఇబ్బందికి గురిచేసే అంశమని అన్నారు. ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే లక్షకుపైగా టీచర్లపై ప్రభావం ఉందని అన్నారు. ఆర్‌టిఇ చట్టం, ఎన్‌సిటిఇ చట్టం 1993లలో తగిన సవరణలు చేసి 2010కి ముందు సర్వీసుల్లో నియమితులైన ఉపాధ్యాయులకు స్థిరమైన భరోసా ఇవ్వాలని కోరారు. అలాగే ఉపాధ్యాయ సంఘాలతో వెంటనే చర్చలు జరిపి వారి భయాందోళనలను తొలగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

బార్ అసోసియేషన్ ఎన్నికల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలి

- పిటిషన్‌పై హైకోర్టు విచారణ

ప్రజాశక్తి-అమరావతి

బార్ అసోసియేషన్ ఎన్నికల్లో మహిళా అడ్వకేట్లకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేలా ఉత్తర్వులు జారీ చేయాలంటూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. అడ్వకేట్ తోట సునీత దాఖలు చేసిన ఈ వ్యాజ్యాన్ని జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ శుక్రవారం విచారించారు. హైకోర్టు న్యాయవాదుల సంఘానికి నోటీసులు జారీ చేశారు. కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించారు. మహిళా న్యాయవాదులకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని 2024 మే నెలలో సుప్రీంకోర్టు ఆదేశాలిచ్చిందని, అందుకు విరుద్ధంగా న్యాయవాదుల సంఘాలు చేయడానికి వీల్లేదని పిటిషనర్ తెలిపారు. 106వ రాజ్యాంగ సవరణ ద్వారా స్థానిక సంస్థల నుంచి పార్లమెంట్ వరకు మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించారన్నారు. హైకోర్టు బార్ అసోసియేషన్ కౌంటర్ దాఖలు తర్వాత తదుపరి విచారణ వచ్చే వారం చేపడతామని న్యాయమూర్తి ప్రకటించారు.

పశ్చిమగోదావరి జిల్లా పెదకాపవరంలో స్క్రబ్ టైఫస్..?

ప్రజాశక్తి - ఆకివీడు (పశ్చిమ గోదావరి జిల్లా)

పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడు మండలంలో పెదకాపవరం పిహెచ్‌సి సమీపంలోని ఓ రైతుకు స్క్రబ్ టైఫస్ వ్యాధి సోకినట్లు సమాచారం. అతనికి జ్వరం, జలుబు, ఒంటిపై దురదలు రావడంతో ఓ ప్రయివేటు ఆస్పత్రిలో ఇటీవల రక్త పరీక్షలు చేయించుకున్నారు. పాజిటివ్‌గా రావడంతో శుక్రవారం పెదకాపవరంలోని పిహెచ్‌సికి వెళ్లి రిపోర్టును అక్కడి వైద్యులకు చూపించారు. అయితే దీనిపై పిహెచ్‌సి వైద్యాధికారి రమేష్ మాట్లాడుతూ రిపోర్టును జిల్లా ఉన్నతాధికారులకు పంపామని, ప్రస్తుతం తామేమీ నిర్ధారించలేమని చెప్పారు. వివరాలు తెలిపేందుకు మండల వైద్యాధికారి నిరాకరించారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

అరటి రైతు ఆత్మహత్య బాధాకరం

- మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అనంతపురం జిల్లా, పుట్లూరు మండలం, ఎల్లుట్ల గ్రామానికి చెందిన రైతు చిల్లా నాగలింగం అప్పుల బాధతో తట్టుకోలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడటం బాధాకరమని వ్యవసాయశాఖ మంత్రి కె అచ్చెన్నాయుడు తెలిపారు. నాగలింగం తనకు ఉన్న 83 సెంట్ల వ్యవసాయ భూమితోపాటు మరో 3 ఎకరాలు పొలాన్ని కౌలుకు తీసుకుని అరటి సాగు చేస్తున్నట్లు చెప్పారు. వ్యవసాయంతోపాటు అరటి రైతుల నుంచి పంటను కొనుగోలు చేసి బెంగళూరుకు ఎగుమతి చేసే ట్రేడింగ్ వ్యాపారంలోనూ నిమగ్నమయ్యాడని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2021-2024 మధ్య అరటి పంటకు సరైన ధరలు లేకపోవడం, ఎగుమతి చేసిన పంటకు చెల్లింపులు రాకపోవడంతో ఆర్థిక పరిస్థితి తీవ్రంగా దెబ్బతిందన్నారు. అప్పులకు పెరిగిన వడ్డీలు, ట్రేడింగ్ వ్యాపారం పూర్తిగా నష్టాల్లో పడటం వల్ల ఒత్తిడిని తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడ్డారన్నారు. రైతులను ఆదుకోవడం ప్రభుత్వ ప్రధాన కర్తవ్యమని, రైతు నాగలింగం కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు.

ప్యాకేజీ, పరిహారం పెంచండి

- రెండోదశ పూలింగు రైతుల డిమాండ్
- ముఖ్యమంత్రికి వివరించాలని నిర్ణయం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అమరావతి రెండోదశ పూలింగుకు వెళుతున్న నేపథ్యంలో రైతులు అంగీకరించినట్లు చెబుతున్నా అంతర్గతంగా రెండు డిమాండ్లను ముందుకు తీసుకొస్తున్నారు. గతంలో పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఆధ్వర్యంలో జరిగిన గ్రామ సమావేశాల్లో అమోదం తెలిపినా అనంతరం కొంత అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇచ్చిన మాదిరి కాకుండా తమకు కౌలు, రిటర్నబుల్ భూములు కొంత పెంచాలని కోరుతున్నారు. గతంలో మెట్టకు రు. 30 వేలు, జరీబు భూమికి రూ.50 వేలు చొప్పున ఏడాది కౌలు ప్రకటించారు. దానికి ప్రతి ఏడాది పెంచుకుంటూ వచ్చారు. దీన్నే ఇప్పుడు రెండోదశ రైతులు ముందుకు తెస్తున్నారు. ఎ ప్రస్తుతం ఎంత కౌలు ఉందో అంత తమకు కూడా ఇవ్వాలని కోరుతున్నారు. లేనిపక్షంలో కనీసం ఎకరానికి రూ.60 వేలు అన్నా ఇవ్వాలని డిమాండు చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. దీనిపై గురువారం రైతులు చర్చించుకున్నారు. మంత్రి నారాయణతో టీటైం సమావేశం అనంతరం రెండు మూడు గ్రామాల్లో రైతులు దీనిపై ప్రత్యేకమైన డిమాండు కూడా పెట్టాలని అనుకున్నట్లు తెలిసింది. అలాగే ఒక బృందం గుంటూరులోని ఓ హోటల్లో సమావేశమయ్యారు. ఏడాది కౌలు పెంపుతోపాటు ప్రతి ఎకరానికి 1800 గజాలు వచ్చేలా కోరాలని అనుకున్నట్లు తెలిసింది. ముందుగా దీన్ని మంత్రి నారాయణ దృష్టికి తీసుకెళ్లి అక్కడ నుండి సిఎంకు వివరించాలని అనుకున్నట్లు తెలిసింది. ముఖ్యమంత్రికి తమ సమస్యలు వివరించడం ద్వారా కొంతవరకైనా ముందుకు వెళ్లవచ్చనే అభిప్రాయానికి వచ్చారు. అయితే అరెకరం, ఎకరం రైతుల అంశం కూడా మంత్రికి చెప్పాలని అనుకున్నారు. ప్రస్తుతం గత పూలింగు ఏరియాలో భూమిలేని పేదలకు నెలకు రూ.5 వేలు చొప్పున ఇస్తున్నారు. ఏడాదికి రూ.60 వేలు ఇస్తున్నారని, కొత్తగా పూలింగులోకి వెళ్లే చిన్న రైతులకు అంతేమొత్తంలో అందేలా చూడాలని కోరున్నారు. ఎకరం, అరెకరం రైతులు కూడా ఎక్కువగానే ఉన్నారని, వారికి విస్తీర్ణంతో సంబంధం లేకుండా ఏడాదికి రూ.60 వేలు వచ్చేలా చూడాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లనున్నారు. ముఖ్యంగా విద్య, వైద్యం అంశాలను ప్రస్తావించనున్నారు. పూలింగు పరిధిలోకి వచ్చే రైతులకు ఏయే ఆస్పత్రుల్లో ఎంతమేరకు వైద్యం అందిస్తారు. పిల్లలకు ఎంతవరకు విద్యా సదుపాయాలు కల్పిస్తారనే విషయాలపై పూర్తి స్పష్టత తీసుకోవాలని రైతులు నిర్ణయించారు. వైకుంఠపురం దేవాదాయ భూముల అంశాన్ని కూడా వివరించాలని నిర్ణయించారు. గురువారం జరిగిన సమావేశంలో మంత్రి నారాయణ రైతులతో మాట్లాడుతూ మరోసారి రైతులతో సమావేశం ఏర్పాటు చేస్తామని చెప్పిన నేపథ్యంలో ఆ సమావేశంలో ఈ విషయాలను ప్రస్తావించాలని నిర్ణయించారు.

ఎమ్మెల్యే తీరుపై అసంతృప్తి

పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ తీరుపై రెండోదశ పూలింగులో రైతులు కొంత అసంతృప్తితో ఉన్నారు. తాము ఏమి చెప్పినా మేమున్నాము మాకు చెప్పాలంటున్నారని, నేరుగా ఎవరితోనూ మాట్లాడొద్దని చెబుతున్నారని రైతులు చెబుతున్నారు. గతంలో సమావేశాల జరిగిన సమయంలోనూ అలాగే మాట్లాడారని, ఇప్పుడు తమకు అలాగే ఆదేశాలిస్తున్నారని చెబుతున్నారు. పూలింగుకు భూములు తీసుకుంటున్న సమయంలో భవిష్యత్ ఏమిటనే అంశంపై నేరుగా మంత్రితో మాట్లాడొద్దంటున్నాని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యండ్రాయిలో రైతులతో జరిగిన సమావేశంలో రైతులు తమ అభిప్రాయాలు వ్యక్తం చేస్తుండగా ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఇలాగైతే ఎలాగని రైతులు కొంత అసహనం వ్యక్తం చేస్తున్నారు.

అంగన్వాడీ వర్కర్ ఆత్మహత్యాయత్నం

- టెర్మినేషన్ ఉత్తర్వులతో మనస్తాపం

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్ (పల్నాడు జిల్లా)

విధుల్లో అలసత్వం వహించారని ఉన్నతాధికారులు జారీ చేసిన టెర్మినేషన్ ఉత్తర్వులతో మనస్తాపానికి గురైన అంగన్‌వాడీ వర్కర్ ఆత్మహత్యాయత్నం చేశారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలంలో జరిగిన ఈ ఘటనపై అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా గౌరవాధ్యక్షులు జి.మల్లీశ్వరి తెలిపిన వివరాల ప్రకారం.. సత్తెనపల్లి మండలం కట్టమూరు అంగన్‌వాడీ కేంద్రంలో వర్కర్‌గా హైమావతి, హెల్పర్‌గా నాగప్రసన్న పని చేస్తున్నారు. ఈ కేంద్రంలో గతనెల ఆరున భోజనాలు సిద్ధం చేస్తుండగా పిల్లలు సాంబారు పాత్రకు తగలడంతో సాంబారు కింద పడింది. దాన్ని దాటే ప్రయత్నంలో ఓ బాలిక జారి సాంబారుపై పడడంతో స్వల్ప గాయాలయ్యాయి. దీనిపై సూపర్‌వైజర్, పీడీ తదితరులు కేంద్రాన్ని సందర్శించడంతోపాటు బాలిక తల్లిదండ్రులతో మాట్లాడారు. అనుకోకుండా జరిగిన ఘటనే కాని సిబ్బంది పనితీరుతో ఇబ్బందేమీలేదని వారు చెప్పారు.

అనంతరం వర్కర్, హెల్పర్‌కు షోకాజు నోటీసులు ఇవ్వగా అందుకు వారు రాతపూర్వక వివరణ ఇచ్చారు. అయితే గత గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి టెర్మినేషన్ ఉత్తర్వులు రావడంతో తీవ్ర మనస్తాపానికి గురైన హైమావతి శుక్రవారం తన ఇంట్లోనే నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నం చేశారు. గమనించిన కుటుంబీకులు వెంటనే సత్తెనపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఉత్తర్వులను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కడప మేయర్ ఎన్నికకు నోటిఫికేషన్‌పై పిల్

ప్రజాశక్తి-అమరావతి

కడప మేయర్ ఎన్నికకు నోటిఫికేషన్ జారీ చేయడాన్ని మాజీ మేయర్ కె సురేష్‌బాబు హైకోర్టులో సవాల్ చేశారు. తనను మేయర్ పదవి నుంచి అన్యాయంగా తొలగింపు నిర్ణయాన్ని సవాల్ చేసిన పిటిషన్ హైకోర్టు విచారణలో ఉండగానే మేయర్ ఎన్నికల నోటిఫికేషన్ ఇవ్వడాన్ని తప్పుబట్టారు. దీనిని జస్టిస్ జి రామకృష్ణ ప్రసాద్ శుక్రవారం విచారించి రాష్ట్ర ప్రభుత్వానికి, రాష్ట్ర ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేశారు. విచారణను ఈ నెల 9కి వాయిదా వేశారు.

తన పదవీకాలం వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు ఉందని, కాలపరిమితికి ఆరు నెలల ముందు ఎన్నికలను నిర్వహించడానికి వీల్లేదని న్యాయవాది అన్నారు.

సర్వేల భారం తగ్గించాలి

- ఆశా వర్కర్స్ యూనియన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆశా వర్కర్లకు సర్వేల భారం తగ్గించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ కోరింది. ఈ మేరకు కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ వీరపాండియన్‌ను ఆ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి రమణకుమారి, కె ధనలక్ష్మి శుక్రవారం కలిసి వినతిపత్రం అందించారు. ఒకేసారి 3, 4 సర్వేలను చేయించే పద్ధతి ఆపాలని కోరారు. శాన్స్, ఎన్‌ఎల్‌ఇపి, ఎన్‌సిడిసిడి, పిఎంజెఎవై తదితర సర్వేలు ఒకేసారి చేయాల్సి రావడంతో తీవ్ర ఇబ్బందులు ఆశా వర్కర్లు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఉదయం 6 నుంచి 9 గంటల వరకు సర్వేలు చేస్తున్నారని, అక్కడి నుంచి సాయంత్రం 4 గంటల వరకు వెల్‌నెస్ సెంటర్స్‌లో ఉంటున్నారని తెలిపారు. సర్వేలకు మధ్యలో సమయం ఇచ్చి, హెల్త్ సిబ్బంది ఉన్న సమయంలోనే సర్వేలు జరిగేలా చూడాలని కోరారు. ఎఎన్‌సిలు టార్గెట్ ఇవ్వడం, టార్గెట్లు పూర్తికాకపోతే ఇబ్బంది పెట్టడంతో ఆశాలు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని తెలిపారు. ప్రశాంతమైన వాతావరణంలో పనిచేసేలా చూడాలని కోరారు.

వర్కర్లకు వేతనాలు పెంచాలని, కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్‌ను ఆశాలుగా మార్పు చేయాలని, సెలవులు, దహన సంస్కారాల ఖర్చులు ఇవ్వాలని మరో వినతిపత్రం అందించారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆశా వర్కర్ల సంఖ్యను పెంచాలని కోరారు. ఆదాయ పరిమితితో సంబంధం లేకుండా సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. పిహెచ్‌సికి వెళ్లిన ప్రతి సందర్భంలో టిఎ, డిఎ ఇవ్వాలని కోరారు. పర్మినెంట్ పోస్టుల భర్తీ సందర్భంగా ఎఎన్‌ఎం, జిఎన్‌ఎం శిక్షణ అయిన ఆశాలకు ప్రాధాన్యత కల్పించాలని తెలిపారు. ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, ప్రభుత్వమే నియామకాలు చేపట్టాలని కోరారు. ప్రమాదవశాత్తు మరణించిన, అనారోగ్యం పాలైన ఆశా వర్కర్ల స్థానంలో కుటుంబ సభ్యులకు అవకాశం కల్పించాలని కోరారు.

స్క్రాప్ పేరుతో 'లిక్విడ్' అమ్ముకునే కుట్ర!

- విలువైన స్టీల్ నేలపాలు
- యాజమాన్యం లూటీపై విచారణ జరపాలి: నర్సింగరావు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

స్క్రాప్ పేరుతో స్టీల్ లిక్విడ్‌ను విశాఖ ఉక్కు యాజమాన్యం నేలపాలు చేస్తోంది. గడిచిన ఏడాది కాలంగా ఈ పూల్డ్ ఐరన్‌ను నిలుపుదల చేశారు. తాజాగా ఈ నెల రెండవ తేదీన 300 టన్నులు, మూడవ తేదీన 1200 టన్నులు, నాల్గవ తేదీన 600 టన్నులు పూల్డ్ ఐరన్ తయారుచేశారు. కాంట్రాక్టర్లకు లాభం చేకూర్చేందుకు ఈ విధంగా చేయడం స్టీల్‌ప్లాంట్ పరిశ్రమకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని కార్మికులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు.

నేలపాల్జేస్తున్న స్టీల్ లిక్విడ్

ఉత్పత్తికి సరిపడా రా మెటీరియల్ అందుబాటులో లేదని చెబుతున్న యాజమాన్యం.. ఉత్పత్తి చేస్తే దాన్ని నేలపాలు చేయడం తగదన్నారు. ఈ విషయంపై తగిన విచారణ చేపట్టాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బ్లాస్ట్ ఫర్నేస్ హాట్ మెటల్ ఎస్‌ఎంఎస్‌కు వెళ్లకుండా స్క్రాప్ పిట్‌లో పోసి స్క్రాప్‌గా తయారుచేయడం నష్టమని గతంలో యాజమాన్యమే చెప్పిన విషయాన్ని ఆయన ఉటంకించారు.

స్క్రాప్ కాంట్రాక్టర్లకు లబ్ధిచేకూర్చేందుకు ఈ విధంగా చేస్తున్నారని ఎస్‌ఎంఎస్ -2లో ప్రమాదం సందర్భంగా ఢిల్లీలోని స్టీల్ జాయింట్ సెక్రటరీ సి.సంజయ్‌రాయ్‌ను గతంలో కలిసిన యూనియన్ నాయకులతో స్వయంగా ఆయనే అన్నారని పేర్కొన్నారు. బాధ్యులను గుర్తించి, దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు.

ఉలవపాడు స్టేషన్ ఆవరణలో సిపిఎం నాయకులు

నిర్బంధం నీడలో ప్రజాభిప్రాయ సేకరణ

సిపిఎం నేతల ముందస్తు అరెస్టు

ప్రజాశక్తి- ఉలవపాడు, గుడ్లూరు రూరల్

నెల్లూరు జిల్లా కందుకూరు నియోజకవర్గం గుడ్లూరు మండలం చేవూరులో ఏర్పాటు చేయనున్న బిపిసిఎల్ కోసం భూసేకరణ చేపట్టేందుకు శుక్రవారం నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ నిర్బంధపు నీడలో కొనసాగింది. రైతుల తరపున మాట్లాడే అవకాశం ఇవ్వకుండానే ముందస్తుగా సిపిఎం నాయకులను అరెస్టు చేశారు. సభ ముగిసేంత వరకూ వారిని స్టేషన్‌లోనే ఉంచారు. కొద్దిమంది రైతులతోనే ప్రజాభిప్రాయ సేకరణను మమ అనిపించారు. గురువారం అర్ధరాత్రి, శుక్రవారం తెల్లవారుజామున సిపిఎం నేతలు, ఆందోళనకారులను కందుకూరు, గుడ్లూరు మండల పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్టయిన వారిలో సిపిఎం ఉలవపాడు ప్రాంతీయ కమిటీ కార్యదర్శి జివిబి కుమార్, కందుకూరు సిపిఎం కార్యదర్శి ఎస్.ఎ.గౌస్ బాషా, సిపిఎం గుడ్లూరు ప్రాంతీయ కమిటీ కన్వీనర్ జి.వెంకటేశ్వర్లు, సిపిఎం నాయకులు ఉపేంద్ర బాబు, గోచిపాతల జక్రయ్య (చక్రి) కాకు.మల్లికార్జున, మిరియం.వెంకట్రావు, రావూరు, తదితరులు ఉన్నారు. సిపిఎం నేతలను అక్రమ అరెస్టును జిల్లా కార్యదర్శి మూలం రమేష్ ఖండించారు. ప్రజాభిప్రాయ సేకరణలో కలెక్టర్ హిమాన్షు శుక్లా మాట్లాడుతూ...బిపిసిఎల్ అనేది కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అని బ్యాంకుల నుండి వారు ఎటువంటి అప్పులు తీసుకోవాల్సిన అవసరం లేదన్నారు. ప్రజలు స్థానిక శాసనసభ్యులు లేవనెత్తిన పలు అంశాలు మొత్తం రికార్డు చేయబడిందని, వీటిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పంపిస్తామని తెలిపారు. సరైన నివేదిక ఆధారంగా రాతపూర్వకంగా అందరికీ తెలియజేస్తామన్నారు. ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ.. భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేయాలని, రైతు కూలీలను, మత్స్యకారులను ఆదుకోవాలన్నారు. విద్య, ఉపాధి, ఉచిత వైద్యం వంటి కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపట్టాలని, కొన్ని గ్రామాలకు ఆర్ అండ్ ఆర్ అమలు చేయాలని కోరారు. భూసేకరణ సమయంలో ప్రజలకు ఇచ్చిన మాటలను కంపెనీలు మరవ కూడదన్నారు. కందుకూరు సబ్ కలెక్టర్ హిమవంశీ, కావలి రెవెన్యూ డివిజనల్ అధికారి చైతన్య, వివిధ శాఖల అధికారులు, కంపెనీ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

తెలంగాణ హైకోర్టుకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ క్షమాపణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలంగాణ తెలంగాణ హైకోర్టుకు హాజరై క్షమాపణ చెప్పారు. బతుకమ్మకుంట కేసు విచారణలో భాగంగా ఆయన శుక్రవారం కోర్టుకు హాజరయ్యారు. ఈ కేసులో హైడ్రాపై ఎ సుధాకర్‌రెడ్డి అనే వ్యక్తి కోర్టు ధిక్కరణ పిటిషన్ వేశారు. ఈ క్రమంలో న్యాయస్థానం ఆదేశాలతో రంగనాథ్ కోర్టుకు వచ్చారు. హైదరాబాద్ బతుకమ్మకుంట పరిధిలోని ప్రయివేటు స్థలానికి సంబంధించి యథాతథస్థితిని కొనసాగించాలని, జూన్ 12న ఇచ్చిన ఉత్తర్వులను ఉల్లంఘించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై కోర్టు ధిక్కరణ కింద చర్యలు తీసుకోవాలంటూ సుధాకర్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై అక్టోబరు 31న విచారించిన హైకోర్టు కోర్టు ధిక్కరణ చర్యలు ఎందుకు తీసుకోరాదో నవంబరు 27న వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వాలంటూ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేసింది. అయితే బాచుపల్లిలో అత్యవసర పనులు ఉన్నందున హాజరుకాలేకపోతున్నానని, మినహాయింపు కోరుతూ రంగనాథ్ మధ్యంతర పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ మౌసమీ భట్టాచార్య, జస్టిస్ బిఆర్ మధుసూదన్‌రావులతో కూడిన ధర్మాసనం నవంబర్ 27న విచారణ చేపట్టింది. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది స్వరూప్ ఊరిళ్ల వాదనలు వినిపిస్తూ, తప్పనిసరి అధికారిక విధులతోపాటు, తన హాజరుతో కోర్టును ఇబ్బంది పెట్టరాదన్న కారణంగా మినహాయింపు కోరుతున్నారనగా ధర్మాసనం తీవ్రంగా స్పందిస్తూ, ఆయన కోర్టు పట్ల చూపిన దయకు అభినందనలు తెలియజేస్తున్నామని వ్యాఖ్యానించింది. కోర్టు తలచుకుంటే ధిక్కరణను ఎదుర్కొంటున్న కమిషనర్‌ను ఉదయం నుంచి సాయంత్రం వరకు కోర్టులో నిలబెట్టగలదన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని హెచ్చరించింది. హాజరు మినహాయింపునకు నిరాకరిస్తూ కమిషనర్ దాఖలు చేసిన మధ్యంతర పిటిషన్‌ను కొట్టేసింది. ఈ క్రమంలో శుక్రవారం హైడ్రా కమిషనర్ రంగనాథ్ తాజాగా హైకోర్టు ఎదుట హాజరై క్షమాపణలు చెప్పారు.

విద్యార్థి ప్రోగ్రెస్ కార్డును పరిశీలిస్తున్న పవన్ కల్యాణ్

కేరళ తరహా విద్యావిధానం అవసరం

- సినిమాలు చూసి చెడిపోవద్దు
- తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశంలో పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి-చిలకలూరిపేట (పల్నాడు జిల్లా)

కేరళ తరహా విద్యావిధానం మనకూ అవసరమని, అక్కడ విద్యార్థి తల్లిదండ్రుల సంఘాలు చాలా బలంగా ఉన్నాయని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అన్నారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేట పట్టణంలోని శ్రీ శారదా జెడ్‌పి పాఠశాలలో నిర్వహించిన మెగా పేరెంట్, టీచర్ల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. పాఠశాలను పరిశీలించడంతోపాటు విద్యార్థులతో ముచ్చటించారు. విద్యార్థుల సాంస్కృతిక, క్రీడా ప్రదర్శనలను తిలకించారు. ఈ సందర్భంగా పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ.. సినిమాలు వినోదం కోసమేనని వాటిని చూసి విద్యార్థులు, యువత చెడిపోవద్దని సూచించారు. 1600 మంది చదువుతున్న ఈ పాఠశాలలో కంప్యూటర్లు, లైబ్రరీలో పుస్తకాలు, ఆటస్థలం తదితర సదుపాయాలు సరిగా లేకపోవడం దారుణమన్నారు. పాఠశాలకు సమీపంలో రెండెకరాల స్థలాన్ని చూపిస్తే మైదానానికి ఇప్పించే బాధ్యత తనదని, 25 కంప్యూటర్లు, లైబ్రరీకి పుస్తకాలు తానే ఇస్తానని ప్రకటించారు. వివిధ రూపాల్లో గంజాయి లభ్యమవుతున్నట్లు తెలిసిందని, గంజాయితో విద్యార్థులెక్కడైనా పట్టుబడితే క్షమించబోమని హెచ్చరించారు. పిల్లలకు ఖాళీ సమయాల్లో సెల్‌ఫోన్లు ఇవ్వకుండా శాస్త్రవేత్తల గురించి చెప్పాలని తల్లిదండ్రులకు సూచించారు. పదిమంది కుటుంబ సభ్యులు కలిసి వారి పిల్లల కోసం చిన్నపాటి గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసి వారు అక్కడే చదువుకునేలా చేయాలన్నారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, పల్నాడు జిల్లా కలెక్టర్ కృతికశుక్ల మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న విఆర్‌ఎలు

పే స్కేలు కోసం విఆర్‌ఎల ధర్నా

- కలెక్టరేట్ల వద్ద ఆందోళనలు

ప్రజాశక్తి - యంత్రాంగం

తక్షణమే పే స్కేలు అమలు చేయాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా విఆర్‌ఎలు గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం ఆధ్వర్యంలో ఆయా కలెక్టరేట్‌ల వద్ద శుక్రవారం ధర్నాలు నిర్వహించారు. నెల్లూరు, శ్రీకాకుళం, విశాఖ, అన్నమయ్య విజయనగరం జిల్లాల కలెక్టరేట్ల వద్ద అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. నెల్లూరులో విఆర్‌ఎ సంఘం యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు కె.పెంచలనరసయ్య మాట్లాడుతూ నామినీలుగా పనిచేస్తున్న వారిని విఆర్‌ఎలుగా గుర్తించాలని, అర్హులైన వారికి ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. విఆర్‌ఎలు, పార్ట్ టైం ఉద్యోగులు రాత్రి, పగలు తేడా లేకుండా పనిచేస్తున్నారన్నారు. ఎనిమిదేళ్లుగా ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా వేతనం పెంచలేదన్నారు. సమస్యలకు ప్రభుత్వం పరిష్కారం చూపించాలని విన్నవిస్తున్నా స్పందించకపోవడం దారుణమన్నారు. విఆర్‌ఒ, అటెండర్, రికార్డు అసిస్టెంట్, నైట్ వాచ్‌మెన్ పోస్టులను విఆర్‌ఎల చేత భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డిఆర్‌ఒకు వినతిపత్రం అందజేశారు. విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద, అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఐటిడిఎ గేటు వద్ద ధర్నా నిర్వహించారు. శ్రీకాకుళం కలెక్టరేట్ వద్ద ధర్నా అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.వి.లక్ష్మణమూర్తికి వినతిపత్రం అందజేశారు. విజయనగరం కలెక్టరేట్ వద్ద ధర్నాలో విఆర్‌ఎల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు బి.సూర్యనారాయణ మాట్లాడారు. అన్నమయ్య జిల్లా రాయచోటి కలెక్టరేట్ వద్ద విఆర్‌ఎలు నిరసన తెలిపారు. వారి నిరసనకు సిఐటియు జిల్లా నాయకులు సంఘీభావం తెలిపారు. నిరసన అనంతరం విఆర్‌ఎలు, సిఐటియు నాయకులు అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు.

మహిళ శరీరంలో సర్జికల్ బ్లేడు

- డాక్టర్ సస్పెన్షన్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా/అమరావతి బ్యూరో

కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లో ప్రమాదకరమైన నిర్లక్ష్యాన్ని ప్రదర్శించిన వైద్యుడిని సస్పెండ్ చేస్తూ వైద్యారోగ్య శాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట ఏరియా వైద్యశాలకు పట్టణంలోని బాలయ్య నగర్‌కు చెందిన రమాదేవి గతనెల 26న కుటుంబ ఆపరేషన్ కోసం వచ్చారు. అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ టి.నారాయణస్వామి ఆపరేషన్‌ను పూర్తి చేసిన అనంతరం సర్జికల్ బ్లేడును మహిళ తొడ భాగంలో వదిలేశారు. అనంతరం బాధితురాలు తీవ్ర నొప్పితో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో పరీక్షలు చేయించుకోగా తొడ భాగంలో సర్జికల్ బ్లేడును గుర్తించారు. ఈ విషయం వెలుగులోకి రావడంతో సిఎం చంద్రబాబు స్పందించారు. సిఎం ఆదేశాలతో వైద్యారోగ్య శాఖ విచారణ చేపట్టింది. డాక్టర్ టి.నారాయణ స్వామి నిర్లక్ష్యంగా వ్యవహరించారని నిర్ధారణ కావడంతో ఆయనపై సస్పెన్షన్ వేటువేసింది. బాధిత మహిళకు తన హాస్పిటల్లో ఉచితంగా ఆపరేషన్ చేసి బ్లేడును తొలగించినట్లు వైసిపి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

విధుల్లో తీవ్ర నిర్లక్ష్యం వహించిన నరసరావుపేట ప్రభుత్వాస్పత్రి సివిల్ అసిస్టెంట్ సర్జన్ టి నారాయణ స్వామిని రాష్ట్ర ప్రభుత్వం సస్పెండ్ చేసింది. సిఎం చంద్రబాబు ఆదేశాల మేరకు వైద్యారోగ్యశాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. గత నెల 26న నరసరావుపేట ప్రభుత్వాస్పత్రిలో ఓ మహిళకు ట్యూబెక్టమీ ఆపరేషన్ నిర్వహించి నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఘటనపై విచారణ జరిపిన అనంతరం ఆయనను సస్పెండ్ చేసింది. ఆపరేషన్ చేసి మహిళ శరీరంలో తీవ్ర నిర్లక్ష్యంతో సర్జికల్ బ్లేడ్‌ను వదిలేసినట్లు తరువాత జరిపిన వైద్య పరీక్షల ద్వారా వెలుగు చూసింది.

రూ.4.5 కోట్ల హవాలా డబ్బు స్వాధీనం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అక్రమంగా తరలిస్తున్న వాహలా డబ్బును హైదరాబాద్ నార్త్‌జోన్ బోయిన్‌పల్లి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నార్త్ జోన్ డిసిపి సాధన రష్మి పెరుమాల్ తెలిపిన వివరాల మేరకు... గతంలో బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఓ చీటింగ్ (50 లక్షల) కేసు నమోదైంది. ఆ కేసు విచారణలో భాగంగా దర్యాప్తు కొనసాగుతోంది. ఈ క్రమంలో ఆ కేసులో నిందితులను ట్రేస్ చేస్తుండగా హవాలా డబ్బులు తరలిస్తున్న ముఠా గురించి తెలిసింది. దీంతో ఔటర్ రింగ్ రోడ్డు వద్ద నిందితుల కోసం పోలీసులు కాపుకాశారు. పోలీసులను చూసి నిందితులు పారిపోతుండగా వారి వాహనాలను వెంబడించారు. మహబూబ్‌నగర్ అడ్డాకుల పోలీస్‌స్టేషన్ పరిధిలోని టోల్‌గేట్ వద్ద నిందితులను పట్టుకున్నారు.

వారి నుంచి రూ.నాలుగు కోట్ల ఐదు లక్షలను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. నిందితులు ప్రకాష్ మోతిబాయ్ ప్రజాపతి, ప్రగ్నేష్ కీర్తి భాయ్ ప్రజాపతిని అరెస్టు చేశారు. హోండా క్రెటా కారు సీట్ భాగంలో బాక్స్‌లు సెట్ చేసి అందులో హవాలా డబ్బును దాచారు. సీజ్ చేసిన డబ్బులను సంబంధిత ఐటీ అధికారులకు అప్పగిస్తామని డిసిపి తెలిపారు.

రాష్ట్రంలోనూ ఎస్ఐఆర్ వేధింపులు

- సచివాలయాల ఉద్యోగులకు రోజువారీ టార్గెట్లతో ఒత్తిళ్లు
- పనిభారం తగ్గించాలని ఎస్ఇసికి వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్ర ఎన్నికల సంఘం (సిఇసి) చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ కారణంగా రాష్ట్రంలోనూ సంబంధిత సిబ్బందిపై వేధింపులు పెరుగుతున్నాయన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఓట్ల వెరిఫికేషన్‌కు రోజువారీ టార్గెట్లతో సచివాలయాల సిబ్బందిపై పని భారం మోపుతున్నారన్న విమర్శలు వస్తున్నాయి. క్షేత్రస్థాయిలో ఉన్నతాధికారుల నుంచి తమకు తీవ్రస్థాయిలో వేధింపులు ఎదురౌతున్నాయని గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎమ్‌డి జానిపాషా, బత్తుల అంకమ్మరావు పేర్కొన్నారు. టార్గెట్లు లేకుండా చూడాలని, పని భారం తగ్గించాలని కోరుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయంలోనూ, గ్రామ వార్డు సచివాలయాల శాఖ కార్యాలయంలోనూ ఉన్నతాధికారులకు వారు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఇప్పటికే జాబ్ చార్ట్ విధులు, ప్రభుత్వ సర్వేలతో పనిభారం మోస్తున్న తమపై అదనంగా ఎన్నికల విధులు మోపారని తెలిపారు. ఈ పరిణామాలతో సచివాలయ ఉద్యోగులు అనారోగ్యం పాలవుతున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. సచివాలయ ఉద్యోగులను బిఎల్ఒ విధుల నుంచి విముక్తి కల్పించాలని కోరారు.

ఎర్రచందనం స్మగ్లర్‌కు ఐదేళ్ల జైలు

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)

ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన స్మగ్లర్ పళని లక్ష్మణన్‌కు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.ఆరు లక్షలు జరిమానా విధిస్తూ ఆర్ఎస్ఎస్ ఎడిజె కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి శు క్రవారం తీర్పునిచ్చారు. క్రైమ్ నెంబరు 12/2016 కేసులో ఈ ముద్దాయి తిరుపతి జిల్లా తిరుమల, తుంబురు తీర్థం పరిధిలో అరెస్టయ్యాడు. తమిళనాడు రాష్ట్రం వేలూరు జిల్లాకు చెందిన పళని లక్ష్మణన్ నేరం రుజువు కావడంతో జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. తదుపరి కోర్టు ఆదేశాల మేరకు అతనిని నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించారు. ఆంధ్రప్రదేశ్‌లోని శేషాచలం రిజర్వు ఫారెస్టులోని అతి విలువైన సహజ సంపద ఎర్రచందనం చెట్లను నరికి అక్రమ రవాణా చేయడం, అడవిలోకి అక్రమంగా ప్రవేశించే నేరస్తులకు ఇది ఒక హెచ్చరికగా పరిగణించబడుతుందని టాస్క్‌ఫోర్సు ఎస్‌పి పి.శ్రీనివాస్ అన్నారు.

'సోలార్' ప్రజలకు శాపం కాకూడదు

వ్యవసాయ పంపుసెట్లకు సౌరీకరణపై ఎపిఇఆర్‌సి బహిరంగ విచారణలో నిపుణుల అభిప్రాయాలు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

సోలార్ ఒప్పందాలు బడా కంపెనీలకు వరంగాను, ప్రజలకు శాపంగాను మారకూడదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు అన్నారు. వ్యవసాయ పంపుసెట్లకు ఫీడర్ లెవల్ సౌరీకరణ (సోలార్ విద్యుత్ అందించడం)లో భాగంగా కుసుం-సి పథకంలో విద్యుత్ కొనుగోలు, టారిఫ్ నిర్ణయంపై కర్నూలులోని విద్యుత్ నియంత్రణ మండలి (ఎపిఇఆర్‌సి) కార్యాలయంలో చైర్మన్ పివిఆర్ రెడ్డి ఆన్‌లైన్ ద్వారా శుక్రవారం బహిరంగ విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆన్‌లైన్ ద్వారా బాబూరావు పాల్గొని మాట్లాడారు. సోలార్ విద్యుత్ రెండు రూపాయలకు లభిస్తుండగా రూ.3.18కు ఒప్పందం ప్రతిపాదించడం అక్రమమన్నారు. ఛార్జీలు పెంచేది లేదంటూనే టిడిపి కూటమి పాలనలో ఇప్పటికే రూ.24 వేల కోట్ల భారం వేశారన్నారు. మరో రూ.12,771 కోట్ల ట్రూ అప్ భారానికి రంగం సిద్ధం చేశారన్నారు. సోలార్ విద్యుత్తులో బడా కంపెనీలకు మేలు చేసి, సామాన్యులపై భారాలు వేసే కేంద్ర ప్రభుత్వ షరతులు విడనాడాలన్నారు. సెకీ ద్వారా అదాని సంస్థ నుంచి ఏడు వేల మెగావాట్ల విద్యుత్ యూనిట్‌కు రూ.2.49కు కొనుగోలు ఒప్పందం చేయడమే భారమని విమర్శలు ఉండగా, వ్యవసాయ పంపుసెట్లకు వినియోగించే యూనిట్ విద్యుత్‌కు రూ.3.18 చొప్పున కొనుగోలు చేయడానికి ప్రభుత్వం ప్రతిపాదించడం దుర్మార్గమన్నారు. అన్ని సంస్థలు పోటీలో పాల్గొనే అవకాశం లేకుండా, కేవలం ఎంపిక చేసిన సంస్థలే టెండర్‌లో పాల్గొనే అవకాశం కల్పించడం తగదన్నారు. ఎఫ్‌పిపిసిఎ పేరుతో ప్రతినెల యూనిట్‌కు అదనంగా 40 పైసలు చొప్పున

ఎపిఇఆర్‌సి బహిరంగ విచారణలో ఆన్‌లైన్ ద్వారా మాట్లాడుతున్న సిహెచ్ బాబూరావు

అదనపు ఛార్జీలు వసూలు చేసే విధానం ఇంకా కొనసాగుతోందన్నారు.

విద్యుత్ ఉత్పత్తి వ్యయం తగ్గినప్పుడు ఎఫ్‌పిపిసిఎ ఎందుకు వసూలు చేస్తున్నారని ప్రశ్నించారు. అదాని విద్యుత్ సరఫరా ప్రారంభం కాకుండానే రాష్ట్రంలో నేడు మిగులు విద్యుత్ ఉందని, వ్యవసాయ విద్యుత్‌కు ఇప్పుడు అదనంగా తీసుకునే సోలార్ విద్యుత్ ఎలా వినియోగిస్తారని ప్రశ్నించారు. సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు మూల వ్యయం, నిర్వహణ వ్యయం, స్థలం కేటాయింపు అధికంగా అంచనా వేసి, అధిక రేట్లు నిర్ణయించి ప్రజలపై భారం మోపడం సరికాదన్నారు. నివాసాలలో మిగులు వచ్చిన సోలార్ విద్యుత్తుకు యూనిట్ రూ.2.10 ఇస్తూ బడా సంస్థల నుంచి రూ.3.18కు కొనుగోలు చేయటం దుర్మార్గమన్నారు. బహిరంగ టెండర్లు పిలవాలని, సోలార్ విద్యుత్ కొనుగోలు రేట్లు తగ్గించాలని కోరారు. ట్రూ అప్, ఎఫ్‌పిపిసిఎ ఛార్జీల భారాలను రద్దు చేయాలని, ప్రతిపాదనలో ఉన్న రూ.12,771 కోట్ల ట్రూ అప్ ఛార్జీలను ఉపసంహరించుకుంటూ ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకోవాలని కోరారు. కమిషన్ బహిరంగ విచారణలో ప్రయివేటు కంపెనీ ప్రతినిధులను అనుమతించకూడదని కోరారు.

ఎక్కువ ధరకు ఎందుకు కొనాలి : సీనియర్ జర్నలిస్టు వేణుగోపాలరావు

బయట దొరుకుతున్న ధర కంటే ఎక్కువ ధరకు ఎందుకు కొనాలని సీనియర్ జర్నలిస్టు, విద్యుత్ సంస్థల విశ్లేషకులు ఎం వేణుగోపాలరావు ప్రశ్నించారు. యూనిట్ సోలార్ ధర రాజస్థాన్‌కు, ఆంధ్రప్రదేశ్‌కు తేడా ఉంటుందా? అనే సందేహం వ్యక్తం చేశారు. ఇది రియల్ కాంపిటీటివ్ బిడ్డింగ్ కాదన్నారు. తమ ప్రశ్నలకు డిస్కంలు మొక్కుబడి జవాబు ఇచ్చారని వేణుగోపాలరావు అసహనం వ్యక్తం చేశారు.

ఫ్లాగ్‌షిప్.. కార్యక్రమాల్లో ఏ ఒక్క ఉద్యోగికీ మినహాయింపుల్లేవు

- జిఎస్‌డబ్ల్యుఎస్ డైరెక్టర్ శివప్రసాద్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రభుత్వ ఫ్లాగ్‌షిప్ కార్యక్రమాల్లో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు తప్పనిసరిగా పాల్గొనాలని, ఉద్యోగులెవరికీ ఎలాంటి మినహాయింపులు లేవని జిఎస్‌డబ్ల్యుఎస్ శాఖ డైరెక్టర్ శివప్రసాద్ పేర్కొన్నారు. ఈ మేరకు అన్ని జిల్లాల కలెక్టర్లకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమం దృష్ట్యా జాబ్ చార్ట్‌తో పాటు గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులు తప్పనిసరిగా పాల్గొనే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు ఆయన సూచించారు. పంచాయతీ కార్యదర్శి గ్రేడ్-1 నుంచి గ్రేడ్-4 వరకు , విఆర్‌ఓల్లో కొందరు పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొనక పోవడంతో ఈ సూచనలు చేస్తున్నట్లు ఆయన ఉత్తర్వుల్లో సూచించారు. ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు

ఉద్యోగులందరూ తప్పనిసరిగా హాజరు కావాలని, ప్రభుత్వం జారీ చేసే సూచనలు, మార్గదర్శకాలకు అనుగుణంగా సచివాలయ ఉద్యోగులందరూ అప్పగించిన కార్యక్రమంలో పాల్గొనడం తప్పనిసరి అని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల భాగస్వామ్యం 100శాతం ఉండేలా జిల్లా కలెక్టర్లు చూడాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

అటెండెన్స్ యాప్‌లో మార్పులు :

గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల బయోమెట్రిక్ అటెండెన్స్‌యాప్‌లో ఆ శాఖ మార్పులు తీసుకురానుంది. ఉదయం కార్యాలయంలో ఇన్ అటెండెన్స్ 9.30గంటల నుంచి 11గంటల వరకు , సాయంత్రం 5గంటల నుంచి 6.30గంటల వరకు ఔట్ అటెండెన్స్‌కు అనుమతించేలాగా యాప్‌లో మార్పులు చేస్తున్నట్లు ఆ శాఖలో చర్చ నడుస్తోంది.

ఓపెన్ స్కూల్ పరీక్షల షెడ్యూల్ విడుదల

- మార్చి 2 నుంచి ఇంటర్, 16 నుంచి టెన్త్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం(ఓపెన్ స్కూల్ సొసైటీ) నిర్వహించే టెన్త్, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల షెడ్యూల్ విడుదలైంది. మార్చి 2 నుంచి 13వ తేది వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగుతాయని సొసైటీ డైరెక్టర్ ఆర్ నరసింహారావు శుక్రవారం ఒక ప్రకటన ద్వారా వెల్లడించారు. ప్రతి రోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తామని తెలిపారు. ప్రాక్టికల్స్ ఏప్రిల్ 11 నుంచి 18వ తేది వరకు నిర్వహిస్తామని పేర్కొన్నారు. పదో తరగతి పరీక్షలు మార్చి 16 నుంచి 28వ తేది వరకు ఉంటాయని తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహిస్తామని వెల్లడించారు. పరీక్ష టైంటేబుల్‌ను www.apopen-schools.ap.gov.in వెబ్‌సైట్‌లో ఉంచినట్లు పేర్కొన్నారు.

నేటి నుంచి లోకేష్ అమెరికా, కెనడా పర్యటన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మరోసారి అమెరికా పర్యటనకు వెళ్లనున్నారు. ఈ నెల 6 (శనివారం) నుంచి 10వ తేదీ వరకు ఐదు రోజుల పాటు అమెరికా, కెనడా దేశాల్లో పర్యటించనున్నారు. రాష్ట్రానికి పెట్టుబడుల సాధనే లక్ష్యంగా పర్యటించనున్నారని మంత్రి కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. 6న తొలిరోజు డల్లాస్‌లో తెలుగు డయాస్పోరా సమావేశంలో పాల్గొంటారని తెలిపింది. 8, 9 తేదీల్లో శాన్‌ఫ్రాన్సిస్కో వేదికగా పలు కంపెనీల ప్రతినిధులతో సమావేశమవుతారని, 10న కెనడాలోని టోరంటోలో పర్యటిస్తారని పేర్కొంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మంత్రి లోకేష్ అమెరికాలో పర్యటించడం ఇది రెండోసారి అని తెలిపింది. పెట్టుబడుల సాధన కోసం 18 నెలల్లో లోకేష్ అమెరికా, దావోస్, సింగపూర్, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో పర్యటించారని పేర్కొంది.

పోలవరం, అమరావతి అంతులేని, ముగింపులేని కథలు

- మాజీ మంత్రి అంబటి రాంబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పోలవరం ప్రాజెక్టు, రాజధాని అమరావతి అంతులేని, ముగింపులేని కథలని మాజీ మంత్రి అంబటి రాంబాబు విమర్శించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. పోలవరాన్ని 41 మీటర్లకే పరిమితం చేసి బ్యారేజీ స్థాయికి చేర్చారని, దీనిపై ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. పోలవరాన్ని ఎటిఎంలా వాడుతున్నారని అన్నారు. విభజన చట్టం ప్రకారం కేంద్రం పూర్తి చేయాల్సి ఉంటే చంద్రబాబు తీసుకున్నారని, కాపర్‌డ్యామ్ కట్టకుండా డయాఫ్రం వాల్ కట్టారని, అది కొట్టుకుపోవడంతో రూ.వెయ్యి కోట్ల నష్టం జరిగిందని, స్పిల్‌వే నిర్మిస్తే డబ్బులు రావని వదిలేశారని తెలిపారు. తొలిదశ నిర్మాణానికి రూ.12,175 కోట్లు ఎన్నికలకు ముందే రిలీజ్ కావాల్సి ఉందని, చంద్రబాబు కుట్రపన్ని రాకుండా చేశారని అన్నారు. 45.72 మీటర్లు కట్టకపోతే ఉత్తరాంధ్రకు నీరు వెళ్లదని పేర్కొన్నారు. అమరావతి గురించి మాట్లాడే చంద్రబాబు ఇప్పటి వరకూ ఎందుకు ఇల్లు కట్టుకోలేదని ప్రశ్నించారు. అడ్డగోలుగా అంచనాలు పెంచుకుంటూ పోతున్నారని, దోపిడీకి పరాకాష్టగా అమరావతి నిలుస్తుందని విమర్శించారు. ధాన్యం సేకరించడం చేతగాని నాదెండ్ల మనోహర్ కూడా జగన్‌ను విమర్శిస్తున్నారని పేర్కొన్నారు. రేషన్ బియ్యంలో కమీషన్లు దండుకుంటున్నారని ఆరోపించారు. డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ సీజ్ చేయాలన్న షిప్‌ను సీజ్ చేశారా? అని ప్రశ్నించారు. ఆస్పత్రుల్లో సరైన వైద్యం అందించలేకపోతున్న మంత్రి సత్యకుమార్ కూడా విమర్శలు చేస్తున్నారని అన్నారు. అలాగే పులివెందుల ఎమ్మెల్యే అని సంబోధిస్తున్న వారందరూ ఎక్కడో ఒక్కచోట నుండి ఎమ్మెల్యేలే అనే విషయాన్ని మర్చిపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఏకపక్షంగా పరకామణి కేసు విచారణ

- టిటిడి మాజీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుమల తిరుపతి దేవస్థానంలో కల్తీ నెయ్యి, పరకామణి కేసుల విచారణ టిడిపి కూటమి కనుసన్నల్లో జరిగిందని మాజీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి విమర్శించారు. తిరుపతిలో మీడియాతో భూమన మాట్లాడుతూ.. గిఫ్ట్‌డీడ్‌తో ఆస్తులు రాయించినట్లు నిందితుడు రవికుమార్ చెబుతున్నాడని, రాజీచేసి ఆస్తులు రాయించలేదన్నారు. రవికుమార్ దగ్గర టీ తాగినట్లు రుజువు చేసినా రాజకీయ సన్యాసానికి సిద్ధంగా ఉన్నానని చెప్పారు. ప్రభుత్వ వేధింపుల వల్లే మాజీ ఎవిఎస్ఒ సతీష్‌కుమార్ మరణించారని ఆరోపించారు. తాము, వైవి సుబ్బారెడ్డి టిటిడి చైర్మన్‌గా ఉన్నప్పుడు కొనసాగిన బోర్డు సభ్యులే ప్రస్తుతం ఉన్నారని, వారిని ఎందుకు విచారించలేదని ప్రశ్నించారు. పరకామణి కేసు విచారణ ఏకపక్షంగా జరిగిందని విమర్శించారు. న్యాయస్థానం పట్ల తనకు ఎనలేని గౌరవం ఉందని, అయితే ముఖ్యమంత్రి చంద్రబాబు, టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు కుట్రపూరితంగా వ్యవహరించి తమపై విమర్శలు చేశారన్నారు.

సిగరెట్లలో గంజాయి

- ఏలూరులో విచ్చలవిడిగా విక్రయాలు
- మత్తులో ఊగుతున్న యువత
- పోలీస్ నిఘా లేని ప్రాంతాల్లో గుప్పు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రాష్ట్రంలో గంజాయి ముఠా రోజురోజుకు కొత్తదారులు వెతుక్కుంటుంది. పోలీసుల నిఘా పెరగడంతో సిగరెట్లలో గంజాయిని పెట్టి దుకాణాల్లో విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. గంజాయి సిగరెట్ ఒకటి రూ.50, ప్యాకెట్ అయితే రూ.వంద నుంచి రూ.500 వరకూ విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. ఏలూరు జిల్లా కేంద్రం ఏలూరులోని వైఎస్ఆర్ కాలనీ, కొత్తపేటలోని చేపల తూము సెంటర్, తంగెళ్లమూడి, బాలయోగి వంతెన, బీడీకాలనీ, లంబాడీ పేట వంటి ప్రాంతాల్లో జోరుగా విక్రయాలు సాగుతున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాంతాల్లో సాయంత్రం అయితే దారి వెంట వెళ్లే ద్విచక్రవాహనదారులను, పాదాచారులను సైతం కొంతమంది గంజాయి మత్తులో అడ్డుకుంటున్నట్లు స్థానికులు చెబుతున్నారు. పోలీసుల నిఘా లేనటువంటి హిందూ, ముస్లిం, క్రిస్టియన్ శ్మశాన వాటికల్లో గంజాయి గుప్పుమంటుంది. శ్మశానాలను గంజాయి స్థావరాలుగా మార్చుకుంటున్నట్లు స్థానికులు చెబుతున్నారు. యువత, విద్యార్థులే లక్ష్యంగా గంజాయి ముఠా జోరుగా విక్రయాలు చేస్తోంది.

జిల్లాలో ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకూ మొత్తం 15 గంజాయి కేసులు నమోదవ్వగా రూ.50 లక్షలకుపైగా విలువ చేసే గంజాయిని

పట్టుబడ్డ గంజాయితో పోలీస్ ఉన్నతాధికారులు (ఫైల్ ఫొటో)

పోలీసులు పట్టుకున్నారు. 12 వాహనాలను స్వాధీనం చేసుకోగా, 49 మందిని అరెస్టు చేశారు. జిల్లాకు సంబంధించి 28, ఇతర జిల్లాలకు చెందిన 18, ఇతర రాష్ట్రాలకు సంబంధించి ఐదుగురిని అరెస్టు చేశారు. పట్టుకున్న గంజాయిని గడిచిన అక్టోబర్‌లో గుంటూరులో తగలబెట్టారు. గత ప్రభుత్వ హయాంలో జిల్లావ్యాప్తంగా నాటుసారా, గంజాయి విక్రయాలు పెద్దఎత్తున పెరిగాయి. అధికార పార్టీకి చెందిన నాయకుల అండదండలు ఉండటంతో పోలీసులు సైతం ఏమీ చేయాలని పరిస్థితి అప్పట్లో కొనసాగింది.

కొంతమంది పోలీసులు సైతం గంజాయి బ్యాచ్‌తో చెట్టపట్టాలు వేసుకుని తిరిగినట్లు అప్పటో పెద్దఎత్తున విమర్శలు వెల్లువెత్తాయి. టిడిపి కూటమి ప్రభుత్వం వచ్చాక గంజాయి కట్టడికి చర్యలు తీసుకుంది. పోలీసులు ప్రత్యేక నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసి గంజాయి కట్టడి చేసేందుకు ముందుకు సాగుతున్నారు. అయినప్పటికీ వివిధ రూపాల్లో గంజాయి అమ్మకాలు సాగుతూనే ఉన్నాయి. గడిచిన ఏడాదిలో పట్టుబడిన గంజాయి లెక్కలే అందుకు ప్రత్యక్ష నిదర్శనంగా చెప్పొచ్చు.

పోలీసుల కళ్లుగప్పి విక్రయాలు

ఒడిశా నుంచి రైలు మార్గం గుండా ఏలూరుకు గంజాయి చేరుతున్నట్లు సమాచారం.రైళ్లలో సాధువుల రూపంలో ప్రయాణిస్తున్న వారి ద్వారా గంజాయి ఇక్కడకు చేరుతున్నట్లు ప్రచారం సాగుతోంది.

పోలీసులు సైతం రైలు, బస్టాండ్‌లపై ఎక్కువ నిఘా పెంచినట్లు చెబుతున్నారు. పోలీసుల కళ్లు గప్పి తాము అనుకున్న ప్రాంతాలకు గంజాయి మాఫియా సరుకును చేరుస్తోంది.

ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేశాం : డి.శ్రావణ్‌కుమార్, డిఎస్‌పి, ఏలూరు

గంజాయిని పూర్తిగా అరికట్టేందుకు ఎఎస్‌పి ఆధ్వర్యంలో ప్రత్యేక టీమ్‌లు పని చేస్తున్నాయి. రైల్వేస్టేషన్, బస్టాండ్‌లో ప్రత్యేక నిఘా పెట్టాం. గంజాయి విక్రయదారులపై పీడీ యాక్టులు పెడుతున్నాం. గంజాయి నిర్మూలనకు పోలీస్ వ్యవస్థ నిరంతరం పనిచేస్తోంది.

డివిజన్ బెంచ్‌కు 'పరకామణి' కేసు

ప్రజాశక్తి-అమరావతి

పరకామణిలో చోరి కేసు ఘటనపై సిఐడి, ఎసిబి డిజిలు వేర్వేరుగా సీల్డ్ కవర్‌లో హైకోర్టుకు నివేదిక సమర్పించారు. వాటిని పరిశీలించిన సింగిల్ జడ్జి ఈ వ్యవహారంతోపాటు చోరీ కేసును లోక్ అదాలత్ రాజీ చేసిన ఉత్తర్వుల చట్టబద్ధతను తేల్చే అంశాన్ని చీఫ్ జస్టిస్ నేతృత్వంలోని డివిజన్ బెంచ్‌కు నివేదించారు. చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్ రఘునందనరావుతో కూడిన డివిజన్ బెంచ్ వద్దకు కేసు ఫైళ్లు పెట్టాలని రిజిస్ట్రార్ (జ్యుడీషియల్)కు ఆదేశాలిచ్చారు. సీల్డ్ కవర్లో రెండు సెట్ల నివేదికలను సోమవారానికి హైకోర్టు రిజిస్ట్రార్ (జ్యుడీషియల్)కు అందజేయాలని సిఐడి డిజి, ఎసిబి డిజిలను జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. ఈ నివేదికలను తమకు ఇవ్వాలని పరకామణి చోరీ కేసు నిందితుడు రవికుమార్ తరఫున న్యాయవాది కోరగా, గతంలోనే హైకోర్టు తిరస్కరించింది. విచారణను ఈ నెల 9కి వాయిదా వేసింది. అలాగే ఇదే కేసులో ఇంప్లీడ్ పిటిషన్‌కు అనుమతినిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

భారత్‌నెట్ కోసం ఎస్‌పివి రూ.2,428 కోట్లతో 480 పంచాయితీలకు మేలు

- ఎపిబిఐఎల్‌గా నామకరణం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

గ్రామీణ ప్రాంతాలకు సైతం డిజిటల్ సేవలను విస్తరించేందుకుగాను అమలు చేస్తున్న డిజిటల్ నెట్ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఒక ఎస్‌పివి (స్పెషల్ పర్పస్ వెహికల్)ను ఏర్పాటుచేస్తూ నిర్ణయం తీసుకుంది. ఇందులో కేంద్ర ప్రభుత్వానికి సంబంధించి ఐదుగురు, రాష్ట్రం నుంచి ఐదుగురు డైరెక్టర్లుగా ఉంటారు. ఈ ఎస్పీవీకి ఎపి భారత్‌నెట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్‌గా (ఎపిబిఐఎల్)గా నామకరణం చేశారు. దీనికి సంబంధించిన మార్గదర్శకాలు కూడా శుక్రవారం విడుదల చేశారు. ఈ ఎస్‌పివిలో కేంద్రం నుంచి డిజిటల్ భారత్ అడ్మినిస్ట్రేటర్ ఎక్స్ అఫిషియో చైర్మన్‌గా ఉండగా, టెలికామ్ రాష్ట్ర సిజిఎం, స్పెషల్ డైరెక్టర్, రాష్ట్రానికి చెందిన కమ్యూనికేషన్ అక్కౌంట్స్ కంట్రోలర్‌తోపాటు ధన్‌బాద్‌లోని ఐఐటిలో పనిచేస్తున్న ప్రొఫెసర్ రవి గంగ్వార్ ఉంటారు. అలాగే రాష్ట్రం తరఫున రాష్ట్ర పెట్టుబడులు మౌళికాభివృద్ధిశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి, ఐటి శాఖ కార్యదర్శి, రాష్ట్ర ఫైబర్‌నెట్ ఎండి డైరెక్టర్లుగా ఉంటారు.

గత 2023లోనే కేంద్ర ప్రభుత్వం అమెండెడ్ భారత్‌నెట్ ప్రోగ్రామ్ కింద రూ.1,39 579 కోట్లతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు నిర్ణయించగా, 2.64 లక్షల గ్రామ పంచాయితీలకు ఫైబర్‌నెట్ అనసంధానం చేసేందుకు లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ఇందులో రాష్ట్రానికి సంబంధించి రూ.2,428 కోట్లు వ్యయం చేయనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా 664 బ్లాక్‌లకు బిఎస్ఎన్ఎల్ ద్వారా కనెక్టివిటీ అందించాలని నిర్ణయించారు. అలాగే ఇప్పటివరకు ఉన్న ఫేజ్ -1లోని నెట్ వర్క్‌ను అభివృద్ధి చేయడం, కొత్తగా 480 పంచాయితీలకు కనెక్టివిటీ ఏర్పాటుచేయడం, వాటి నిర్వహణపై దృష్టి పెట్టాల్సి ఉంటుంది.

ఆయా పోటీల్లో పాల్గొని బహుమతులు అందుకున్న విద్యార్థులు

ముగిసిన ఉద్భవ్-2025 వేడుకలు

- ఓవరాల్ ఛాంపియన్ షిప్‌గా తెలంగాణ
- 22 రాష్ట్రాలనుండి వేడుకల్లో పాల్గొన్న 1500 మంది విద్యార్థులు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

గిరిజన విద్యార్థుల కళా నైపుణ్యాలను, ప్రతిభను వెలికితీసి దేశవ్యాప్తంగా చాటి చెప్పాలనే లక్ష్యంతో కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆరో జాతీయ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ సొసైటీ సంప్రదాయ, సంస్కృతి కళా ఉత్సవం ఉద్భవ్-2025 ఉత్సవాల ముగింపు వేడుకలు కెఎల్ యూనివర్సిటీ ప్రాంగణంలో శుక్రవారం ముగిశాయి.

విద్యార్థుల మధ్య జరిగిన కళా, సాంస్కృతిక ఉత్సవాల్లో ఓవర్‌లాల్ ఛాంపియన్ షిప్‌గా తెలంగాణ రాష్ట్రం నిలిచింది. మంత్రులు తెలంగాణ విద్యార్థులకు షీల్డులను ప్రదానం చేశారు. దేశ సంస్కృతి, సంప్రదాయాలు, అభిప్రాయాలు ఆలోచనలు, ఒకరికొకరు పరస్పరం మార్చుకోవడానికి, అవలంభించడానికి ఉద్భవ్-2025 వంటి వేడుకలు ఉపయోగపడతాయని మంత్రులు పేర్కొన్నారు. ఉద్భవ్-2025 ఉత్సవాలు దేశం నలుమూలల్లోని గిరిజనుల సంప్రదాయాలు, సంస్కృతులను కలిపి ఒకే చోట ప్రతిబింబించేందుకు దోహదపడిందని మంత్రి బాల వీరాంజనేయులు తెలిపారు. మంత్రి గుమ్మిడి సంధ్యా రాణి మాట్లాడుతూ 22 రాష్ట్రాల నుండి 405 పాఠశాలలకు చెందిన 1,800 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారని, వేర్వేరు భాషలు, సంస్కృతులు ఉన్నా... ఐకమత్యంగా పాల్గొనడం అభినందనీయమని అన్నారు. మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ అడవిలో పుట్టిపెరిగిన వారు సైతం అత్యున్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన వందలాది మంది బాలబాలికలు తమ అద్భుత పాఠవాలతో దేశ సంస్కృతిని, సాంప్రదాయాలను ఎలుగెత్తి చాటడాన్ని అభినందించారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి మల్లికార్జున్ నాయక్, గురుకుల విద్యాసంస్థల సొసైటీ కార్యదర్శి గౌతమీ తదితరులు పాల్గొన్నారు.

ఎఐతో ప్రమాదంలో లక్షలాది ఉద్యోగాలు

- ఎఐ సైంటిస్ట్ జెఫ్రీ హింటన్

వాషింగ్టన్ : కృత్రిమ మేధా (ఎఐ)తో లక్షలాది ఉద్యోగాలు ప్రమాదంలో పడనున్నాయని ఎఐ గాడ్‌ఫాదర్, సైంటిస్ట్ జెఫ్రీ హింటన్ మరోసారి హెచ్చరించారు. ఎఐ వేగవంతమైన పురోగతి సామూహిక నిరుద్యోగానికి దారితీసే అవకాశాలున్నాయని అమెరికా సెనెటర్ బెర్నీ సాండర్స్‌తో కలిసి జార్జ్‌టౌన్ యూనివర్శిటీలో జరిగిన చర్చలో జెఫ్రీ ఆందోళన వ్యక్తం చేశారు. ఎఐ వల్ల భారీ నిరుద్యోగం రాబోతోందన్న విషయం చాలా మందికి స్పష్టంగా తెలుస్తోందన్నారు. టెక్ దిగ్గజాలు డేటా సెంటర్లు, చిప్స్‌పై ట్రిలియన్ డాలర్ల పెట్టుబడులు పెడుతున్నాయని చెప్పారు. తక్కువ ఖర్చుతో మానవ శ్రమను పూర్తిగా భర్తీ చేయగల ఎఐ వ్యవస్థలను రూపొందించడంపై దృష్టి సారిస్తున్నాయన్నారు.

అనిల్ అంబానీ మరిన్ని ఆస్తులు జప్తు

ముంబయి : బ్యాంక్‌లను మోసం కేసులో రిలయన్స్ గ్రూప్ చైర్మన్ అనిల్ అంబానీకి చెందిన మరిన్ని ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) జప్తు చేసింది. రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్, రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ లిమిటెడ్‌కు చెందిన రూ.1,120 కోట్ల ఆస్తులను తాజాగా అటాచ్ చేసింది. ఇందులో 18 ఆస్తులు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, బ్యాంక్ బ్యాలెన్స్, షేర్‌హోల్డింగ్ వంటివి ఉన్నాయి. రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్‌కు చెందిన 7 ఆస్తులు, రిలయన్స్ పవర్ లిమిటెడ్‌కు చెందిన రెండు ఆస్తులు, రిలయన్స్ వాల్యూ సర్వీస్ ప్రయివేటు లిమిటెడ్‌కు చెందిన 9 ఆస్తులు ఉన్నాయి. మనీలాండరింగ్‌కు సంబంధించి ఇప్పటికే రూ.8,997 కోట్ల విలువైన ఆస్తులను ఇడి అటాచ్ చేయగా.. తాజా జప్తుతో వాటి విలువ మొత్తం రూ.10,000 కోట్లకు పైగానే చేరింది. అనిల్ అంబానీకి చెందిన పలు కంపెనీలు బ్యాంక్‌లకు రూ.17వేల కోట్ల రుణాలకు మోసం చేసిన విషయం తెలిసిందే. రుణాలను అక్రమ బదిలీలకు ఉపయోగించి మనీలాండరింగ్‌కు పాల్పడింది. దీంతో సిబిఐ, ఇడి ఈ కేసును విచారించడంతో అనిల్ అంబానీకి ఉచ్చు బిగుస్తోంది.

ఒకేచోట ఏళ్ల తరబడి భార్యాభర్తలు ఉద్యోగం

- తప్పుబట్టిన హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

ఉద్యోగులైన భార్యాభర్తలు ఏళ్ల తరబడి ఒకేచోట విధులు నిర్వహించడాన్ని హైకోర్టు తప్పుబట్టింది. భార్య లేదా భర్త పనిచేస్తున్న చోటే పోస్టింగ్ తీసుకుంటున్న కొందరు ప్రభుత్వ ఉద్యోగులు జీవితాంతం ఒకే ప్రాంతంలో ఉద్యోగం చేయడాన్ని ఆక్షేపించింది. అదే విధంగా ఉద్యోగ సంఘ నేతలు ఆయా సంఘాల్లో హోదాలను చూపించి బదిలీలు లేకుండా ఏళ్ల తరబడి కొనసాగడం సరికాదంది. ఆయా ప్రాంతాల్లో పనిచేయాలనుకునే ఇతర ఉద్యోగులకు అవకాశం లేకుండా చేయడం సరికాదంది. ఈ రెండు కేటగిరీలకు మినహాయింపులు ఇవ్వడంపై లోతుగా విచారణ చేస్తామంది. ఎంతకాలం ఒకేచోట ఉద్యోగం చేసేందుకు వీలుందో కూడా చెప్పాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఇలాంటి మినహాయింపులకు ఉన్న రూల్స్, హేతుబద్ధతను తేల్చుతామని చెప్పింది. ట్రాన్స్‌ఫర్స్ రూల్స్, గైడ్‌లైన్స్ ఇతర అంశాలను నివేదించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను జనవరి మొదటి వారానికి వాయిదా వేస్తూ జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ ఎ హరిహరనాథ శర్మతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఆదేశించింది.

విజయనగరం జిల్లా సైనిక్ వెల్ఫేర్ ఆఫీసర్ మజ్జి కృష్ణారావును కాకినాడకు బదిలీ చేశారు. విజయనగరానికి కెవిఎస్ ప్రసాదరావును నియమించారు. అయితే, కృష్ణారావు కాకినాడలో బాధ్యతలు స్వీకరించకుండానే విజయనగరంలోనే కొనసాగారు. కృష్ణారావును విజయనరగంలోనే కొనసాగించేలా హోంశాఖ ప్రొసీడింగ్స్ ఇచ్చింది. దీనిని ప్రసాదరావు హైకోర్టులో సవాల్ చేస్తే.. హోంశాఖ ముఖ్యకార్యదర్శి జారీ చేసిన ప్రొసీడింగ్స్ అమలుకు చర్యలు తీసుకోవాలని సైనిక్ వెల్ఫేర్ డైరెక్టర్‌ను సింగిల్ జడ్జి ఆదేశించారు. ఈ ఉత్తర్వులను ప్రసాదరావు డివిజన్ బెంచ్ వద్ద అప్పీల్ దాఖలు చేయడంతో గతంలోనే బెంచ్ యథాతథస్థితి ఆదేశాలను జారీ చేసింది. శుక్రవారం తిరిగి విచారణ జరగడంతో హైకోర్టు.. కృష్ణారావు తనకు తెలియజేయకుండానే విజయనగరంలో బాధ్యతలు స్వీకరించారని కలెక్టర్ దాఖలు చేసిన కౌంటర్‌లో పేర్కొనడాన్ని గుర్తించింది. కాకినాడలో విధుల్లో చేరకపోవడం క్రమశిక్షణ చర్యల ఉల్లంఘనగా కలెక్టర్ పేర్కొన్నారు. గత 24 ఏళ్లుగా కృష్ణారావు విజయనగరంలోనే పనిచేస్తున్నారని కూడా వివరించారు. దీంతో హైకోర్టు, పైవిధంగా స్పందించింది.

సంపాదకీయం

ప్రైవేటు నిర్వాకం

గత నాలుగు రోజులుగా వందలాది ఇండిగో విమానాలు రద్దు కావడం లేదా తీవ్ర ఆలస్యంగా నడవడంవల్ల దేశమంతటా పలు విమానాశ్రయాల్లో వేలాదిమంది ప్రయాణీకులు నిలిచిపోయి తాము ముందుగా నిర్ణయించుకున్న కార్యకలాపాల్లో పాల్గొనలేక తీవ్ర ఆవేదనకు, ఆందోళనకు గురవుతుండడం బాధాకరం. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కూడా చెయ్యకపోవడంతో వృద్ధులు, చిన్న పిల్లలు, రోగులు పడుతున్న కష్టాలు వర్ణనాతీతం. ఇండిగో ఎయిర్‌లైన్స్ లాభాపేక్ష, పౌర విమానయాన నిబంధనల అమలుపట్ల ఆ సంస్థ నిర్లక్ష్యమే ఈ ఉత్పాతానికి కారణమని తెలిశాక ఎవరికైనా పట్టరాని కోపం కలగక మానదు. మోడీ నాయకత్వానగల కేంద్ర ప్రభుత్వం అతిపెద్ద పౌర విమానయాన సంస్థ ఎయిర్ ఇండియాను టాటాకు అప్పగించేసింది. దీంతో ఇండిగో విమానాలు ఆగడంతో ప్రయాణీకులకు ఏదో ఒక ప్రైవేటు సంస్థే గతయింది. సరిగ్గా ఈ పరిస్థితిని ఉపయోగించుకొని వారు విమాన చార్జీలను దాదాపు పది రెట్లు పెంచేశారు. శుక్రవారం ఢిల్లీ నుండి ముంబాయికి చార్జీ 51 వేల రూపాయలు, అదే ముంబాయి నుండి ఢిల్లీ వెళ్లడానికి రూ.48 వేలు వసూలు చేశారు (సాధారణ కనిష్ట చార్జీ ఐదు నుండి ఆరు వేల మధ్య ఉంటుంది). అయినా కేంద్ర ప్రభుత్వం చేష్టలుడిగి కూర్చుంది. ఏదో కారణంతో సమ్మె లేదా బంద్ వంటివి జరిగితే ఆటోవాలా లేదా ట్యాక్సీ డ్రైవర్ కొద్దిగా కిరాయి పెంచి అడిగితే పోలీసులు, ఆర్‌టిఓలు వీరంగం వేయడం మనమెరిగిందే! కానీ బడా విమానయాన సంస్థలు పబ్లిగ్గా దోచేసినా అదుపు చేయవలసిన కేంద్ర ప్రభుత్వం కిమ్మనదు. ఇదీ బడా కార్పొరేట్ల పవర్! వారి మధ్యనున్న బంధానికి నిదర్శనం.

'పైలట్ల కొరతతో పలు ఇండిగో విమానాలు రద్దయ్యాయి' అని అందరూ అంటారు. కాని ఆ కొరత ఎందుకు ఏర్పడింది అని పరిశీలిస్తే అసలు కారణాలు తెలుస్తాయి. విమానాలకు, విమానాశ్రయాలు, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ సెంటర్లు, పైలట్లు, కేబిన్ సిబ్బంది ఏవిధంగా ఉండాలి, ఆయా వ్యవస్థలను ఎలా నిర్వహించాలి అన్న విషయాలన్నింటిపై అంతర్జాతీయ ప్రమాణాలున్నాయి. మన దేశంలో వాటిని నిర్ణయించి, అమలు పర్యవేక్షించేది కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డిజిసిఎ). సురక్షిత విమాన ప్రయాణం, ప్రయాణీకుల ప్రాణాలకు భద్రత కల్పించడమే ఆయా నిబంధనల పరమ లక్ష్యం. పైలట్లు ఎంత సమయం విమానం నడపొచ్చు, ఎంత కాలం విశ్రాంతి తీసుకోవాలి, నైట్ డ్యూటీ తదితర అంశాలన్నిటితో ఫ్లైట్ డ్యూటీ టైమ్ లిమిటేషన్స్ (ఎఫ్‌డిటిఎల్) నిబంధనలు డిజిసిఎ రూపొందిస్తుంది. సవరించిన ఆ నిబంధనలను 2024లో ప్రకటించి 2025 నవంబర్ 1 నుండి అమలు చేయాలని గడువు విధించింది. అలా అమలు చేయాలంటే పైలట్లు, కేబిన్ సిబ్బందిని అదనంగా నియమించాలి. దేశంలో అతిపెద్ద విమానయాన సంస్థగా గొప్పలు చెబుతున్న ఇండిగో ఆ పని చేయకుండా ఉన్న సిబ్బందితోనే పని కానివ్వాలని భావించింది. లేదా డిజిసిఎ నిబంధనల సడలింపునకు ప్రయత్నాలు సాగించి వుంటుంది. అవి ఫలించక తాజా సంక్షోభం నెలకొంది. ఇప్పుడైనా జరిగిందేమిటో చెప్పకుండా కేబిన్ సిబ్బంది హాజరు కాకపోవడంతో బుధవారం పరిస్థితి మరింత తీవ్రమైనట్లు ఇండిగో ఒక ప్రకటనలో తెలపడం తిమ్మిని బమ్మిని చేసే ప్రయత్నమే! కొంతమంది సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ముంబాయి-మాల్దీవుల సర్వీస్‌తో సహా అనేక విమానాలు ఆలస్యమయ్యాయని పేర్కొనడం అమానుషం. మరోవైపు పైలట్లను సిక్ లీవ్‌ల నుండి త్వరగా విధుల్లోకి చేరాలని, ఇతరులను వారి ప్రివిలేజ్ లీవ్‌లను వదులుకోవాలని ఇండిగో గత కొన్ని వారాలుగా సిబ్బందిపై ఒత్తిడి తేవడం దారుణం. పరిస్థితి తీవ్రమయ్యాక శుక్రవారంనాడు ఇండిగో యాజమాన్యం వాస్తవాలను బహిరంగంగా ఒప్పుకొంది. ఈ నెల 8 నుండి నిర్వహించగలిగిన విమాన సర్వీసులనే నడుపుతామనీ యథాతథ పరిస్థితి 2026 ఫిబ్రవరి 10 నాటికి తీసుకురాగలమని డిజిసిఎ కు తెలిపింది. వేలాది మంది ప్రయాణీకులు కష్టాలు పడితేనేతప్ప నిజాలు బయటకు రాలేదు. ప్రయాణీకుల ఇబ్బందులను తొలగించాలంటూ ఎఫ్‌డిటిఎల్ నిబంధనల అమలును డిజిసిఎ తాత్కాలికంగా నిలిపివేసింది. ఈ మొత్తం ప్రహసనంలో అష్ట కష్టాలు పడడం ప్రయాణీకుల వంతు కాగా ఈ దుస్థితికి కారణమైన ఇండిగో పెద్దగా కోల్పోయినదేమీ లేదు. మరోవైపు ప్రైవేటు ఎయిర్‌లైన్స్ చార్జీలు పెంచి సొమ్ము లూటీ చేశాయి. కనుక పబ్లిక్‌కు కష్టనష్టాలు, ప్రైవేటుకు లాభాల పంట. ఇదీ నేటి భారత్ రీతి. ప్రజలారా బహుపరాక్!

మహనీయుల మాట

మతం, అధికారం ఈ రెండూ జేబు దొంగలు. ఇవి కలిసికట్టుగా జనాన్ని దోచుకుతింటున్నాయి. ఈ పని చేసే సమయంలో ఈ రెండూ మంచి ఒద్దికగా పనిచేస్తాయి. అందుకే మిక్కిలి దుష్ట ప్రభుత్వాన్ని మతం సమర్థిస్తుంది. మూర్ఖమూ, నీచమూ, మూఢమూ అయిన మతాన్ని ప్రభుత్వమూ సమర్థిస్తుంది.

- ఫాదర్ జాన్ మెల్యే,
17వ శతాబ్దపు కమ్యూనిస్టు ఫాదర్, పారిస్.

అయోధ్యలో మళ్లీ 'దివ్య' రాజకీయం

వ్యాఖ్య

రాముడు, అయోధ్యలో రామాలయ నిర్మాణ ఉద్యమం బిజెపికి అత్యధిక ప్రయోజనం చేకూర్చాయి. సమకాలీన భారత రాజకీయ చరిత్రలో బిజెపిని రాజకీయంగా ఆధిపత్య స్థానంలో ప్రతిష్ఠించాయి. రాముడిని ఎందరో ఆరాధిస్తారు. ఆయనను దివ్య లక్షణ సమన్వితుడుగా పరిగణిస్తారు. తులసీదాసు 'రామచరిత మానస్' ప్రభావంతో వందల ఏళ్లుగా హిందూ కుటుంబాలలో హత్తుకుపోయిన పురాణాలలో భాగమది. రెండు భారతీయ ఇతిహాసాలలో ఒకటైన రామాయణం వర్ణిస్తున్నట్టుగా రాముడిని మర్యాద పురుషోత్తముడుగా దైవారాధన చేయడంపట్ల మనకు ఎలాంటి పేచీ వుండజాలదు. కోట్ల మంది భారతీయుల వ్యక్తిగత విశ్వాసాలు, నమ్మకాలతో ఎవరూ వివాదాలు పెట్టుకోరు.

అయితే విశ్వాసాన్ని రాజకీయాలతో, పాలనతో కలగాపులగం చేసినప్పుడే అసలు సమస్య ప్రారంభమవుతుంది. నూతనంగా నిర్మించిన రామ మందిరంలో నవంబరు 25న జరిగిన కార్యక్రమంలో ఈ ప్రక్రియనే మరింత భద్రం చేసుకోవడానికే మరిన్ని అస్త్రాలు ప్రయోగించబడ్డాయి. ఆలయ శిఖరంపై ధర్మధ్వజం ప్రతిష్టాపన జరిపిన కార్యక్రమం దేశ గతం వర్తమానం భవిష్యత్తుకు సంకేతంగా ప్రదర్శించారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చి ఇప్పటికి పదకొండేళ్లు గడచిపోయాయి. ఇతర ఎన్నికల ప్రక్రియల ద్వారా కూడా బిజెపి అనేక రాష్ట్ర ప్రభుత్వాలనూ, రాష్ట్రపతి ఉపరాష్ట్రపతి పార్లమెంటు ఎన్నికల కమిషన్ వంటి వివిధ రాజ్యాంగ వ్యవస్థలను, న్యాయ నిర్ణయ ప్రక్రియలోని కీలకమైన అంశాలను కూడా పట్టులోకి తెచ్చుకోగలిగింది. తద్వారా భారత జాతీయత ప్రాధాన్యతనే తిరగరాయడానికి అది వీటిని ఉపయోగించడానికి సిద్ధమైంది.



వాస్తవ ప్రపంచంతో పోరాడటం భారతదేశ ప్రజానీకానికి జీవన్మరణ సమస్య. ఎందుకంటే కార్పొరేట్ కుమ్మక్కు, తత్ఫలితంగా పెరిగిన అవినీతి దేశ మూలాలను తొలిచేస్తున్నాయి. రెండు పూటలా తిండికి నోచని కోట్లాది మంది రైతులూ వ్యవసాయ కార్మికుల ప్రయోజనాలను కాపాడటానికి జరిగే పోరాటం అది. వేల సంఖ్యలో ప్రభుత్వ పాఠశాలలు మూతపడుతుంటే సార్వత్రిక ప్రాథమిక విద్య లక్ష్యాలను సాధించడానికి జరిపే పోరాటం. మన యువతీ యువకులు పని హక్కుతో జీవనోపాధి పొంది తమ కుటుంబాలకూ దేశానికి శ్రేయస్సు కలిగించే సానుకూల పాత్ర నిర్వహించేందుకు అవకాశం కల్పించే పోరాటం అది. మన దేశ జాతీయత నిర్వచనాన్ని తిరగదోడటం ఆరెస్సెస్ పథకం. దైవత్వానికి కృత్రిమమైన విధేయతను చాటడం ద్వారా మన దైనందిన పాదార్థిక వేదనలను ఎలాగో కప్పిపుచ్చి పారవశ్యంలో ముంచెత్తే పథకం దానిది.

ధర్మధ్వజ సంకీర్తన

ధర్మధ్వజ ప్రతిష్టాపనోత్సవంలో ప్రధానమంత్రి మోడీ, ఆరెస్సెస్ అధినేత మోహన్ భగవత్‌ల ప్రసంగాలను గనక పరీక్షగా చూస్తే స్వాతంత్ర్య పోరాటంతో సహా మన గతం మొత్తాన్ని రామకథలో భాగం చేసేందుకు పనిగట్టుకుని ప్రయత్నం చేసినట్టు స్పష్టమతుంది. మోడీ ఇలా ప్రవచించారు: ఈ రోజున రామ ప్రభువు జన్మభూమి అనంత శక్తి, శ్రీరామ కటుంబ దివ్యఖ్యాతి...ఈ పుణ్య మందిరంలో మహత్తర ఆలయంలో ధర్మధ్వజ రూపంలో వ్యవస్థాపితమయ్యాయి....ఈ ధర్మధ్వజం కేవలం ఒక పతాకం కాదు. భారతీయ నాగరికతకు ఇదో పునర్వైభవం. సూర్యవంశ ప్రతిష్ట లిఖించబడిన ఈ కాషాయ పతాక, దానిపై ప్రకాశిస్తున్న దేవకాంచన వృక్షం రామరాజ్య ఖ్యాతిని చాటుతాయి. ఈ పతాకం ఒక సంకల్పం. ఈ పతాకం ఒక విజయం. పోరాటంతో సృష్టించుకున్న కథే ఈ పతాకం."

ఒక దేశంగా ఇండియా అస్తిత్వాన్ని రాముడి దివ్యత్వంతో సంలీనం చేయడమే ఇక్కడ ఉద్దేమన్నది స్పష్టం. భారత ప్రజల వైవిధ్యత, బ్రిటిష్ వలసాధిపత్యానికి వ్యతిరేకంగా పోరాటంలో రూపుదాల్చిన వారి సమైక్యత ఇవన్నీ అప్రధానంగా కొట్టివేయబడుతున్నాయి. మంచి జీవితం కోసం, తిండి బట్ట గూడు వంటి కనీసావసరాలు పొందడం కోసం విద్య, వైద్యం వంటి అత్యవసరాల కోసం ప్రపంచ దేశాల సముదాయంలో నిలదొక్కుకునే స్థానం కోసం వారు చేసే పోరాటం అన్నీ ఆ దేవారాధన, దివ్యత్వం ముందు ప్రాధాన్యత లేనివైపోతున్నాయి. మనం ఈ మొత్తం వివాదాన్ని తదనంతర చర్చను ఏడాది వెనక్కు వెళ్లి చూడాలి. ఆ సమయంలో అక్కడ ఆలయ ప్రారంభోత్సవం జరిగినప్పుడు శంకరాచార్యులు, ప్రధానమంత్రి మొత్తంలో కీలక పాత్ర ధరించడం పట్ల, రాజకీయాలు మతం స్థానాన్ని ఆక్రమించడం పట్ల కొందరు అభ్యంతరాలు లేవనెత్తారు.

మతం రాజకీయం వేర్వేరు

భారతదేశంలోనూ, ఇతర చోట్ల కూడా మతం రాజకీయాలు ఆమడ దూరం పాటిస్తాయి. ప్రజల కొరకు, ప్రజల యొక్క, ప్రజల చేత అన్న సూత్రంపై ప్రజాస్వామ్యాలు ప్రవర్ధిల్లుతాయి. దివ్యత్వం గురించిన మొత్తం చర్చలోకి దిగనక్కరలేదుగానీ దేశంలో చాలా నమ్మకాలు, విశ్వాసాలు వున్నాయి. వాటన్నిటికీ సంబంధించి దైవత్వం ప్రజా పరిపాలన రెండూ పరస్పర అనుబంధితాలుగా చూపే ఈ ప్రేమాతిశయం ఇదేస్థాయిలో వుండకపోవచ్చు. వర్గం, కులం, తెగ, మతం తదితరాలతో నిమిత్తం లేకుండా రాజకీయ పార్టీలు ప్రజల మేలు కోసం నిర్దిష్టంగా విధాన నిర్దేశాలు, నిర్దుష్ట చర్యలు ప్రతిపాదించవలసి వుంటుంది. జవాబుదారీ సూత్రం ప్రకారం వాటి అమలుకు బాధ్యత వహించవలసి వుంటుంది. విధానాల అమలు ఫలితాలను బట్టి ప్రభుత్వాలను ఆ విధంగా అంచనా వేయడం జరుగుతుంది.

ఏమైనా అయోధ్యలో ప్రధానమంత్రి చేసిన ప్రసంగం తీరుతెన్నులు అలాంటి పరీక్షకు నిలవడం ఎంతమాత్రం ప్రధానం కానట్టు కనిపిస్తుంది. ఆయన సూటిగా ఇలా చెప్పేశారు: ఈ దర్మధ్వజం మన సంకల్పానికి ప్రతీక...నహీ దరిద్ర, కోయి దు:ఖీ న దీన..అంటే మనం దరిద్రం, దు:ఖం దీనత్వం లేని సమాజం నిర్మిస్తాం...". మరి దరిద్రం, దు:ఖం, అసహాయతలను శాశ్వతంగా లేకుండా చేసేందుకు ఏం చేస్తారో చెప్పవలసిన బాధ్యత ప్రధానమంత్రిపై వుంటుంది. రామప్రభువును ధర్మధ్వజాన్ని మొత్తంగా కీర్తించినంత మాత్రాన ఇది సాధించేసినట్టు కాదు కదా. ఒకవైపున అసమానతలు, పేదరికం, నిరుద్యోగం ఇంకా ఇంకా పెరిగిపోతుంటే ఆ లక్ష్యాన్ని సాధించే మార్గమేమిటో చెప్పాలి.

PEOPLE'S DEMOCRACY
THE WEEKLY PAPER OF THE COMMUNIST PARTY OF INDIA (MARXIST)

ఆరెస్సెస్ అసలు పాచిక

వలసవాద యుగంలో 1835లో థామస్ మెకాలే ఇంగ్లీషును బోధనా భాషగా ప్రవేశ పెట్టడాన్ని కూడా ప్రధానమంత్రి ప్రస్తావించారు. మెకాలే తీసుకొచ్చిన వలసవాద విద్యా విధానం బ్రిటిష్ సామ్రాజ్యవాదుల ప్రయోజనాల కోణంలో పుట్టిందే. అది లేకుండా చేయాలంటే బ్రిటిష్‌వారిని ఓడించాలి, ఆరెస్సెస్ అధినేత మోహన్ భగవత్ ధర్మ ధ్వజంపై మరింత కపటంగా మాట్లాడారు. "చారిత్రికంగా భావోద్వేగపరంగా ఆధ్యాత్మికంగా అత్యంత కీలక ఘట్టం'గా అభివర్ణించారు. బిజెపికి ప్రత్యేకించి సంఘ్‌కు స్వయం ప్రకటిత ప్రచారకుడైన ప్రధాని మోడీకి చోదక శక్తిగా వున్నదే ఆరెస్సెస్ సంస్థ. మరి బ్రిటిష్ వారిపై పోరాటానికీ, వారిని ఓడించడానికీ, పురోగమన శీలమైన, దారిద్ర్యం దు:ఖం, అసహాయతలు లేని స్వతంత్ర భారత్‌ను నిర్మించడానికి ఆరెస్సెస్ ఏ విధంగా దోహదపడిందో కూడా మోహన్ భగవత్ చెప్పాలి.

వాస్తవానికి ఇటీవల ఒక సందర్భంలో మోహన్ భగవత్ గాంధీజీ హింద్ స్వరాజ్‌లో చేసిన వ్యాఖ్యలపై విరుచుపడ్డారు. ఇరవయ్యో శతాబ్ది ప్రారంభ సమయంలో చేసిన ఆ రచనలో గాంధీజీ హిందూ ముస్లిం మధ్య శాశ్వత శత్రుత్వమేమీ లేదని, బ్రిటిష్ పాలకులు ఆ విధమైన పరిస్థితి కావాలని సృష్టించారని గాంధీజీ పేర్కొన్నారు. అయితే బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో రెండు మతాల మధ్య ఐక్యత పెరిగింది. స్వాతంత్ర్య పోరాటంలో, స్వాతంత్ర్య సాధనలో స్థానం లేకపోవడం శతవార్షికోత్సవం జరుపుకొంటున్న ఆరెస్సెస్‌కు ఒక సంకట పరిస్థితి. కనుక భారత దేశం 1947 ఆగష్టు 15న స్వాతంత్ర్యం సాధించలేదనీ, రామమందిర ప్రారంభోత్సవంతోనే స్వాతంత్ర్యం సిద్ధించిందనీ ఒక కట్టుకథ సృష్టించేందుకు ఆరెస్సెస్ నానా తంటాలు పడుతున్నది. అలా జరగాలంటే వాస్తవాన్ని దివ్యమహత్యాలతో కప్పేయాలి.

జీవన్మరణ సమస్య

వాస్తవ ప్రపంచంతో పోరాడటం భారతదేశ ప్రజానీకానికి జీవన్మరణ సమస్య. ఎందుకంటే కార్పొరేట్ కుమ్మక్కు, తత్ఫలితంగా పెరిగిన అవినీతి దేశ మూలాలను తొలిచేస్తున్నాయి. రెండు పూటలా తిండికి నోచని కోట్లాది మంది రైతులూ వ్యవసాయ కార్మికుల ప్రయోజనాలను కాపాడటానికి జరిగే పోరాటం అది. వేల సంఖ్యలో ప్రభుత్వ పాఠశాలలు మూతపడుతుంటే సార్వత్రిక ప్రాథమిక విద్య లక్ష్యాలను సాధించడానికి జరిపే పోరాటం. మన యువతీ యువకులు పని హక్కుతో జీవనోపాధి పొంది తమ కుటుంబాలకూ దేశానికి శ్రేయస్సు కలిగించే సానుకూల పాత్ర నిర్వహించేందుకు అవకాశం కల్పించే పోరాటం అది. మన దేశ జాతీయత నిర్వచనాన్ని తిరగదోడటం ఆరెస్సెస్ పథకం. దైవత్వానికి కృత్రిమమైన విధేయతను చాటడం ద్వారా మన దైనందిన పాదార్థిక వేదనలను ఎలాగో కప్పిపుచ్చి పారవశ్యంలో ముంచెత్తే పథకం దానిది. ఇలా చెప్పడమంటే నిజమైన ప్రపంచాన్ని గుర్తించడమే తప్ప ఏదో అగౌరవం చూపడం కాదు. ఆ పోరాటానికి మనను మనం పునరంకితం చేసుకోవాలి.

(డిసెంబర్ 3 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

రాజ్యాంగ లక్ష్యాల పరిరక్షణే అంబేద్కర్‌కు నివాళి

సందర్భం



నేడు డా॥బి.ఆర్.అంబేద్కర్ వర్ధంతి

భారతదేశంలో ప్రజాస్వామ్యం, సమానత్వం, సామాజిక న్యాయం అనే భావజాలాలను నాటి, అభివృద్ధి చేస్తున్నది భారత రాజ్యాంగమే. రాజ్యాంగం భారతదేశపు అత్యంత ప్రాధాన్యత కలిగిన గొప్ప సజీవ రచన. విభిన్నమైన విశ్వాసాలను, కులాలను, సంస్కృతులను, భాషలను, నమ్మకాలను, వైఖరులను, అలవాట్లను, భావజాలాలను నడిపిస్తున్నది భారత రాజ్యాంగమే. అందువలన, మన భవిష్యత్ తరాలు క్షేమంగా జీవించడం కోసం రాజ్యాంగాన్ని, దానితోపాటుగా దాని లక్ష్యాలను మనం కాపాడుకోవాలి.

భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిన 75 ఏళ్ల తర్వాత ఈ రోజు రాజ్యాంగం అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నది. ఆ సవాళ్లను ఓడించకపోతే అది ఇచ్చిన ప్రజాతంత్ర పరిపాలనా వ్యవస్థను, హక్కులను కాపాడుకోవడం సాధ్యం కాదు. రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని సంరక్షించుకోకపోతే ప్రజాస్వామ్యాన్ని అరాచకం ఆక్రమిస్తుంది. ఈ నేపథ్యంలో పాలకుల రాజ్యాంగ వ్యతిరేక విధానాలను ప్రశ్నించాల్సి ఉంటుంది. డా॥బి.ఆర్.అంబేద్కర్ చెప్పినట్లు రాజ్యాంగం ఎంత మంచిదైనప్పటికీ అమలు చేసేవారు చెడ్డవారైతే అది తప్పకుండా చెడుగా మారుతుంది. అందువల్ల మన దేశం, మన రాజ్యాంగం ఎదుర్కొంటున్న సవాళ్లను అర్థం చేసుకోవాల్సిన ఆవశ్యకత ఉంది.

బలహీన పడుతున్న ప్రజాస్వామ్యం

భారత రాజ్యాంగం దేశంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని ప్రవేశపెట్టింది. సాధారణ పౌరులందరికీ ఎన్నికల్లో పోటీ చేసే హక్కు కల్పించింది. 1952 నుండి 2024 వరకూ 18 సార్లు లోక్‌సభకు ఎన్నికలు నిర్వహించబడ్డాయి. ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకుంటూ ప్రభుత్వాలను ఎన్నుకుంటున్నారు. కానీ ఎన్నికల్లో డబ్బు, మతం, కులం, రాజకీయాలు నేరమయం కావడం వంటి అంశాల ప్రాధాన్యత పెరిగిపోయింది. విద్యావంతులు, నీతివంతులు, సామాజిక కార్యకర్తలు, ఉద్యమ కార్యకర్తలు, ప్రావీణ్యత అర్హతలు గలవారు చట్టసభల్లో రోజురోజుకీ తగ్గిపోతున్నారు. ముఖ్యంగా ఆర్థిక సంస్కరణల ప్రభావం వల్ల రాజకీయాలు కూడా కార్పొరేటీకరణ చెందాయి. లోక్‌సభకు పోటీ చేయాలంటే రూ.100 కోట్లు, శాసన సభకు పోటీ చేయడాలంటే కనీసం రూ.30 కోట్లు ఖర్చు చేసేవారిని ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులుగా నిర్ణయిస్తున్నాయి. దీనివల్ల చిన్న పార్టీలు, వామపక్షాల వంటి ఉద్యమ పార్టీలు ఎన్నికల్లో పోటీ చేయాలంటే ఇబ్బందులు పడుతున్నాయి. చట్టసభల్లో బిల్లులపై చర్చ లేకుండానే ఆమోదం పొందుతున్నాయి. అసహనం, చీలికతత్వం, అవినీతి, ప్రతిపక్షాల అభిప్రాయాలకు గౌరవం ఇవ్వకపోవడం, పార్లమెంట్ కార్యకలాపాల్లో ప్రతి నిత్యం జరుగుతున్న సంఘటనలుగా మరిపోయాయి. నరేంద్ర మోడీ ప్రభుత్వం గత దశాబ్ద కాలంగా ప్రతిపక్షాల అభిప్రాయాలకు ఎలాంటి విలువ ఇవ్వడం లేదు. ప్రధానమంత్రి మోడీ సభకు హాజరుకాని సందర్భాలు ఎక్కువగా ఉంటున్నాయి.

కె.యస్.లక్ష్మణరావు

భారత రాజ్యాంగం దేశంలో స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించడానికి ఆర్టికల్ 324 ప్రకారం జాతీయ ఎన్నికల కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఎన్నికల కమిషన్ రాజ్యాంగ నిబంధన ప్రకారం స్వతంత్రంగా పనిచేయాలి. కానీ ప్రస్తుత ఎన్నికల కమిషన్ కేంద్ర ప్రభుత్వ అధీనంలో పనిచేసే సంస్థగా మారిపోయింది. ప్రధాన ఎన్నికల అధికారి జ్ఞానేష్ కుమార్ కేంద్ర ప్రభుత్వ ఏజెంట్‌గా వ్యవహరిస్తూ ఎన్నికల కమిషన్ రాజ్యాంగ బద్ధతను ప్రశ్నార్థకంగా చేశారు. బీహార్‌లో ప్రతిపక్షాలను దెబ్బ తీయడానికి 'ప్రత్యేక సమగ్ర సవరణ' (ఎస్.ఐ.ఆర్) అమలు చేసి ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీశారు. ఇప్పుడు మరో 12 రాష్ట్రాల్లో ఎస్.ఐ.ఆర్ అమలు చేయడానికి ఎన్నికల కమిషన్ పూనుకుంది. బీహార్‌లో దాదాపు 70 లక్షల మంది ఎస్.ఐ.ఆర్ ఫలితంగా ఓటు వేసే అర్హత కోల్పోయారు. ఓటు హక్కు కోల్పోయిన వారిలో పెద్ద సంఖ్యలో మైనార్టీలు, వలస కార్మికులు ఉన్నారు.

ప్రమాదంలో పౌరహక్కులు

'భావ ప్రకటనా స్వేచ్ఛ ప్రజాస్వామిక వ్యవస్థకు పునాది' అని రాజ్యాంగ నిర్మాతలకు స్పష్టమైన దృక్పథం ఉంది. రాజ్యాంగం మూడో భాగంలో ఆర్టికల్ 12 నుండి 35 వరకూ గల ప్రాథమిక హక్కులు పౌరులకు హక్కులు, స్వేచ్ఛ కల్పించడమే కాక ఆర్టికల్ 32, ఆర్టికల్ 226 ద్వారా హక్కులకు న్యాయస్థానాల సంరక్షణ కల్పించాయి. వాటిని పరిరక్షించవలసిన బాధ్యత న్యాయవ్యవస్థపై వున్నది. రాజ్యాంగంలోని 19(1ఎ) ఆర్టికల్ పౌరులకు భావ ప్రకటనా స్వేచ్ఛ కల్పించింది. వ్యక్తి స్వేచ్ఛ సమాజాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి మొదటి మెట్టు. కానీ గత పదేళ్లుగా సామాజిక కార్యకర్తలను, విద్యార్థులను, కళాకారులను, సాహితీవేత్తలను, పాత్రికేయులను తదితరులను రాజద్రోహం ఆరోపణలపైన నేరపూరితమైన కేసులు పెట్టి జైళ్లలో నిర్బంధిస్తున్నది. భిన్నాభిప్రాయాలు కలిగి ఉన్నందుకు, వెలిబుచ్చినందుకు గౌరీ లంకేష్, కల్బుర్గి, గోవింద పన్సారీ, నరేంద్ర ధబోల్కర్ వంటి సాహితీవేత్తలను, సామాజిక కార్యకర్తలను హత్య చేశారు. ఒకవైపు బిల్కిస్ బానో కటుంబ సభ్యులను ఊచకోత కోసిన నిందితులను విడుదల చేస్తూ, మరోవైపు ఉమర్ ఖలీద్ వంటి విద్యార్థి నాయకులకు బెయిల్ ఇవ్వకుండా ఏళ్ల తరబడి జైళ్లలో ఉంచుతున్నారు. ప్రబీర్ పురకాయస్థ వంటి పాత్రికేయులను అన్యాయంగా అరెస్టులు చేస్తూ ప్రాతికేయులను భయపెడుతున్నారు. పాలకులు మొత్తం మీడియాను నియంత్రణ చేస్తూ భిన్నాభిప్రాయాలకు తావు లేకుండా చేసే వాతావరణాన్ని సృష్టిస్తున్నారు.

పౌరుల ప్రాథమిక హక్కులను కాపాడే బాధ్యత సుప్రీంకోర్టు, హైకోర్టులపై ఉన్నది. గత 8 సంవత్సరాలుగా న్యాయవ్యవస్థ పనితీరును పరిశీలిస్తే అనేక సందర్భాలలో పౌరుల హక్కులు కాపాడటంలో స్పందన తగిన విధంగా లేదు. న్యాయవ్యవస్థ స్వతంత్రంగా ఉంటూ రాజ్యాంగాన్ని పరిరక్షిస్తూ పౌరహక్కులను కాపాడడంలో ముఖ్య పాత్ర వహించాలి. కాని కొలీజియం ద్వారా జరుగుతున్న న్యాయమూర్తుల నియామకం గురించి అనేక సందేహాలు ఉన్నాయి. పాలకవర్గాలు తమకు అనుకూలమైన వ్యక్తులను న్యాయమూర్తులుగా నియమించే విధంగా కొలీజియంపై ఒత్తిడి తెస్తున్నాయనే విమర్శలు ఉన్నాయి.

కనుమరుగవుతున్న సంక్షేమ రాజ్య భావన

భారతదేశాన్ని ఒక సంక్షేమ రాజ్యంగా రూపొందించాలని రాజ్యాంగ నిర్మాతలు భావించారు. రాజ్యాంగం 4వ భాగంలో ఆదేశిక సూత్రాలను ఆర్టికల్ 36 నుండి 51 వరకు చేర్చారు. సంక్షేమ రాజ్య స్థాపనకు ఆదేశిక సూత్రాలను అమలు జరపాల్సిందిగా రాజ్యాంగం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. వీటిలో సంపద వికేంద్రీకరణ, ఆర్థిక-సామాజిక న్యాయం, సమాన పనికి సమాన వేతనం, కార్మికుల శ్రమకు తగిన ఫలితం, ఉచిత నిర్బంధ విద్య మొదలగు అంశాలను చేర్చారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తమ పాలనా క్రమంలో ఈ సూత్రాలను ప్రాతిపదికగా చేసుకోవాలని చెప్పింది. కాని ఆచరణలో సంపద కేంద్రీకరణ పెరిగిపోయింది. 1 శాతం సంపన్నుల చేతిలో 58 శాతం సంపద పోగుపడింది. అదానీ, అంబానీ వంటి పారిశ్రామికవేత్తల సంపద అనూహ్యంగా పెరిగిపోయింది. సంపద అసమానతలు తీవ్ర ఆర్థిక, సామాజిక సంక్షోభానికి దారితీస్తున్నాయి. బ్యాంకుల విధానాలు రైతులకు, పేద ప్రజలకు అనుకూలంగా లేవు. బడా పారిశ్రామికవేత్తలకు అనుకూలంగా మారాయి. కార్పొరేట్ సంస్థలకు లక్షలాదికోట్ల రుణమాఫీ చేస్తున్నారు. గౌతమ్ అదానీ ఆస్తుల విలువ 2014లో 50 వేల కోట్లు ఉంటే, 2024 నాటికి 10 లక్షల కోట్లకు చేరింది.

ప్రభుత్వ రంగ సంస్థలను, పోర్టులను, విమానాశ్రయాలను కారుచౌకగా అమ్మేస్తున్నారు. రెండోవైపు దేశంలో కార్మికవర్గం గత శతాబ్ద కాలంగా పోరాటాల ద్వారా సాధించుకున్న అనేక చట్టాలను రద్దు చేసి నాలుగు 'లేబర్ కోడ్లు'గా మార్చారు. కార్మికుల కోసం భారత రాజ్యాంగంలో ప్రతిపాదించిన హక్కులను కూడా రద్దు చేసే పరిస్థితి ఏర్పడింది.

ఫెడరలిజంపై దాడి

నరేంద్ర మోడీ నాయకత్వంలోని బిజెపి కేంద్ర ప్రభుత్వం భారత రాజ్యాంగ మౌలిక లక్షణమైన ఫెడరలిజంపై పెద్దఎత్తున దాడి చేస్తున్నది. భారత రాజ్యాంగంలో 1వ నిబంధన భారత దేశాన్ని 'రాష్ట్రాల యూనియన్' అని పేర్కొన్నది. కేంద్రంతో పాటు రాష్ట్రాలు సమాన హక్కులు కలిగి ఉంటాయని స్పష్టంగా చెప్పింది. రాజ్యాంగం 7వ షెడ్యూల్‌లో అధికార విభజన జరిగి కేంద్ర జాబితా, రాష్ట్ర జాబితా, ఉమ్మడి జాబితా అని ప్రతిపాదించారు. రాష్ట్రాలు, కేంద్రం మధ్య ఆర్థిక వనరుల పంపిణీ ఆర్టికల్ 280 ప్రకారం ఐదేళ్లకు ఒకసారి ఆర్థిక సంఘాన్ని నియమించాలని రాజ్యాంగం చెప్పింది.

2014లో మోడీ ప్రభుత్వం వచ్చాక రాష్ట్రాల హక్కులపై పెద్ద ఎత్తున దాడి జరుగుతున్నది. పెద్ద నోట్ల రద్దు వలన రాష్ట్రాలు నష్టపోయాయి. జి.ఎస్.టి ప్రవేశపెట్టడం వలన కేంద్రం ఆదాయం పెరిగి రాష్ట్రాలు 3 లక్షల కోట్ల ఆదాయాన్ని కోల్పోయాయి. ఆర్థిక సంఘం సిఫార్సులలో కూడా రాష్ట్రాలకు రావలసిన పన్నుల వాటాను బాగా తగ్గించారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేటీకరణ చేయటానికి కేంద్రం ప్రవేశ పెట్టిన 3 వ్యవసాయ చట్టాలు రాజ్యాంగ విరుద్ధమైనవి. వ్యవసాయం రాష్ట్ర జాబితాలో ఉండగా, కేంద్రం చట్టాలు చేసింది. లక్షలాదిమంది రైతుల ఆందోళన ఫలితంగా చట్టాలను ఉపసంహరించక తప్పలేదు. కేంద్రం 2020 జులైలో ప్రకటించిన నూతన విద్యావిధానాన్ని రాష్ట్రాలతో చర్చించి ఆమోదించాలి. కాని రాష్ట్రాలతో చర్చించకుండానే నూతన విద్యావిధానం ప్రకటించటం రాష్ట్రాల హక్కులపై దాడి చేయడమే.

గవర్నర్లు కేంద్ర,రాష్ట్రాల మధ్య అనుసంధానంగా వ్యవహరించాలని రాజ్యాంగం భావించింది. కాని ఆచరణలో వారు కేంద్రం ఏజెంట్లుగా వ్యవహరిస్తున్నారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం రాష్ట్రాలలో తమకు నచ్చని పార్టీలు అధికారంలో ఉన్నచోట ఆ రాష్ట్ర ప్రభుత్వాలకు అనేక ఇబ్బందులు, అడ్డంకులు కలుగచేస్తున్నది. కేరళలో పినరయి విజయన్ ప్రభుత్వానికి ఇబ్బందులు సృష్టిస్తున్నది.

లౌకికవాదం ముఖ్యమైనది

భారత రాజ్యాంగ మౌలిక లక్షణాలలో సెక్యులరిజం ముఖ్యమైనది. భిన్నత్వం, బహుళత్వంగల భారతదేశంలో మత సామరస్యం మౌలిక అంశమని రాజ్యాంగ నిర్మాతలు భావించారు. సెక్యులరిజం అంటే మతాన్ని రాజకీయాల నుండి విడదీసి నిర్వహించడం. ప్రభుత్వం స్వంత మతాన్ని కలిగి వుండరాదు. రాజ్యాంగం పౌరులకు మత స్వేచ్ఛను కల్పించింది. మైనారిటీల హక్కుల పరిరక్షణకు అనేక నిబంధనలు చేర్చింది.

బ్రిటీష్ పాలనలో హిందువులు-ముస్లింల మధ్య ఐక్యత దెబ్బ తీయటానికి బ్రిటీష్ ప్రభుత్వం విభజించు-పాలించు సిద్ధాంతాన్ని అనుసరించింది. అది చిట్టచివరకు దేశ విభజనకు దారితీసింది. ప్రస్తుతం దేశంలో సంఘపరివార్ ఆలోచనలకు అనుగుణంగా బి.జె.పి ప్రభుత్వం హిందువులు-ముస్లింల మధ్య భావోద్వేగాలను రెచ్చగొడుతున్నది. మతపరమైన విభజన చేసి మతతత్వాన్ని రెచ్చగొట్టడానికి ప్రయత్నిస్తున్నది. 2014 నుండి నేటి వరకు చేస్తున్న నిర్ణయాలు ప్రజలలో మతపరమైన ఉద్వేగాలు రెచ్చగొట్టే విధంగా ఉంటున్నాయి. జమ్ముకాశ్మీర్‌కు గల 370వ ఆర్టికల్ రద్దు, పౌరసత్వ సవరణ చట్టం (సి.ఎ.ఎ), ప్రస్తుతం అమలుచేస్తున్న ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) మొదలగునవన్నీ దీనిలో భాగమే. దేవాలయాలు, విగ్రహాల నిర్మాణాలు, ప్రారంభోత్సవాలకు నరేంద్రమోడీ ప్రాధాన్యత ఇస్తున్నారు. ఒకే పన్ను, ఒకే ఎన్నికలు, ఒకే సంస్కృతి, ఒకే భాష, ఒకే మతం మొదలగు నినాదాలతో భారతదేశ బహుళత్వాన్ని దెబ్బ తీయడానికి ప్రయత్నిస్తున్నారు. ఏం తినాలి, ఏం కట్టుకోవాలి, ఏం మాట్లాడాలి, ఏ విధంగా ప్రవర్తించాలి, ఎవరిని ప్రేమించాలి, ఎవరిని వివాహం చేసుకోవాలి, ఎవరితో మాట్లాడాలి, ఎంతమంది పిల్లలకు జన్మనివ్వాలి లాంటి వ్యక్తిగత జీవితానికి సంబంధించిన అంశాలన్నింటినీ శాసిస్తూ, బహుళత్వంలో కూడిన మన సంస్కృతిని నాశనం చేయడానికి ప్రయత్నిస్తున్నారు.

భారతదేశంలో ప్రజాస్వామ్యం, సమానత్వం, సామాజిక న్యాయం అనే భావజాలాలను నాటి, అభివృద్ధి చేస్తున్నది భారత రాజ్యాంగమే. రాజ్యాంగం భారతదేశపు అత్యంత ప్రాధాన్యత కలిగిన గొప్ప సజీవ రచన. విభిన్నమైన విశ్వాసాలను, కులాలను, సంస్కృతులను, భాషలను, నమ్మకాలను, వైఖరులను, అలవాట్లను, భావజాలాలను నడిపిస్తున్నది భారత రాజ్యాంగమే. అందువలన, మన భవిష్యత్ తరాలు క్షేమంగా జీవించడం కోసం రాజ్యాంగాన్ని, దానితోపాటుగా దాని లక్ష్యాలను మనం కాపాడుకోవాలి.

/ వ్యాసకర్త జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు, శాసనమండలి మాజీ సభ్యులు, సెల్ : 8309965083 /

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps @gmail.com

నీటి కోసం రోడ్డెక్కిన మహిళలు

● కుందుర్పిలో 3 నెలలుగా తాగునీటి సమస్య

ప్రజాశక్తి-కుందుర్పి

తాగునీటి కోసం కుందుర్పి మండల కేంద్రంలోని విద్యుత్ నగర్‌కు చెందిన మహిళలు శుక్రవారం రోడ్డెక్కారు. దాదాపు మూడు నెలలుగా తాగునీటి సమస్య నెలకొన్న పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడని ఆగ్రహిస్తూ విద్యుత్‌నగర్‌కు చెందిన పలువురు మహిళలు ప్రధాన రహదారిపైకి వచ్చి రెండు గంటలపాటు నిర్బంధించారు. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ.. మూడు నెలలుగా నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కరించాలని, ఇటు అధికారులు, ఇటు సర్పంచుకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందన్నారు. చేసేది లేక ఆందోళనకు దిగినట్లు తెలిపారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి తాగునీటి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ కాలనీ మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

కర్బూజ తోట

కర్బూజకు బూడిద తెగులు

● ఆందోళనలో రైతులు

ప్రజాశక్తి-పెద్దవడుగూరు (అనంతపురం)

ఎన్నో ఆశలతో రైతులు సాగు చేసిన కర్బూజపంటకు తెగులు సోకడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అనంతపురం జిల్లా పెద్దవడుగూరు మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలో పలువురు రైతులు నెలరోజుల క్రితం తీగజాతి కర్బూజ పంటను సాగు చేశారు. మొదటి నుంచి ఏపుగానే పెరిగినప్పటికీ ప్రస్తుతం దవనిబూడిద తెగులు సోకి పంటంతా ఎండుదశకు వచ్చినట్లు కనిపించడంతో రైతులకు దిక్కుతోచడం లేదు. ఎకరాకు ఏడు నుంచి పది టన్నుల దిగుబడులు వచ్చే పంటకు తెగులు సోకడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏ పంటలు వేసినా దిగుబడులు రాకుండా పోతున్నాయని, కర్బూజ పంటను సాగు చేస్తే ఈపంటకూ తెగులు సోకి తీరని నష్టాలను తెచ్చిపెడుతున్నాయని రైతులు అంటున్నారు. ఇంత జరుగుతున్నా ఉద్యానశాఖ అధికారులు కనీసం ఇటువైపు రాకపోవడంతో చాలామంది రైతులు పంటలు వేసి నష్టపోవాల్సి వస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

తెగులుతో దిక్కుతోచడం లేదు : హాజీవలి, క్రిష్టిపాడు

రెండెకరాల్లో గోల్డెన్ రకం కర్బూజ పంటను సాగు చేశా. పంట చేతికొచ్చే సమయంలో వింతరకం తెగులు సోకి నష్టపరుస్తుండటంతో దిక్కుతోచడం లేదు. ఎకరాకు రూ.80వేల చొప్పున పెట్టుబడి పెట్టా. కనీసం పెట్టుబడులైనా దక్కుతాయా.. లేదా.. అని ఎదురుచూస్తున్నా. పంటలో ఈఏడాది కొత్తరకానైన దిగుబడులు వస్తే కొంత నగదు వస్తుందని ఆశతో ఉండగా తెగులుతో ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

ఆశలు వదిలిపెట్టాం : శ్రీధర్‌నాయుడు, కదరరంపల్లి

ఈఏడాది ఎంతో ఆశతో రెండో పంటగా మాడెకరాల్లో తీగజాతి కర్బూజ పంటను సాగు చేశా. గతవారంలో మంచు, వలి ప్రభావంతో దవని బూడిద తెగులు సోకి ఆకులు ఎండిపోతున్నాయి. ఆకులు ఎండిపోవడంతో దిగుబడిపై ప్రభావం చూపుతోంది. దీంతో ఆశలు వదిలిపెట్టుకోవాల్సి వస్తోంది.

చేనేత కార్మికుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

అప్పుల బాధతో చేనేత కార్మికుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన సత్యసాయి జిల్లా ధర్మవరంలో చోటు చేసుకుంది. మృతుని కుటుంబసభ్యులు తెలిపిన వివరాల మేరకు..ధర్మవరం పట్టణం కొత్తపేటలోని రాంనగర్‌కు చెందిన నీలూరి కృష్ణమూర్తి (60) చేనేత కార్మికుడిగా పనిచేస్తున్నాడు. చేనేతలో గిట్టుబాటు కాక, కుటుంబపోషణ నిమిత్తం, ముగ్గురు కుమార్తెల పెళ్లిళ్ల నిమిత్తం చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక నిత్యం మదనపడేవాడు. ఈ క్రమంలో శుక్రవారం ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని భార్య నాగలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ రెడ్డప్ప తెలిపారు.

కొబ్బరి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

● ఏపి కొబ్బరి రైతుల సంఘం రాష్ట్ర కన్వీనర్ కె.శ్రీనివాస్

ప్రజాశక్తి - పెదవేగి

కొబ్బరి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, వెయ్యి కొబ్బరి కాయలకు రూ.20 వేలు ధర ఇవ్వాలని ఏపి కొబ్బరి రైతుల సంఘం రాష్ట్ర కన్వీనర్ కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కొబ్బరి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ ఆందోళన చేపట్టారు. శ్రీనివాస్ మాట్లాడుతూ..వెయ్యి కొబ్బరి కాయల ధర రూ.26 వేల నుంచి రూ.14 వేలకు పడిపోవడంతో కొబ్బరి రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారని చెప్పారు. కర్ణాటక, కేరళ రాష్ట్రాల నుంచి ఎగుమతులు పెరగడంతో మన కొబ్బరి కాయలకు ధర పడిపోయినట్లు వ్యాపారులు చెప్పి ఇక్కడ కొబ్బరి కాయల ధరలు తగ్గించి వేయడం తగదన్నారు. ఒక్కసారిగా కొబ్బరి కాయల ధర తగ్గించడం మార్కెట్ మాయాజాలంతో రైతులను మోసగించడమేనని విమర్శించారు. కొబ్బరి రైతులు అనేక ఏళ్లుగా నష్టపోయారని, ధర పెరిగిందంటే సంతోషం ఎంతో కాలం లేదన్నారు. వెయ్యి కొబ్బరికాయలకు కనీస ధర రూ.20 వేలు కల్పించాలని డిమాండ్ చేశారు. లేకపోతే కొబ్బరి రైతులను సమీకరించి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విజయరాయి ప్రాంతీయ కొబ్బరి రైతు సంఘం ఉపాధ్యక్షులు మున్నంగి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

పేరు మార్పు ప్రకటన

నేను, భీమిరెడ్డి కృష్ణరెడ్డి, తండ్రి పేరు బి.ఎన్.రెడ్డి, వయసు 54 సంవత్సరాలు, చిరునామా: ఫ్లాట్ నం. 434, అనిల్ క్యాసిల్ , కార్తికేయ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ ఎదురు, గొప్పపూడి, విజయవాడ, కృష్ణా జిల్లా-521225, ఇందుమూలముగా ప్రకటిస్తున్నాను.
నా పాత పేరు భీమిరెడ్డి కృష్ణరెడ్డిను మార్చి, ఇంతముందు నుండి భీమిరెడ్డి కృష్ణరెడ్డి బదులు భీమిరెడ్డి కృష్ణరెడ్డి (Bhimireddi Krishna Reddi) గా పిలువబడదలచుకున్నాను.
ఈ విషయం సంబంధిత శాఖలు, సంస్థలు మరియు ప్రజలు గమనించగలరు.

సం/- భీమిరెడ్డి కృష్ణరెడ్డి
(Bhimireddi Krishna Reddi)

ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ లిమిటెడ్

ఇ-ప్రొక్యూర్మెంట్ టెండరు ప్రకటన

ఎల్ఎస్ బేసిస్‌లో జమ్మలమడుగు సబ్ స్టేషన్ వద్ద ఇప్పటికే వున్న 400/220/132KV, 160 MVA PTR-2, 220/132KV, యొక్క టెస్టింగ్, ఎరెక్షన్, సరఫరా కొరకు స్పెసిఫికేషన్ నం.e-EHVT-24/2025 కొరకు బిడ్లు ఆహ్వానించబడుతున్నాయి. టెండర్లు 06.12.2025 నుండి 17.00 గం.లకు https://www.apeprocurement.gov.in లో అందుబాటులో వుంటాయి.
ఫోన్. 0866-2429232, ఎక్స్‌టెన్షన్:2057/2071.

DIPRNo: 4636PP/CL/ADVT/1/1/2021-22

సం/- చీఫ్ ఇంజనీర్/ ప్రాజెక్ట్స్/విఎస్/విజయవాడ

అసాధారణం
భాగం-2, సెక్షన్-3, సబ్-సెక్షన్ (2)

రైల్వే మంత్రిత్వశాఖ

(దక్షిణ మధ్య రైల్వే)

PUB/1543

ప్రకటన

సికింద్రాబాద్, 26 నవంబర్, 2025

ఎస్.ఓ. 5473(ఇ)-రైల్వే చట్టం, 1989 యొక్క సెక్షన్ 2 యొక్క క్లాజ్ (7ఎ) ద్వారా సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, కేంద్ర ప్రభుత్వం ఇందుమూలంగా అధికరణ చేయునది ఏమనగా, అధికారిక గజిట్‌లో ఈ పేర్కొన్న ప్రచురణ తేదీ నుండి వర్తిస్తూ సదరు పట్టిక యొక్క కాలం (3)లో పేర్కొన్న రాష్ట్రంలో ఎగ్జిక్యూషన్, మెయింటేనన్స్, మేనేజిమెంట్ & ఆపరేషన్ కొరకు పట్టిక యొక్క కాలం (2)లో పేర్కొన్నట్లు స్పెషల్ రైల్వే ప్రాజెక్ట్ కు సంబంధించిన, సంబంధిత అధికారులకు పనులు నిర్వహించుటకు దిగువ పట్టిక యొక్క కాలం (5)లో పేర్కొన్న అధికారికి అధికారాలు కల్పిస్తున్నారు.

పట్టిక

క్ర సం.	స్పెషల్ రైల్వే ప్రాజెక్ట్	రాష్ట్రం	జిల్లా	సంబంధిత అధికారి
(1)	(2)	(3)	(4)	(5)
1.	3000 మె.ట.ల లోడింగ్ టార్గెట్‌కు చెరువుగా 1×25కెవి నుండి 2×25కెవి వరకు ఎలక్ట్రిక్ ట్రాక్షన్ సిస్టమ్ యొక్క ప్రమాణాలు పెంపు పని. విజయవాడ-ఒంగోలు సెక్షన్‌లో బాపట్ల టిఎస్ఎస్ నిర్మాణము.	ఆంధ్ర ప్రదేశ్	బాపట్ల	రెవెన్యూ డివిజనల్ అధికారి, బాపట్ల

(ఎఫ్.నం. కన్.182/ఎస్ఆర్‌పి/టిఎస్ఎస్/బాపట్ల)
కె. సూర్యనారాయణ, చీఫ్ ఇంజనీర్/ కన్-3.

A1957

కెనరా బ్యాంక్ Canara Bank

(భారత ప్రభుత్వరంగ సంస్థ) సిండికేట్ Syndicate

ప్రాంతీయ కార్యాలయం : విజయవాడ
డోర్ నెం. 54-15-18/6, యలమంచిలి కాంప్లెక్స్ (స్పెన్సర్స్) ఎదురుగా, విజయవాడ-520008. ఫోన్: 0866-2468600

మరణించిన ఋణగ్రహీత యొక్క చట్టపరమైన వారసులకు డిమాండ్ నోటీసు

టు:
1. శ్రీమతి కందవల్లి సునీత (చట్టపరమైన వారసురాలు), భర్త : లేటు శ్రీ శ్రీనివాసరావు కందవల్లి, డి నెం.7-244/2, పంచాయతీ కార్యాలయం దగ్గర, విస్సన్నపేట, రెడ్డిగూడెం-521215.
2. శ్రీ కందవల్లి బాల నవీన్ కుమార్ (చట్టపరమైన వారసుడు), తండ్రి : లేటు శ్రీ శ్రీనివాసరావు కందవల్లి, డి నెం.7-244/2, పంచాయతీ కార్యాలయం దగ్గర, విస్సన్నపేట, రెడ్డిగూడెం-521215.
3. శ్రీ కృష్ణారావు అబ్బినేని (హామీదారు), తండ్రి : వెంకటేశ్వరరావు, డి నెం.6-95/3, తిరుపతమ్మ పేట, విస్సన్నపేట, రెడ్డిగూడెం-521215.

డియర్ సర్ / మేడమ్,

విషయం: సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 లోని సెక్షన్ 13(2) ప్రకారం డిమాండ్ నోటీసు.

మా కెనరా బ్యాంక్, నరసాపురం బ్రాంచ్ నుండి లేటు శ్రీ శ్రీనివాసరావు కందవల్లి పొందిన లోన్ వివరములు:

లోన్ స్వభావం & లోన్ అకౌంట్ నెం.	లోన్ మొత్తం మరియు లోన్ తేది	ఈ తేదీ నాటికి వడ్డీతో కలిపి బకాయి మొత్తం	వడ్డీ రేటు (2% పీనల్ వడ్డీతో కలిపి) (సం॥కి)
హౌసింగ్ లోన్ అకౌంట్ నెం. 37437740000121	రూ.10,00,000/- తేది. 13.05.2015	రూ. 4,12,763.14/-	10.90%

మాకు తనఖా పెట్టిన వ్యక్తి/వ్యక్తులచే వ్రాసి ఇవ్వబడిన సంబంధిత డాక్యుమెంట్ల ద్వారా ఈ నోటీసును షెడ్యూలులో వివరించిన ఆస్తుల తనఖా ద్వారా పైన తెలిపిన ఋణాలు/ఋణసౌకర్యాలకు తగు విధంగా హామీ కల్పించబడినది. పేర్కొన్న నియమ నిబంధనల ప్రకారం తమ ఋణాలను చెల్లించడంలో పైన తెలిపిన మీరు విఫలమైనందున బ్యాంక్ **సదరు ఋణాన్ని తేది.29.10.2025 న నిరర్ధక ఆస్తి (ఎన్.పి.ఎ)గా వర్గీకరించింది.** అందువలన ఈ నోటీసు తేది నుండి 60 రోజులలోగా **రూ.4,12,763.14/- (అక్షరాల నాలుగు లక్షల పన్నెండు వేల ఏడు వందల అరవై మూడు రూపాయల పద్నాలుగు పైసలు మాత్రమే)** + తదుపరి వడ్డీ, ఖర్చులు కలిపి మొత్తమును చెల్లించవలసిందిగా కోరుతూ సంబంధిత చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద మీకు ఈ నోటీసు జారీ చేయుచున్నాము. చెల్లించడంలో విఫలమైతే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అన్ని లేదా ఏవేని హక్కును మేము వినియోగించుకుంటాము. ఇంతే కాకుండా మా ముందస్తు సమ్మతి లేకుండా ఏ విధంగానూ షెడ్యూలులో తెలిపిన ఏ సెక్యూర్డ్ ఆస్తులతో ఏ రకంగానూ వ్యవహరించకుండా మీరు నిరోధింపబడుచున్నారు. సదరు చట్టం మరియు/ లేదా అమలులో ఉన్న చట్టం క్రింద లభించే ఏవేని ఇతర హక్కుకు ఎటువంటి ప్రతికూల అభిప్రాయం లేకుండా ఈ నోటీసు ఇవ్వబడింది.

SARFAESI చట్టం నందలి సెక్షన్ 13, సబ్ సెక్షన్ (8) ప్రకారము మీరు తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించుకోగలరని సూచించడమైనది. మా బ్రాంచ్ రికార్డులో అందుబాటులో ఉన్న మీ చిరునామాకు తిరుగు రశీదుతో కూడిన రిజిస్టర్డ్ పోస్టు ద్వారా డిమాండ్ నోటీసు పంపించడం జరిగింది.

తనఖా / తాకట్టు వుంచిన ఆస్తి యొక్క నిర్దిష్ట వివరాలు దిగువ పేర్కొనబడినవి

విస్సన్నపేట మండలం, విస్సన్నపేట యొక్క ఆర్ ఎస్ నెం.210/1 నందు విస్తీర్ణం ఎ. 0.07 సెంట్లు లేదా 338.8 చ॥గ॥లులోని ఇంటి స్థలం. **హద్దులు : తూర్పు** : షేక్ మౌలా సాహెబ్ గారి ఆస్తి, **దక్షిణం** : పంచాయితీ రోడ్డు, **పడమర** : ఉప్పలపాటి దుర్గా భవాని గారి స్థలం, **ఉత్తరం** : కందవల్లి గని రాజు గారి స్థలం.

CERSAI ID : 400010560343, టైటిల్ హోల్డర్ : లేటు శ్రీ శ్రీనివాసరావు కందవల్లి

తేది: 27.11.2025, ప్రదేశం: విజయవాడ
సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

'పవర్ గ్రిడ్' నిర్వాసిత రైతు ఆత్మహత్యాయత్నం

● పరిహారం ఇవ్వడంలో వివక్ష చూపారంటూ ఆవేదన

ప్రజాశక్తి - తాడిపత్రి రూరల్

అనంతపురం జిల్లాలోని రాయదుర్గం నుంచి తమిళనాడు వరకు పవర్ గ్రిడ్ విద్యుత్ లైను ఏర్పాటు కోసం భూమి కోల్పోయిన తాడిపత్రి మండలాన్ని చెందిన రైతు తనకు పరిహారం అందించడంలో అన్యాయం జరిగిందంటూ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు రైతును అనంతపురం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు... జిల్లాలోని రాయదుర్గం నుంచి తమిళనాడు వరకు పవర్ గ్రిడ్ విద్యుత్ లైను ఏర్పాటు చేస్తున్నారు. అందులో భాగంగా పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సంస్థ విద్యుత్ లైన్ వెళుతున్న పొలాలకు సంబంధించిన రైతులకు పరిహారం చెల్లిస్తోంది. ఈనేపథ్యంలో తాడిపత్రి మండలంలో ఆ విద్యుత్తు లైన్ కింద ఉన్న భూములు కోల్పోతున్న రైతులకు పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సంస్థ అన్యాయం చేస్తుందంటూ మండల రైతులు వాపోతున్నారు. విద్యుత్ లైన్ వెంబడి ఉన్న భూములకు చెల్లించే నష్టపరిహార విషయంలో అవకతవకలుగా ఉన్నాయని రైతులు అక్కడి అధికారులకు కాంట్రాక్టర్లకు విన్నవించుకుంటున్నా సంస్థ సిబ్బంది అవేమీ లెక్కచేయడం లేదు. ఒక్కొక్కరికి ఒక్కో విధంగా పరిహారం చెల్లిస్తున్నారు. మండల పరిధిలోని ఎర్రగుంటపల్లికి చెందిన గంగాధర అనే రైతుకు చెందిన సర్వేనెంబర్ 32లో విద్యుత్ లైన్ వెళుతోంది. అయితే రైతు గంగాధర్‌కు పరిహారం ఇవ్వటంలో సంస్థ సిబ్బంది వివక్ష చూపుతున్నారని బాధిత రైతు విమర్శిస్తున్నాడు. పక్క పొలం రైతుకు ఇచ్చినంత కూడా తమకు ఇవ్వలేదని అధికారులను పలుమార్లు అడిగినప్పటికీ స్పందించకపోవడంతో మనస్తాపానికి గురైన గంగాధర్ శుక్రవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు రైతు గంగాధర్ ను చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పవర్ గ్రిడ్ పై ఫిర్యాదు చేస్తాం : జేసీ ప్రభాకర్‌రెడ్డి

1.	లోన్ ఖాతా నం.: PR00040185 1. మెసర్స్.విజయదుర్గా టింబర్ మరియు సా మిల్ 2. శ్రీ.బర్మా చంద్రశేఖర రావు 3. శ్రీమతి. బర్మా వాణి 4. శ్రీమతి. బర్మా కోటేశ్వరమ్మ	15.09.2025	15.09.2025 నాటికి రూ. 59,72,373/- మరియు దానిపై వడ్డీ.	ఆస్తి యొక్క ఆ భాగం మరియు పార్శిల్ విస్తీర్ణత 338.2/9 చ.గజాలు లేదా 281.912 చ.మీ.ల రెసిడెన్షియల్ సైట్ ఎసిసి రూఫ్డ్ షెడ్ తో పాటు అన్ని సౌలభ్య హక్కులతో ఆర్.ఎస్.నం.65/ఎ2 భవానీపురం, పాత మునిసిపల్ వార్డు నం.1, ప్రస్తు వార్డు నం.4, పాత మూల్యాంకనం నం. 30774, ప్రస్తుత మూల్యాంకనం నం.91802, బేరింగ్ డోర్ నం.76-3-13ఎ, ప్రస్తుత డోర్ నం.76-3-13(1), భవానీపురం గ్రామం, విజయవాడ టౌన్, విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ ప్రాంతము, విజయవాడ రిజిస్ట్రేషన్ జిల్లా రిజిస్ట్రార్, కృష్ణా జిల్లా వద్ద వుంది. సరిహద్దు:తూర్పు: పిళ్ళ యొక్క ఆస్తి (ప్రస్తుతం అన్నబతిన మాధవ రావు యొక్క ఆస్తి), దక్షిణం: మునిసిపల్ రోడ్డు, పడమర: ఆశ్రమం అనబడే మునిసిపల్ రోడ్డు, ఉత్తరం: మోహన రావు ఆస్తి.	05.12.2025

తేది : 06.12.2025 ప్రదేశం : కృష్ణ
సం/- అధీకృత అధికారి మెసర్స్.చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్

AXIS BANK LIMITED

రీటైల్ లెండింగ్ మరియు పేమెంట్ గ్రూప్ (లోకల్ ఆఫీస్/బ్రాంచ్) : యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్, డో.నం.30-22-79, శ్రీ టవర్స్, 1వ అంతస్తు, ఏలూరు రోడ్డు, సీతారామపురం సర్కిల్, విజయవాడ-520002

రూల్ 8(1) క్రింద స్వాధీనతా నోటీసు (స్థిరాస్తి కొరకు)

ఏదైతే, దిగువసంతకందారు అయిన **యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్,** (గతంలో యుటిఐ బ్యాంక్ లిమిటెడ్ గా పేర్కొనబడినది) "త్రిశూల్", సమర్తెశ్వర్ గుడి ఎదురు, లా వద్ద గార్డెన్, ఎలిస్‌బ్రిడ్జి, అహ్మదాబాద్-380006 వద్ద దీని నమోదిత కార్యాలయం ఉంది. ఇతర ప్రదేశాలలో ఉన్న దీని శాఖా కార్యాలయం **రీటైల్ లెండింగ్ మరియు పేమెంట్ గ్రూప్ (లోకల్ ఆఫీస్/బ్రాంచ్) : యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్, డో.నం. 30-22-79, శ్రీ టవర్స్, 1వ అంతస్తు, ఏలూరు రోడ్డు, సీతారామపురం సర్కిల్, విజయవాడ-520002** యొక్క అధీకృత అధికారిగా సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువగల సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలతో సర్ఫేసీ యాక్ట్ యొక్క సెక్షన్ 13(2) క్రింద **డిమాండ్ నోటీసును** జారీ చేయడమైనది. పిలువబడిన రుణగ్రహీత/హామీదారులు/తనఖాదారులు :

క్ర సం.	దరఖాస్తుదారు/ సహ-దరఖాస్తుదారు, హామీదారుల పేరు/ చిరునామా	బాకీ రూ.లలో	తనఖాకు సమానంగా ఆఫర్ చేయబడిన ఆస్తులు మరియు స్వాధీనత తేది
1	1. **శ్రీ మేకపోతుల రవి కుమార్, తండ్రి. మేకపోతుల గోవిందు,** డోర్.నెం.25-258, సుబ్బయ్య తోట, పురుషోత్త పట్నం, చిలకలూరిపేట, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522616. **ఇక్కడ కూడా: శ్రీ మేకపోతుల రవి కుమార్ (యజమాని), c/o మాధవి స్టీల్స్,** డోర్.నెం.809/ఎ, చిలకలూరిపేట, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522616. 2. **శ్రీ మేకపోతుల సాయి కిషోర్, తండ్రి. మేకపోతుల రవి కుమార్,** డోర్.నెం.25-258, సుబ్బయ్య తోట, పురుషోత్త పట్నం, చిలకలూరిపేట, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ - 522616. **ఇక్కడ కూడా: శ్రీ మేకపోతుల సాయి కిషోర్, తండ్రి. మేకపోతుల రవి కుమార్,** డోర్ నం.3-323/2, 8వ లైను, పందిరిపుర, పురుషోత్త పట్నం, చిలకలూరిపేట, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522616. **లోన్ అకౌంట్ నెం.: LPR006903321020 డిమాండ్ నోటీసు తేది : 31-07-2025**	రూ. 27,47,331/- (ఇరవై ఏడు లక్షల నలభై ఏడు వేల మూడు వందలు ముప్పై ఒక్క రూపాయలు మాత్రమే)	ఆస్తి యొక్క ఆ భాగం గుంటూరు జిల్లా, నరసారావుపేట రిజిస్ట్రేషన్ జిల్లా, చిలకలూరిపేట సబ్-జిల్లా, చిలకలూరిపేట ఉప జిల్లా, చిలకలూరిపేట మునిసిపల్ 3వ బ్లాక్, పురుషోత్తమ పట్నం గ్రామం యొక్క డోర్.నం.131/బి, ఆస్తి విస్తీర్ణం 237.13 చ.గ.లు, లేదా 167.50 చ.మీ., సైట్, గ్రౌండ్, మొదటి, రెండవ అంతస్తులు ఆర్‌సిసి భవనం దానిలో డోర్ నెం.3-323/2, చిలకలూరిపేట మున్సిపల్ ఏరియా మూల్యాంకనం నెం.1020018226 మరియు దీని ద్వారా పరిమితం చేయబడింది: తూర్పు:మునిసిపల్ బజార్-37.5 అ.గు.లు., దక్షిణం: మునిసిపల్ బజార్-57.43. అ.గు.లు., పడమర: వర్ల రాజశేఖర్‌కు చెందిన ఆస్తి - 37.7 అడుగులు, ఉత్తరం: కోత రాధాకృష్ణ మూర్తి యొక్క సైట్- 57.4 అడుగులు. **లాంఛనాప్రాయ స్వాధీనతా తేది:-03-12-2025**

తేది : 06.12.2025 ప్రదేశం : ఆంధ్రప్రదేశ్
సం/- అధీకృత అధికారి యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్

బహిరంగ ప్రకటన

ICICI Bank
శాఖ కార్యాలయం : ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్, 4/10, మైత్రి టవర్, బొమ్మన్ హళ్లి హొసూర్ మెయిన్ రోడ్డు బెంగళూరు-560068.

కింది రుణగ్రహీతలు బ్యాంక్ నుండి పొందిన రుణాల సదుపాయం యొక్క అసలైన మరియు వడ్డీని తిరిగి చెల్లించడంలో డీఫాల్ట్ అయ్యారు మరియు రుణాలు పని చేయని ఆస్తులు (ఎన్‌పిఎ) గా వర్గీకరించబడ్డాయి. సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్-2002 సెక్షన్ 13(2) కింద వారికి నోటీసు జారీ చేయబడింది, వారి చివరిగా తెలిసిన చిరునామాలపై అది అందించబడలేదు అందువల్ల ఈ బహిరంగ నోటీసు ద్వారా వారికి తెలియజేయడమైంది.

క్ర సం.	రుణగ్రహీత/సహ రుణగ్రహీత/ హామీదారుల పేరు (లోన్ అకౌంట్ నెంబరు) మరియు చిరునామా	అమలు చేయబడిన సెక్యూర్డ్ అసెట్స్ చిరునామా	నోటీసు పంపిన తేది/ నోటీసు తేది నాటికి బకాయి మొత్తం	ఎన్‌పిఎ తేది
1.	కుర్రి శివారెడ్డి-(మరణించారు) వీరి చట్టపరమైన వారసుల ద్వారా కుర్రి సామ్రాజ్యం/ LBMAC00005175007/ డో.నం.13-1-424/2బి 14వ వార్డు కీరితి రెడ్డి మాస్టర్ రోడ్డు గుంటూరు-522426.	లోన్ డాక్యుమెంట్/ ఆస్తి డాక్యుమెంట్‌లో వివరించిన ప్రకారం నరసరావుపేట రిజిస్ట్రేషన్ జిల్లా, మాచర్ల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, మాచర్ల మున్సిపాలిటీ కార్యాలయం, మాచర్ల బ్లాక్ నం.13 డో.నం.670/బి డో.నం.13-1-424/1, మూల్యాంకనం నం.1022006446, ఇంటి సరిహద్దులు : ఆర్‌సిసి స్లాబ్ ఇంటి కొలిచే ఏరియా - ఈ సరిహద్దుల మధ్య 3880 చ.లిం.లు. లేదా 187.792 చ.గ.లు. స్థలం, ఈ 1340 చ.అ.లు. హద్దులు : ఉత్తరం : ఈ దిశ కొలత- 40 లిం.లు., దక్షిణం : ఈ దిశ కొలత- 40 లిం.లు., తూర్పు : దొర్నాల సంజీవరెడ్డి ఇల్లు-98 లిం.లు., పడమర : ఈ దిశ కొలత- 40 లిం.లు.	31.10.2025 Rs. 12,88,461.55/-	20.03.2023
2.	రుద్ర శ్రీనివాసరావు - (మరణించారు) వీరి చట్టపరమైన వారసులు రుద్ర నరసింహారావు ద్వారా / LBGTR00006414625/ 31-334 రాగన్న పాలెం రాగన్నపాలెం చిలకలూరి గుంటూరు-522616.	నరసరావుపేట మున్సిపల్ పాత వార్డు నం.4, కొత్త వార్డు నం.9, పాత సర్వే డో.నం.452, వై 5-14 లొకాలిటీ నం.11, టి.ఎస్.నం.752 బ్లాక్ నం.1/10, పాత సర్వే డో.నం.448, ఆర్ యు వైఎ 4-18, పాత మూల్యాంకనం నం.10239, దరిమిల మూల్యాంకనం నం.2086, కొత్త మూల్యాంకనం నం.1024007955, డో.నం.11-6 22/58, ప్రస్తుత డో.నం.11-16-22/1 హద్దులు : తూర్పు: మున్సిపల్ బజారు సరిహద్దు--ఎ 42-0, దక్షిణం : మహంకాళి శ్రీనివాసరావు ఇల్లు సరిహద్దు- ఉమ్మడి సరిహద్దు గోడ ఎ 94-0, పడమర : దివ్వెల హనుమంతరావు ఆస్తి సరిహద్దు- మా సొంత సరిహద్దు గోడ సరిహద్దు ఎ 41 8, ఉత్తరం : శ్రీ.రాఘవేంద్ర కన్‌స్ట్రక్షన్స్' ఆస్తి సరిహద్దు-- ఉమ్మడి సరిహద్దు గోడ సరిహద్దు--ఎ 94-6 ఈ నాలుగు సరిహద్దుల స్థలం ప్లాట్ కొలత 366-23 చ.మీ.లు. కు సమనామైన 438-08 చ.మీ.లు. సామూహిక నిరవధిక మరియు విడదీయని వాటా మరియు స్థలం ప్లాట్ కొలత 36-62 చ.మీ.లు. కు సమనమైన 43-808 చ.మీ.లు. (రెండు కార్ పార్కింగ్ ప్రదేశాలతో సహా) మరియు దాని నుండి ఉత్పన్నమయ్యే అన్నీ హక్కులతో కలిపి దానికి అనుగుణంగా పై షెడ్యూల్ ప్రకారం "ఎస్.ఎన్.ఆర్ సిగ్నేచర్" పేరుతో భవనం రెండవ అంతస్తు, మూడు పడక గదుల ఫ్లాట్ నం.301 అమ్మకం కొరకు ప్లాట్ సరిహద్దులు : తూర్పు : మెట్లకేస్ మరియు లిఫ్ట్‌కు జతచేసిన కామన్ కారిడార్, దక్షిణం: ఓపెన్ టు స్కై, పడమర : ఓపెన్ టు స్కై, ఉత్తరం : ఓపెన్ టు స్కై 2007-0 చ.అ.లు. ఈ నాలుగు సరిహద్దుల మధ్య ఆర్‌సిసి. మొత్తం భవనం (సాధారణ ఏరియా తో సహా) తో పాటు ప్రత్యేక రూఫ్, ఉడ్, ఫర్నీచర్, తలుపులు, తలుపు ఫ్రేములు, విద్యుత్ మరియు ఎలివేటర్, మెట్లకేస్ మొదలైన వాటితో కలిపి సాధారణ హక్కులతో ఇతర ఫ్లాట్ యజమానులు, మీకు విక్రయం మరియు బదిలీ చేయడమైనది.	30.10.2025 Rs. 58,62,611.49/-	04.12.2024

నోటీసు యొక్క ప్రత్యామ్నాయ సేవ కోసం చర్యలు తీసుకోబడుతున్నాయి. పై రుణగ్రహీతలు/మరియు/లేదా వారి హామీదారులు (వర్తించే విధంగా) ఈ నోటీసును ప్రచురించిన తేదీ నుండి 60 రోజుల వ్యవధిలోపు బకాయి ఉన్న చెల్లించాలని సూచించారు. లేకపోతే సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్-2002 నిబంధన ప్రకారం తదుపరి చర్యలు తీసుకోబడతాయి.
తేది : 06 డిసెంబరు, 2025 ప్రదేశం : గుంటూరు
అధీకృత సెక్రెటరీ ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ తరఫున

యుపిలో మరో బిఎల్‌ఓ మృతి

లక్నో : ఓట్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో ఒత్తిడి తట్టుకోలేక మరణిస్తున్న బూత్ లెవల్ ఆఫీసర్లు (బిఎల్ఓ) సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. తాజాగా ఉత్తరప్రదేశ్‌లో ఒక మహిళా బిఎల్ఓ గుండెపోటుతో ప్రాణాలు కోల్పోయారు. రాష్ట్రంలోని అలీఘర్ జిల్లాలో పదవీ విరమణకు దగ్గరగా ఉన్న స్కూల్ ప్రిన్సిపాల్ సాధన వర్మ (59) ఎస్ఐఆర్ విధుల్లో బూత్ లెవల్ అధికారిగా పనిచేస్తున్నారు. ఎస్ఐఆర్ పని ఒత్తిడితో గురువారం గుండెపోటుకు గురై ఇంట్లోనే ఆమె మరణించినట్లు కుటుంబ సభ్యులు విద్యాశాఖ అధికారులకు శుక్రవారం తెలిపారు. తన తల్లికి ఐదు నెలలుగా జీతం అందలేదని, ఈ విషయంపై అధికారులతో పదేపదే సంప్రదింపులు జరిపినా ఫలితం లేకపోవడంతో తీవ్ర ఒత్తిడికి గురయ్యారని సాధన వర్మ కుమారుడు చేతన్ వర్మ మీడియాకు తెలిపారు. ఈ విషయంపై దర్యాప్తునకు ప్యానెల్‌ను ఏర్పాటు చేసినట్లు ప్రాథమిక శిక్షా అధికారి (బిఎస్ఎ) రాకేష్ కుమార్ తెలిపారు. యుపిలో పలువురు బిఎల్‌ఒల మృతి

దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ ఒత్తిడి తట్టుకోలేక పలువురు బిఎల్‌ఒలు మరణించిన సంగతి తెలిసిందే. ఉత్తరప్రదేశ్‌లో ఈ నెల 2న హత్రాస్ జిల్లాలో బిఎల్ఓగా పనిచేస్తున్న ఒక అసిస్టెంట్ టీచర్ గుండెపోటుతో మరణించారు. నవంబర్ 30న మొరాదాబాద్‌లో ఒక బిఎల్ఓ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. తనకు కేటాయించిన పనిని పూర్తి చేయడానికి తగినంత సమయం ఇవ్వలేదని ఆ బిఎల్ఓ తన సూసైడ్ నోట్‌లో రాశారు. ఉత్తరప్రదేశ్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిని బహిరంగపరచాలని, బూత్ లెవల్ అధికారులు (బిఎల్ఓ)పై ఒత్తిడి ఆపాలని సమాజ్‌వాది పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ డిమాండ్ చేశారు. బిఎల్‌ఓలపై అధిక పని భారం పడకుండా ఉండటానికి అదనంగా సిబ్బందిని నియమించాలని ఎన్నికల సంఘాన్ని కోరారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు.

తటస్థులం కాదు... శాంతి కాముకులం

- పుతిన్‌తో మోడీ ఆర్థిక, వాణిజ్య సంబంధాల బలోపేతానికి ఐదేళ్ల ప్రణాళిక
- పలు ఒప్పందాలపై ఇరు దేశాల సంతకాలు

హైదరాబాద్ హౌస్‌లో రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో మాట్లాడుతున్న మోడీ

న్యూఢిల్లీ : రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికేందుకు జరుగుతున్న శాంతి యత్నాలకు మద్దతు ఇస్తామని ప్రధాని నరేంద్ర మోడీ తెలిపారు. తాము తటస్థులం కాదని, శాంతి కాముకులమని చెప్పారు. భారత్‌లో పర్యటిస్తున్న రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో కలిసి మోడీ శుక్రవారం హైదరాబాద్ హౌస్‌లో మీడియా సమావేశంలో మాట్లాడారు. 'ఉక్రెయిన్ సంక్షోభం తర్వాత మనం సన్నిహితులమయ్యాం. నిజమైన స్నేహితుడిగా మీరు మాకు జరుగుతున్న పరిణామాలపై అవగాహన కలిగిస్తున్నారు. ఈ నమ్మకమే ఒక పెద్ద బలం. శాంతి ద్వారానే ప్రపంచ సంక్షేమం సాధ్యపడుతుంది. మనందరం శాంతి స్థాపన దిశగా కలిసి పనిచేయాలి. ఇటీవల జరుగుతున్న ప్రయత్నాలను చూస్తుంటే ప్రపంచం మరోసారి శాంతి దిశగా తిరిగి వస్తుందని ఆశిస్తున్నాను' అని పుతిన్‌తో మోడీ అన్నారు.

ఆర్థిక సహకారంపై కార్యాచరణ ప్రణాళిక

ఆర్థిక, వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేసుకునే దిశగా ఐదేళ్ల ప్రణాళికను ఇరు దేశాలు ధ్రువీకరించాయి. ఈ సందర్భంగా రష్యాతో ఆర్థిక సహకారానికి సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను మోడీ ప్రకటించారు. 2030 నాటికి ద్వైపాక్షిక వాణిజ్యాన్ని వంద బిలియన్ డాలర్లకు చేర్చడమే ఈ ప్రణాళిక లక్ష్యమని తెలిపారు. 'మీరు భారత్‌లో తొలిసారి అడుగుపెట్టి పాతిక సంవత్సరాలు గడిచాయి. మీ మొదటి పర్యటనలోనే వ్యూహాత్మక భాగస్వామ్యానికి పునాది పడింది' అని పుతిన్‌నుద్దేశించి ఈ సందర్భంగా మోడీ వ్యాఖ్యానించారు.

ప్రధాని మోడీ నేతృత్వంలో భారత్ స్వతంత్ర, సార్వభౌమాధికార విధానాన్ని అనుసరిస్తోందని పుతిన్ పేర్కొన్నారు. అది మంచి ఫలితాలను ఇస్తోందని వ్యాఖ్యానించారు. ఇండియా-రష్యా బిజినెస్ ఫోరంనుద్దేశించి పుతిన్ మాట్లాడుతూ, మోడీ తీసుకున్న చొరవ కారణంగా మేక్ ఇన్ ఇండియా కార్యక్రమం వంటివి బాగా సాగుతున్నాయన్నారు. సాంకేతికంగా కూడా భారత్ సార్వభౌమాధికారంగా ఆవిర్భవిస్తోందన్నారు.

పెట్టుబడులపై ఒప్పందానికి చర్చలు వేగవంతం

పెట్టుబడుల పెంపు, రక్షణపై పరస్పరం లాభదాయకంగా వుండే ఒప్పందాన్ని రూపొందించేందుకు చర్చలను వేగవంతం చేయాల్సిందిగా మోడీ, పుతిన్ శుక్రవారం అధికారులను ఆదేశించారు. 23వ వార్షిక సదస్సు సందర్భంగా ఈ అంశం వారి మధ్య చర్చకు వచ్చింది.

పలు ఒప్పందాలపై సంతకాలు

రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భారత పర్యటనలో భాగంగా వివిధ రంగాలలో ద్వైపాక్షిక సహకారాన్ని పెంచుకునేందుకు రెండు దేశాలు పలు ఒప్పందాలపై సంతకాలు చేశాయి. ఆరోగ్యం-ఆహార భద్రత, ఓడరేవులు-నౌకాయానం, వలసలు-మొబిలిటీ వంటి రంగాలలో అవగాహనా ఒప్పందాలు (ఎంఓయూలు) కుదిరాయి. 2030 వరకూ రెండు దేశాలు ఆర్థికంగా సహకరించుకునేందుకు అంగీకరించాయని ప్రధాని నరేంద్ర మోడీ చెప్పారు. యూరేషియన్ ఎకనమిక్ యూనియన్‌తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని సాధ్యమైనంత త్వరగా కుదుర్చుకునేందుకు కృషి చేయాలని కూడా నిర్ణయించాయని తెలిపారు. పలు అంశాలపై ఇరు దేశాల మధ్య పత్రాల మార్పిడి జరిగిందని విదేశాంగ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మీడియాకు తెలిపారు.

వ్యాపారవేత్తలతో భేటీ

ద్వైపాక్షిక చర్చల అనంతరం ఇరువురు నేతలు భారత్-రష్యా వ్యాపార ఫోరం సమావేశానికి హాజరయ్యారు. ఇరు దేశాల వ్యాపారవేత్తలను ఉద్దేశించి ప్రసంగించారు. పుతిన్ గౌరవార్థం శుక్రవారం రాత్రి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విందు ఇచ్చారు.

రాష్ట్రపతి భవన్‌లో ఘన స్వాగతం

అంతకుముందు రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోడీ పుతిన్‌కు స్వాగతం పలికారు. అనంతరం పుతిన్ రాజ్‌ఘాట్‌ను సందర్శించి జాతిపిత మహాత్మా గాంధీకి నివాళి అర్పించారు.

అటువంటి వ్యాఖ్యలు తగవు!

- రోహింగ్యాలపై చీఫ్ జస్టిస్ వ్యాఖ్యలపై న్యాయ నిపుణుల లేఖ
- రాజ్యాంగ విలువలకు ముప్పుగా పరిణమిస్తాయని ఆందోళన

న్యూఢిల్లీ : రోహింగ్యాల గురించి భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ చేసిన వ్యాఖ్యలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తులు, సీనియర్ న్యాయవాదులు, న్యాయ నిపుణులు చీఫ్ జస్టిస్‌కు ఒక బహిరంగ లేఖ రాశారు. రోహింగ్యా శరణార్థులు కొంతమంది భారత్‌లో పోలీసుల కస్టడీలో వుండగా అదృశ్యమవడంపై ఆందోళన వ్యక్తం చేస్తూ దాఖలైన హక్కుల కార్యకర్త రీటా మన్‌చందా దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా సిజెఐ వ్యాఖ్యలు చేశారు. రోహింగ్యా శరణార్థుల హోదాను జస్టిస్ సూర్యకాంత్ ప్రశ్నించారు. 'దేశంలోకి చట్ట విరుద్ధంగా చొరబడిన వారికి రెడ్ కార్పెట్ పరవాలా?' అంటూ వ్యాఖ్యలు చేశారు. "హింస, వేధింపులను భరించలేక పారిపోతున్న వారిపై వారి గౌరవానికి విరుద్ధమైన రీతిలో వ్యాఖ్యలు చేయడం మన రాజ్యాంగ ప్రాథమిక విలువలకు ముప్పుగా పరిణమిస్తాయి. పైగా ఆశ్రయం కోరుతూ న్యాయస్థానాలను ఆశ్రయించడం పట్ల ప్రజలకు గల నమ్మకం కూడా దెబ్బతింటుంది." అని ఆ లేఖలో న్యాయ నిపుణులు పేర్కొన్నారు. న్యాయస్థానాల్లో, జ్యుడీషియల్ తీర్పుల్లో వ్యాఖ్యలు చేసేటప్పుడు, అలాగే బహిరంగంగా ప్రకటనలు చేసేటప్పుడు మూలాలతో నిమిత్తం లేకుండా అందరి పట్ల న్యాయం, గౌరవం ప్రాతిపదికకు, రాజ్యాంగ నైతికతకు కట్టుబడాలని ఆ లేఖలో వారు పునరుద్ఘాటించారు. 'మీరెన్ని తీర్పులు ఇచ్చారు, లేదా పాలనాపరమైన చర్యలేం తీసుకున్నారనే దానిపై సుప్రీంకోర్టు, మీ కార్యాలయం ఘనత, గౌరవం ఆధారపడదు, మీరెంత మానవీయతతో తీర్పులు ఇచ్చారనేదే పరిగణనలోకి వస్తుంది.' అని జస్టిస్ సూర్యకాంత్‌ను ఉద్దేశిస్తూ ఆ లేఖ పేర్కొంది. పేదలు, సమాజంలో వెనుకబడినవారు, అణచివేతకు గురయ్యేవారి హక్కుల సంరక్షకదారుగా సుప్రీంకోర్టు వ్యవహరించాలని ఆ లేఖ నొక్కిచెప్పింది. "మీ మాటలు న్యాయస్థానంలోనే కాదు, దేశ ప్రజల మనస్సాక్షిలోనూ ప్రభావం చూపుతాయి. హైకోర్టులు, దిగువ న్యాయస్థానాలు, ఇతర ప్రభుత్వ అధికార యంత్రాంగంపైనా ప్రభావం చూపుతాయని పేర్కొంది. రోహింగ్యాలు భారతదేశంలో నివసించే మరే ఇతర వ్యక్తిలానే 21వ అధికరణ కింద అన్ని రక్షణలకూ అర్హులు. ఈ ప్రాథమిక హక్కు దేశ పౌరుడికే కాదు, ఈ దేశంలో నివసించే ఎవరికైనా అందుబాటులో వుంటుందని ఆ లేఖ పేర్కొంది. దేశభద్రతా ప్రయోజనాలను, పౌరుల ఆందోళనలను గమనంలోకి తీసుకుంటూనే వివిధ ప్రాంతాలకు చెందిన శరణార్థులకు ఆశ్రయం ఇవ్వడం, వారికి మానవతాపరమైన రక్షణ కల్పించిన రికార్డు భారతదేశానికి వుందని ఆ లేఖ గుర్తు చేసింది. టిబెటన్లు, శ్రీలంక జాతీయులకు ప్రత్యేక పత్రాలు జారీచేసిన ప్రభుత్వం వారిని శరణార్థులుగా గుర్తించిందని, వారికి మౌలిక సామాజిక, ఆర్థిక హక్కులు కూడా కల్పించిందని గుర్తు చేశారు. వాస్తవానికి పౌరసత్వ సవరణ చట్టం హింస, వేధింపుల భయంతో బంగ్లాదేశ్, పాకిస్తాన్ లేదా ఆఫ్ఘనిస్తాన్‌ల నుండి పారిపోయిన మతపరమైన మైనారిటీలు (ముస్లిమేతరులు)కు విదేశీ చట్ట నిబంధనల నుండి మినహాయింపు కల్పించిందని ఆ లేఖలో వారు పేర్కొన్నారు. ఈ లేఖపై సంతకాలు చేసిన వారిలో ఢిల్లీ హైకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ ఎ.పి.షా, తమిళనాడు మాజీ న్యాయమూర్తి జస్టిస్ కె.చంద్రు, జస్టిస్ అంజనా ప్రకాష్, జాతీయ జ్యుడీషియల్ అకాడమీ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ మోహన్ గోపాల్, సీనియర్ న్యాయవాదులు రాజీవ్ ధావన్, చందర్ ఉదయ్ సింగ్, కొలిన్ గొంజాల్వ్స్, మిహిర్ దేశాయ్, గోపాల్ శంకర్ నారాయణన్, న్యాయవాదులు కామినీ జైస్వాల్, ప్రశాంత్ భూషణ్, చెరియల్ డిసౌజా, అలోక్ ప్రసన్న కుమార్, ఆర్‌టిఐ కార్యకర్తలు నిఖిల్ డే, అంజలి భరద్వాజ్ ప్రభృతులున్నారు.

పంజాబ్‌లో పట్టాలెక్కిన రైతులు

- 19 చోట్ల నిరసనలు, రైళ్ల సేవలకు అంతరాయం

చండీగఢ్ : కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన విద్యుత్ సవరణ బిల్లు 2025, ఇతర రైతు వ్యతిరేక విధానాలు రద్దు చేయాలని కోరుతూ పంజాబ్‌లోని రైతులు పట్టాలెక్కి శాంతియుత నిరసన చేపట్టారు. పంజాబ్ రైతు సంస్థ, కిసాన్ మజ్దూర్ మోర్చా పిలుపుమేరకు శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా "రైల్ రోకో" నిరసనలు నిర్వహించారు.. 19 చోట్ల పట్టాలపై రైతులు బైటాయించారు. శాంతియుత నిరసనకు ముందు కొంతమంది నాయకుల ఇళ్లపై పోలీసులు దాడి చేసి, గృహ నిర్బంధంలో ఉంచిందని రైతు నేతలు తెలిపారు. అమృత్‌సర్, గురుదాస్‌పూర్‌లలో, రైతు నాయకులు పరమ్‌జిత్ సింగ్ భుల్లార్, జగ్‌దీప్ సింగ్ జగ్గి, కుల్దీప్ సింగ్ తప్లి, బీబీ హర్జిత్ కౌర్ గురుదాస్‌పూర్, నిషాన్ సింగ్ మెహడే, హర్పాల్ సింగ్ పఠాన్‌కోట్‌ల ఇళ్లపై పోలీసులు దాడి చేశారు. రైతుల ఆందోళనల కారణంగా.., షాన్-ఎ-పంజాబ్, ఢిల్లీ-అమృత్‌సర్ శతాబ్ది, టాటా ఎక్స్‌ప్రెస్, ఫ్లయింగ్ మెయిల్, అమృత్‌సర్ .. ఢిల్లీ మధ్య నడిచే రైళ్లకు అంతరాయం కలిగింది. రైలు దిగ్బంధనం సమయంలో 80 శాతం ట్రాక్‌లపై రైళ్లు నడపడం లేదని మోర్చా నాయకులు తెలిపారు.

రైతు సంఘాల డిమాండ్లు..

2025 విద్యుత్ సవరణ బిల్లును పూర్తిగా ఉపసంహరించుకోవాలి. ప్రీపెయిడ్ / స్మార్ట్ మీటర్లను తొలగించి, పాత మీటరింగ్ వ్యవస్థను పునరుద్ధరించాలి. ప్రతిపాదిత చట్టాన్ని, రాష్ట్ర ప్రభుత్వ విధానాలను, విద్యుత్ బోర్డుల ప్రయివేటీకరణను వ్యతిరేకించాలి. రైతులు, కార్మికులు, సాధారణ వినియోగదారులపై అదనపు భారాలు పడకుండా చర్యలు తీసుకోవాలి.

కేంద్ర ప్రాయోజిత పథకాల అమలులో రాష్ట్రాలకు మరిన్ని అధికారాలు

- రాజ్యసభలో ప్రైవేట్ మెంబర్ బిల్లును ప్రవేశపెట్టిన జాన్ బ్రిట్టాస్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర ప్రాయోజిత పథకాలను అమలు చేయడంలో రాష్ట్రాలకు మరిన్ని అధికారాలు కల్పించడానికి రాజ్యాంగాన్ని సవరించాలని ప్రతిపాదించే ప్రైవేట్ మెంబర్ బిల్లును సిపిఎం రాజ్యసభ పక్షనేత జాన్ బ్రిట్టాస్ ప్రవేశపెట్టారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 282లో ఈ సవరణను ప్రతిపాదించారు. దీనితో పాటు, బ్రిట్టాస్ వన్యప్రాణుల రక్షణ సవరణ బిల్లు, డిజిటల్ వ్యక్తిగత డేటా రక్షణ సవరణ బిల్లును ప్రవేశపెట్టారు. రాష్ట్ర, ఉమ్మడి జాబితాల్లో చేర్చబడిన అంశాల్లో కేంద్ర ప్రాయోజిత పథకాలకు ఉద్దేశించిన డబ్బును రాష్ట్ర బడ్జెట్‌తో ఖర్చు చేయాలని రాజ్యాంగ సవరణ బిల్లు ప్రతిపాదిస్తుంది. రాష్ట్రాలు ఈ పథకాల అమలును స్వతంత్రంగా ప్రణాళిక చేసుకోగలుగుతాయి. రాష్ట్రం ఈ పథకాల బ్రాండింగ్‌ను కూడా నిర్వహించగలవు. ఇందులో, రాష్ట్ర అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సవరణ సూచిస్తుంది. వన్యప్రాణుల రక్షణ సవరణ బిల్లు ప్రధాన లక్ష్యం కేంద్ర ప్రభుత్వానికి మాత్రమే పరిమితమైన వన్యప్రాణులను పీడించే తెగుళ్లుగా ప్రకటించే హక్కు స్థితిని మార్చడం. వన్యప్రాణులు-మానవ సంఘర్షణను నిర్వహించడానికి ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయడం వంటి ప్రతిపాదనలు కూడా ఈ బిల్లులో ఉన్నాయి. డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ సవరణ బిల్లు రాజ్యాంగంతో పౌరులకు హామీ ఇవ్వబడిన గోప్యతను కాపాడటం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ మేరకు బిల్లు వరుస సవరణలను ప్రతిపాదిస్తుంది. ఇప్పటికే ఉన్న చట్టాన్ని సకాలంలో నవీకరించే ప్రతిపాదనలను కూడా కలిగి ఉంటుంది.

విమాన సంక్షోభం మరింత తీవ్రం

(మొదటిపేజీ తరువాయి)

100, హైదరాబాద్‌లో 90కి పైగా సర్వీసులను రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు. దేశంలోని ఇతర ముఖ్యమైన విమానాశ్రయాల్లోనూ ఇదే పరిస్థితి. దీనిని అవకాశంగా తీసుకున్న ఇతర విమాన సంస్థలు టిక్కెట్ల ధరలు భారీగా పెంచేశాయి. సాధారణంగా ఉండే ధరలతో పోలిస్తే ఈ ధరలు రెండు, మూడు రెట్లు పెరిగాయి. ప్రస్తుతం ముంబయి- ఢిల్లీ- ముంబయి మార్గంలో టిక్కెట్ల ధరలు రూ.20 వేల నుంచి రూ.40 వేలు వరకు పెరిగాయి. సాధారణ సమయంలో ఢిల్లీ-ముంబయి రౌండ్ ట్రిప్ ధర చివరి నిమిషంలో బుక్ చేసుకున్నా రూ.20 వేలు వరకూ ఉండేది. ఇప్పుడది ఏకంగా రూ 60 వేల వరకూ పెరిగింది. ముంబయి-శ్రీనగర్ మధ్య సాధారణంగా రూ.10 వేలు ఉండే టికెట్ ధర ఇప్పుడు ఏకంగా రూ. 62 వేలుకు పెరిగింది. దీంతో ప్రయాణికులు గగ్గోలు పెడుతున్నారు. ఈ భారీ పెంపుపై కేంద్ర ప్రభుత్వం ఏమాత్రం స్పందించడం లేదు. గతంలో ఎయిర్ ఇండియా ప్రభుత్వ నియంత్రణలో ఉన్నప్పుడు టిక్కెట్ల రేటుపై నియంత్రణ ఉన్న సంగతి తెలిసిందే. ఇప్పుడు ప్రైవేటు యాజమాన్యంలో ఉన్న ఆ సంస్థ కూడా రేట్ల పెంపుదలలో పోటీపడుతోంది.

'ఆ' నిబంధనలు మార్చండి.. ప్రభుత్వ సానుకూల స్పందన

ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని పైలట్ల ఫ్లైట్ డ్యూటీ టైమింగ్స్‌లో డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డిజిసిఎ)ను ఇటీవల చేసిన నిబంధనలను మార్చాలని తాజాగా ఇండిగో కోరింది. డిజిసిఎ పేర్కొన్న విధంగా పైలట్లకు విశ్రాంతిని, తక్కువ పనిగంటలను ఇవ్వలేమని, అంతమంది సిబ్బంది లేరని ఆ సంస్థ వాదించింది. ఈ నేపథ్యంలో ఇండిగోకు ఊరట కల్పించేలా నిబంధనలను ప్రభుత్వం కొంత మేర సడలించింది. అదే సమయంలో ఇండిగో విమానాల రద్దు, ఆలస్యంపై దారితీసిన కారణాలను గుర్తించడానికి పౌర విమానయాన శాఖ ఉన్నతస్థాయి దర్యాప్తునకు ఆదేశించింది.

శ్రమదోపిడీకే లేబర్ కోడ్లు

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్రాల అధికారాలను ఆక్రమించుకుంటోందని దుయ్యబట్టారు. కార్మిక చట్టాలను వెంటనే ఉపసంహరించుకోకపోతే, చారిత్రాత్మక రైతుల పోరాటం వంటి పరిస్థితి తలెత్తుతుందని హెచ్చరించారు. కార్మికులు పెద్ద ఆందోళనకు సిద్ధమవుతున్నారని, పార్లమెంటులో ప్రతిపక్ష ఎంపిలు కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా ఆందోళన చేపట్టారని తెలిపారు. కార్మికులు ఐక్య ఆందోళన వైపు కదులుతున్నారని గ్రహించి, కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లను ఉపసంహరించుకోవాలని జాన్ బ్రిట్టాస్ కోరారు. ఆయన డిమాండ్‌కు వామపక్ష ఎంపిలు మద్దతిచ్చారు.

సొసైటీలలో 'నానో' తప్పనిసరి!

(మొదటిపేజీ తరువాయి)

ఆందోళన చెంది రోడ్డెక్కారు. సమస్య పరిష్కారం కావాలంటే రాష్ట్రానికి వచ్చిన ఎరువులో 70 శాతం కాకుండా గతంలోమాదిరి 50 శాతానికి సర్కార్ కోటా తగ్గించుకోవాలని కంపెనీలు, డీలర్లు చేసిన డిమాండ్ కు ప్రభుత్వం అంగీకరించింది. అంతేకాకుండా సొసైటీలలోనూ మామూలు ఎరువులకు నానో లింక్ పెట్టి తమ వ్యాపారం నష్టపోకుండా బ్యాలెన్స్ చేయాలన్న ప్రతిపాదనకు ప్రభుత్వం సూచనాప్రాయంగా ఓకే చెప్పినట్లు తెలిసింది.

3:1 నిష్పత్తి

ఇప్పటి వరకు సొసైటీలలో కొద్ది మొత్తంలో నానో ఎరువులు అమ్మినా రైతుల ఇష్టాఇష్టాలకు వదిలేశారు. ఇక నుంచి సంప్రదాయ యూరియా, డిఎపి కావాలంటే నానో ఎరువులు కొనాల్సిందే. యూరియాను తగ్గించేందుకు కేంద్రం 3 యూరియా బస్తాలకు ఒక నానో యూరియా బాటిల్ అమ్మాలని నిర్దేశించింది. ఆ తరహాలో సొసైటీలలో 3:1 నిష్పత్తిలో రైతులకు నానో ఎరువులను అంటగట్టాలని రాష్ట్ర సర్కార్ యోచిస్తోంది. ఖరీఫ్, రబీ కలుపుకొని 2025-26లో 2.6 లక్షల యూరియా (500 మి.లీ.) బాటిళ్లు, లక్ష వరకు డిఎపి బాటిళ్లు మార్కెట్ చేయాలన్నది కేంద్రం టార్గెట్. ఆ టార్గెట్‌ను చేరేందుకు ఈ రబీ నుంచి సొసైటీల్లో రైతులకు నానో ఎరువులను బలవంతంగా అంటగట్టడానికి ఎపి ప్రభుత్వం ప్రయత్నిస్తోంది.

విద్యలో ఆంధ్రప్రదేశ్ రోల్ మోడల్

(మొదటిపేజీ తరువాయి)

చదివితే పిల్లలు మేధావులు కారని, ఆటలాడుతూ, పాటలు పాడుతూ చదువుకోవాలని సూచించారు. రాష్ట్రంలో తలసరి ఆదాయంలో మన్యం జిల్లా వెనుకబడిందన్నారు.

మూడేళ్లల్లో ఆంధ్ర స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ : మంత్రి లోకేష్

మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. వచ్చే మూడేళ్లలో రాష్ట్రంలో ఆంధ్ర స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ తీసుకువస్తామని చెప్పారు. భామిని ఎపి మోడల్ స్కూల్ విద్యార్థుల నాలెడ్జి అద్భుతంగా ఉందని, పిల్లలను సానబెడితే అద్భుతాలు సాధిస్తారని అన్నారు. విద్యార్థుల బలాబలాలు తెలుసుకునేందుకు స్కై, మౌంటెన్, స్టీమ్ అనే మూడు వర్గాలుగా వర్గీకరించామని, విద్యార్థులు మరింత ఆసక్తిగా చదువుకునేందుకు క్లిక్కర్ విధానం సాయం చేస్తోందని తెలిపారు. అంతకుముందు పాఠశాలలో స్పోర్ట్స్ రూమ్, స్కిల్ ల్యాబ్‌లను వారు పరిశీలించారు. విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనం చేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

శరణార్థులకు షాక్

- వర్క్ పర్మిట్లపై అమెరికా కీలక నిర్ణయం

వాషింగ్టన్: వలసదారులపై కఠిన విధానాలు అమలుచేస్తోన్న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం తాజాగా మరో సంచలన నిర్ణయం తీసుకుంది. శరణార్థులకు ఇచ్చే వర్క్ పర్మిట్ల కాలవ్యవధిని కుదిస్తున్నట్టు యుఎస్ సిటిజన్‌షిప్, ఇమిగ్రేషన్ సర్వీసెస్ (యుఎస్‌సిఐఎస్) ఓ ప్రకటనలో తెలిపింది. శరణార్థులు, ఆశ్రయం పొందాలనుకునే వారు, గ్రీన్‌కార్డు కోసం ఎదురుచూస్తున్నవారు అమెరికాలో ఉద్యోగం చేసుకునేందుకు ఎంప్లాయిమెంట్ ఆథరైజేషన్ కార్డ్ (ఇఎడి) కింద అనుమతులు జారీ చేస్తారు. దీనికి వున్న ఐదేళ్ల కాలవ్యవధిని 18 నెలలకు కుదించారు. ఇటీవల అధ్యక్ష భవనానికి సమీపంలో ఇద్దరు నేషనల్ గార్డులపై ఓ దుండగుడు కాల్పులు జరిపిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో దేశంలోకి వలస వచ్చేవారిపై కఠిన సమీక్షలు అవసరమని చెబుతున్న ట్రంప్ పరిపాలనా యంత్రాంగం.. తాజాగా వర్క్ పర్మిట్ల కాలవ్యవధిపై నిర్ణయం తీసుకున్నట్లుగా తెలుస్తోంది.

ఏంటీ ఇఎడి?

ఎంప్లాయిమెంట్ ఆథరైజేషన్ డాక్యుమెంట్ (ఇఎడి) అనేది ఓ వ్యక్తికి నిర్దిష్ట కాలవ్యవధి వరకు అమెరికాలో పనిచేసేందుకు అధికారం ఉందని నిరూపించే పత్రం. ఇది ఉంటేనే వలసదారులు అమెరికాలో ఉద్యోగం చేసుకునేందుకు అనుమతులు లభిస్తాయి. గ్రీన్‌కార్డు పెండింగ్‌లో ఉన్నవారు, వారి జీవిత భాగస్వాములు, పిల్లలు, ఎఫ్-1, ఎం-1 వీసాలపై వచ్చే విద్యార్థులు, డిపెండెంట్ వీసాలపై వచ్చేవారు

గాజాపై దాడికి 34 బిలియన్ డాలర్ల బడ్జెట్

- ఇజ్రాయిల్ బరితెగింపు

గాజా : అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మధ్యవర్తిత్వంతో ఇజ్రాయిల్ కాల్పుల విరమణకు ఒప్పందం చేసుకున్నా గాజాపై దాడులను కొనసాగిస్తోంది. గత సైనిక బడ్జెట్‌లో 27 బిలియన్ డాలర్లు కేటాయిస్తే, తాజా బడ్జెట్‌లో 34 బిలియన్ డాలర్లకు పెంచింది. వచ్చే ఏడాది దేశ బడ్జెట్‌ను 112 బిలియన్ల షెకెల్స్ (34 బిలియన్స్ డాలర్లు) కేటాయించిందని ఆ దేశ రక్షణ మంత్రి కార్యాలయం శుక్రవారం తెలిపింది. 2023 నుండి ఇప్పటి వరకూ దాదాపు 70 వేలకు పైగా పాలస్తీనియన్లు ఇజ్రాయిల్ దాడుల్లో మరణించిన సంగతి తెలిసిందే. ఇరు దేశాల మధ్య శాంతి ఒప్పందం చేశానని. ప్రపంచవ్యాప్తంగా 8 యుద్ధాలను ఆపానని, ప్రతీ యుద్ధానికి తనకు నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాలని పదే పదే ప్రకటిస్తున్న ట్రంప్ ఇజ్రాయిల్ కాల్పులవిరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తున్నా స్పందించడంలేదు.. భవిష్యత్తులో కూడా గాజాపై దాడుల్ని కొనసాగించడానికి సైనిక బడ్జెట్‌ను పెంచినట్లు బహిరంగంగానే ఆ దేశ నేతలు వ్యాఖ్యానిస్తున్నారు. గాజాలోని దక్షిణ నగరమైన ఖాన్ యూనిస్ తూర్పు, ఈశాన్య ప్రాంతాలపై ఇజ్రాయిల్ దాడులు చేస్తుంది. వెస్ట్ బ్యాంక్‌లోని నాబ్లస్ ప్రాంతంలో ఇజ్రాయిల్ సైనికులు రైతు రషీద్ (38)ని హత్య చేశారని పాలస్తీనా ఆరోగ్య మంత్రిత్వ శాఖ శుక్రవారం ప్రకటించింది.

కరేబియన్ తీరంలో అమెరికా దాడి

- నలుగురు మృతి
- ఖండించిన వెనిజులా

అట్లాంటిక్ సముద్రంలో అమెరికా జెరాల్డ్ యుద్ధ నౌక, విమానాలు

వాషింగ్టన్ : వెనిజులా లక్ష్యంగా అమెరికా కరేబియన్ సముద్రతీర ప్రాంతంలో దాడులను కొనసాగిస్తుంది.. మాదకద్రవ్యాలు అక్రమ రవాణా చేస్తున్నదన్న నెపంతో ఒక పడవపై అమెరికా వైమానికి దాడి చేసింది. ఈ దాడిలో నలుగురు మృతి చెందారని పెంటగాన్ వెల్లడించింది.. ఉగ్రవాదసంస్థ అంతర్జాతీయ జలాల్లో డ్రగ్స్ అక్రమ రవాణా చేస్తున్న పడవపై దాడి చేశామని యూఎస్ రక్షణ శాఖ కార్యదర్శి పీట్ హెగ్సేట్ ఎక్స్‌లో తెలిపారు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వెనిజులా గగనతలాన్ని మూసేసిన అనంతరం ఈ దాడి జరగటం గమనార్హం. ట్రంప్ ప్రభుత్వంపై వెనిజులాపై దాడుల నేపథ్యంలో అమెరికన్లు తీవ్రంగా విమర్శిస్తున్నారు. రక్షణశాఖ ఆదేశాల మేరకే ఈ దాడులు జరిగాయని యూఎస్ సదరన్ కమాండ్ ధృవీకరించింది.

కాగా యూఎస్ జరుపుతున్న వరుస దాడులపై అంతర్జాతీయ సమాజం నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నా అమెరికా ఖాతరు చేయడంలేదు. ఇటీవల మదురోతో ఫోన్‌లో మాట్లాడానని స్వయంగా ట్రంప్ వెల్లడించారు. అయితే ఏం మాట్లాడానో చెప్పనని మీడియా ఎదుట వాపోయారు. అనంతరం వెనిజులా తీరాలకు సమీపంలో అమెరికా భారీ సైనిక వనరులను మోహరించటం వేగవంతం చేసింది. త్వరలో మిలిటరీ దాడులు జరిగే అవకాశం ఉన్నదని పలువురు హెచ్చరిస్తున్నారు. అయితే వెనిజులా మాత్రం అమెరికా చర్యలను ఖండించింది. ధీటుగా సమాధానమిస్తున్నది. అమెరికా చర్యలు తమ ప్రభుత్వాన్ని కూల్చివేయడానికి చేస్తున్న ప్రయత్నాలను సాగనీయమని వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురో ప్రకటించారు.

ఎక్స్‌పై రూ.12 వేల కోట్ల జరిమానా

- యూరోపియన్ కమిషన్ నిర్ణయం

బ్రస్సెల్స్ : ప్రపంచ బిలియనీర్ ఎలాన్ మస్క్‌కు చెందిన సోషల్ మీడియా ఫ్లాట్‌ఫామ్ ఎక్స్ (గతంలో ట్విట్టర్)కు యూరోపియన్ కమిషన్ 120 మిలియన్ల యూరోలు (దాదాపు 12 వేల కోట్ల రూపాయలకు పైగా) జరిమానా విధించింది. సుమారు రెండేళ్ల విచారణ తరువాత మొదటిసారిగా డిజిటల్ సర్వీసెస్ యాక్ట్ (డిసిఎ) కింద ఈ జరిమానా విధించింది. ఎక్స్ ఖాతాల టిక్ మార్కులు, ప్రకటనల విధానంలో యూరోపియన్ యూనియన్ చట్టాలను గౌరవించలేదని కమిషన్ పేర్కొంది. ఈ ఫ్లాట్‌ఫామ్‌లో గతంలో అధికారిక ఖాతాలను సూచించడానికి నీలిరంగు చెక్‌మార్క్‌ను ఉచితంగా ఉపయోగించేవారు. ఇప్పుడు నెలకు 7 యూరోలను వసూలు చేస్తున్నా, ఈ బ్లూటిక్ గుర్తింపు కచ్చితత్వం వినియోగదారులను గందరగోళానికి గురిచేస్తుందని కమిషన్ విమర్శించింది. ఇయు డిఎస్ఎ నియమాలను ఉల్లంఘించినందుకు జరిమానా విధిస్తున్నట్లు కమిషన్ స్పష్టం చేసింది. తన ప్లాట్‌ఫామ్‌లో ప్రకటనలకు సంబంధించి పారదర్శకత, సరైన బాధ్యతలను ఎక్స్ పాటించలేదని కమిషన్ గుర్తించింది. ఆర్థిక మోసాలకు దారితీసే ప్రకటనలు, కంటెంట్‌కు సంబంధించిన ప్రకటనల మధ్య వ్యత్యాసం గుర్తించడం అసాధ్యంగా ఉందని కమిషన్ పేర్కొంది. ప్రకటనదారుల గుర్తింపును వినియోగదారులు, అధికారులు యాక్సెస్ చేయలేరని కమిషన్ తెలిపింది. కొన్ని ప్రకటనలు నిర్దిష్ట వినియోగదారులను లక్ష్యంగా చేసుకోవడానికి గల కారణాన్ని ఎక్స్ వివరించలేకపోయిందని కమిషన్ తెలిపింది. బ్లూటిక్ చెక్‌మార్క్ ఉల్లంఘనలకు 45 మిలియన్ల యూరో, డేటా యాక్సెస్ ఉల్లంఘనకు 40 మిలియన్ల యూరోలు, ప్రకటనదారుల గుర్తింపునకు యాక్సెస్ లేకపోవడానికి సంబంధించి 35 మిలియన్ల యూరోలు జరిమానా విధించినట్లు కమిషన్ అధికారి ఒకరు వెల్లడించారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఆపిల్‌కు 500 మిలియన్ల యూరోలు, మెటాకు 500 మిలియన్ల యూరోల జరిమానాను యూరోపియన్ కమిషన్ విధించిన సంగతి తెలిసిందే. చట్టవిరుద్ధమైన కంటెంట్‌ను ఎక్స్ ఉపయోగించడం సహా రెండు ఆరోపణలు యూరోపియన్ కమిషన్ వద్ద విచారణ దశలో ఉన్నాయి.

పాన్ మసాలాపై కొత్త సెస్

- బిల్లుకు లోక్‌సభ ఆమోదం

పార్లమెంట్‌లో మాట్లాడుతున్న నిర్మలా సీతారామన్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పాన్ మసాలా తయారీ యూనిట్లపై సెస్ విధించేందుకు ఉద్దేశించిన బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. హెల్త్ సెక్యూరిటీ సే నేషనల్ సెక్యూరిటీ సెస్ బిల్లుపై లోక్‌సభలో శుక్రవారం చర్చ జరిగింది. ఈ సందర్భంగా కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ.. ఈ సెస్ ద్వారా సమకూరిన నిధులను జాతీయ భద్రత, ప్రజారోగ్యానికి వినియోగిస్తామన్నారు. అలాగే ఆ నిధులను రాష్ట్రాలకు ఇస్తామని తెలిపారు. పాన్ మసాలా, ఈ తరహా ఉత్పత్తులను తయారుచేసే యూనిట్లకు సెస్ విధిస్తామన్నారు. ప్రస్తుతం పాన్ మసాలాపై జిఎస్‌టిలో గరిష్ట శ్లాబు 40 శాతం విధిస్తున్నట్లు తెలిపారు. సెస్ వల్ల జిఎస్‌టి రెవెన్యూపై ఎలాంటి ప్రభావం ఉండదన్నారు.

తయారీ సామర్థ్యం ఆధారంగా ఈ సెస్ విధించనున్నట్లు తెలిపారు. 2010-2014 మధ్య సెస్ రూపంలో ప్రభుత్వానికి వచ్చే ఆదాయం 7 శాతంగా ఉండగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆ మొత్తం 6.1 శాతానికి తగ్గిందని పేర్కొన్నారు. అనంతరం ఈ బిల్లును మూజువాణి ఓటుతో లోక్‌సభ ఆమోదించింది.

మత విద్వేషాలను రెచ్చగొడుతున్న బిజెపి : లోక్‌సభలో డిఎంకె ఆందోళన

తమిళనాడులోని మధురైలో ఉన్న తిరుప్పరంకుండ్రం కొండపై కార్తీక దీపాన్ని వెలిగించే అంశంపై లోక్‌సభలో దుమారం చెలరేగింది. తిరుప్పరంకుండ్రం కొండపై వెలిగించే కార్తీక దీపం అంశాన్ని లేవనెత్తుతూ డిఎంకె ఎంపిలు లోక్‌సభ వెల్‌లోకి దూసుకెళ్లారు. గందరగోళం నెలకొనడంతో ప్రశ్నోత్తరాల సమయాన్ని వాయిదా వేశారు. ఇదే అంశాన్ని మళ్లీ జీరో అవర్‌లో లేవనెత్తారు. సుబ్రమణ్యస్వామి ఆలయ శిఖరంపై ప్రతి ఏడాది తరహాలో కార్తీక దీపాన్ని వెలిగించేందుకు వెళ్లిన యాత్రికులను ఎందుకు అడ్డుకున్నారని బిజెపి ప్రశ్నించింది. తమిళనాడులో బిజెపి మత విద్వేషాలు రెచ్చగొడుతుందని డిఎంకె లోక్‌సభ పక్షనేత టిఆర్ బాలు విమర్శించారు. కొండపై దీపాన్ని ఎవరు వెలిగించాలి, హిందూ దేవాదాయశాఖ బోర్డు సభ్యులా లేక హైకోర్టు జడ్జి తీర్పును పట్టుకుని తిరుగుతున్నవాళ్లా? అని టిఆర్ బాలు అడిగారు.

ఆ ఆరోపణలను కేంద్ర మంత్రి ఎల్ మురుగన్ కొట్టిపారేశారు. ఆరాధించే హక్కును తమిళనాడు సర్కారు నొక్కిపెడుతోందన్నారు. జడ్జి ఐడియాలజీతో తీర్పు ఇచ్చినట్లు ఆయన వ్యాఖ్య చేయడాన్ని కేంద్ర మంత్రి మురుగన్ తప్పుబట్టారు. పూజా హక్కును తమిళనాడు ప్రభుత్వం అణచివేసిందని మంత్రి ఆరోపించారు.

నమ్మొద్దు నమ్మొద్దు

చింత చెట్టు మీద ఉయ్యాలో
చిలుకోటి కూసుంది ఉయ్యాలో
రామ రామ అంటూ ఉయ్యాలో
నామమే పలికింది ఉయ్యాలో

అడవిలో ఓ నక్క ఉయ్యాలో
ఆకలే గైకొంది ఉయ్యాలో
అటు ఇటు తిరిగింది ఉయ్యాలో
చిలుకనే చూసింది ఉయ్యాలో
ముసి ముసి నవ్వింది ఉయ్యాలో

ఓ చిలక నా చిలక ఉయ్యాలో
కండ్లు కలిమే పండ్లు ఉయ్యాలో
ముక్కు దొండా పండు ఉయ్యాలో
అనుకుంటూ ఆ నక్క ఉయ్యాలో
దగ్గరికి చేరింది ఉయ్యాలో
రాగాలే పలికింది ఉయ్యాలో

వయ్యారి ఓ చిలుక ఉయ్యాలో
నీ రూపు బాగుంది ఉయ్యాలో
కళ్ళు మూసుకుని ఉయ్యాలో
రామ జపం చేస్తే ఉయ్యాలో
ఎంత బాగుంటవో ఉయ్యాలో
టక్కరి మాటలతో ఉయ్యాలో
ఆ నక్క పలికింది ఉయ్యాలో

నక్క మాటలు నమ్మి ఉయ్యాలో
చిన్నారి ఆ చిలుక ఉయ్యాలో
కన్నులే మూసింది ఉయ్యాలో

అదను కోసం చూసి ఉయ్యాలో
ఆ నక్క ఎంటనే ఉయ్యాలో
ఎగిరి గంతేసింది ఉయ్యాలో
చిలుకనే పట్టింది ఉయ్యాలో

నక్క బావ నక్క బావ ఉయ్యాలో
ఇప్పుడే సంపొద్దు ఉయ్యాలో
గజగజ వణుకుతూ ఉయ్యాలో
నా చిన్న కోరిక ఉయ్యాలో
తీర్చమని కోరింది ఉయ్యాలో
ఆ చిట్టి చిలుక ఉయ్యాలో
దీనంగా అడిగింది ఉయ్యాలో

ఏంటో నీ కోరిక ఉయ్యాలో
తప్పించుకుందమని ఉయ్యాలో
తెలుసులే నీ మెలిక ఉయ్యాలో
నమ్మను నమ్మను ఉయ్యాలో
జిత్తుల మారి ఆనక్క ఉయ్యాలో
కోపంగా చూసింది ఉయ్యాలో

ఓ నక్క మా నక్క ఉయ్యాలో
కోపంగ సూడొద్దు ఉయ్యాలో
కొంచమైనా నీవు ఉయ్యాలో
నోరు విప్పి సూడు ఉయ్యాలో
వినయంగా పలికింది ఉయ్యాలో
చిన్నారి ఆ చిలుక ఉయ్యాలో

చిలుక మాటలు విన్న ఉయ్యాలో
టక్కరి ఆ నక్క ఉయ్యాలో
చిర్రెత్తి పోయింది ఉయ్యాలో
ఉరిమి ఉరిమి చూసింది
ఉయ్యాలో
నోరునే తెరిచింది ఉయ్యాలో
గట్టిగా అరిచింది ఉయ్యాలో

ఆకు పచ్చని చిలుక ఉయ్యాలో
ఎంటనే ఎగిరింది ఉయ్యాలో
నక్క మాటలు నమ్మి ఉయ్యాలో
మోసనే పోవొద్దు ఉయ్యాలో
ఎవరు చెప్పిన గాని ఉయ్యాలో
ఎమ్మటే నమ్మొద్దు ఉయ్యాలో
మంచి చెడు ఏదో ఉయ్యాలో
ఆలోచించాలి ఉయ్యాలో
అనుకుంటు ఆ చిలుక ఉయ్యాలో
తుర్రుమని ఎగిరింది ఉయ్యాలో

– కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి,
94415 61655.



దారి చూపండి

పిల్లలూ, బయట ఉన్న రాజు లోపల ఉన్న రాణిని కలుసుకోవాలి. దారి చూపించండి.

నేను గీసిన బొమ్మ

పి. ధనుంజయ్ రాజు,
6వ తరగతి,
ఎ.పి.మోడల్ స్కూలు,
వి.పి.రెడ్డిపాలెం,
పల్నాడు జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

వద్దురా, సోదరా.. మత్తులో పడొద్దురా...!

సరదాగా ఉండటం మంచిదే. ఆ పేరుతో డ్రగ్స్ ఉచ్చులో పడితే అమాంతం విష వలయంలోకి చిక్కినట్లే. పదేళ్ల బాల బాలికల నుంచి 25 ఏళ్ల యువతీ యువకుల వరకూ మహమ్మారి డ్రగ్స్ భూతం కబళిస్తోంది. తిరుపతిలో ఎనిమిదో తరగతి చదివే ఓ విద్యార్థి తూలుతూ స్కూలుకు వచ్చాడు. అదే ప్రాంతానికి చెందిన ఓ బాలిక కళ్లు ఎర్రగా మారాయి. తీరా బ్యాగ్ చెక్‌చేస్తే గంజాయి ప్యాకెట్ ఉంది. ఇది మచ్చుకు ఒక సంఘటన మాత్రమే! ఇలాంటి సంఘటనలు రాష్ట్రంలోని చాలా చోట్ల కనిపిస్తున్నాయి. కొంతమంది టీనేజర్లు మద్యం, సిగరెట్లు, గంజాయి, కొకైన్ వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్నారు.

వీధి చివర బంకుల్లో మత్తు చాక్లెట్లు.. కాలేజీ క్యాంపస్‌లో గంజాయి పొగలు...లిక్విడ్ డ్రగ్స్ ... బుద్ధిగా చదువుకోవాల్సిన టీనేజీ పిల్లల్ని మత్తులోకి లాగేస్తున్నాయి. చిన్న వయస్సులోనే విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటుపడి చదువును పాడు చేసుకుంటున్నారు. ఉత్సాహంతో ఉరకలెత్తాల్సిన యువ జవసత్వాలు సన్నగిల్లి యవ్వనంలోనే శారీరకంగా, మానసికంగా నిర్వీర్యమైపోతున్నారు. సరదా షికార్లు, స్లీప్ ఓవర్‌ల సమయంలో సరదా కొద్దీ సీనియర్లో, స్నేహితులో డ్రగ్స్ ఇస్తుంటారు. ఇవి తీసుకున్నాక ఇంకా ఎన్ని రకాల డ్రగ్స్ ఉన్నాయో వెతుకులాట సాగిస్తారు. అంతటితో వారి చదువు, ఆరోగ్యం, ఏకాగ్రత, వ్యక్తిత్వం మొత్తం ధ్వంసమైపోతాయి. తల్లిదండ్రులు మందలిస్తే 'మీరిలా తిడితే ఇల్లు విడిచివెళ్లిపోతాం' అంటూ బ్లాక్‌మెయిల్ కూడా చేస్తుంటారు. టీనేజ్ పిల్లలు డ్రగ్స్ వైపు మొగ్గు చూపటంలో ప్రధానంగా నెగెటివ్ కుటుంబ వాతావరణం కూడా ఒక ముఖ్య కారణమని మానసిక నిపుణులు అంటున్నారు.. తల్లిదండ్రులు ఘర్షణతో ఉన్నా, పిల్లలతో మంచి అనుబంధం ఏర్పర్చుకోకపోయినా, ఆత్మీయంగా వారితో సమయం గడపకపోయినా 'మనం పట్టని తల్లిదండ్రుల' కంటే 'మనకు కిక్ ఇచ్చే డ్రగ్స్ మేలు' అనే భావనలో భ్రష్ట సాంగత్యాల్లోకి పిల్లలు వెళ తుంటారు.

విష వలయంలోకి బాల్యం

తరగతి గదిలోనే దేశ భవిత తయారవుతుందని నమ్ముతున్నాం. అలాంటి విద్యాలయాల పరిసరాల్లో గంజాయి మహమ్మారి మకాం వేయటం ప్రమాదకరంగా మారింది. కొందరు పిల్లలు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు దీని వినియోగానికి పాల్పడుతున్న సంఘటనలు అనేకం వెలుగు చూస్తున్నాయి. ఇంకా ఎలాంటి దుష్పరిణామాలు వస్తాయోనని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మథనపడుతున్నారు. మాదక ద్రవ్యాలైన మద్యం, సిగరెట్లు, గంజాయి, కొకైన్ వంటి మత్తు పదార్థాలకు విద్యార్థులతోపాటుగా యువత అలవా టు పడుతున్నారు. తద్వారా తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు. ఆ మత్తులో చెడుమార్గంలో పయనిస్తూ కుటుంబానికి, అటు సభ్య సమాజానికి తీవ్ర నష్టం చేకూరుస్తున్నారు.

దశాబ్దాలుగా ఇదే తంతు

పాఠశాల స్థాయిల్లో గంజాయి సహా పలు రకాల మత్తు పదార్థాలకు బానిసలైన విద్యార్థులు వేలల్లో ఉంటున్నారు. విద్యాసంస్థలే లక్ష్యంగా కొన్ని ముఠాలు విచ్చలవిడిగా గంజాయి విక్రయాలు కొనసాగించటం దీనికి కారణం. కొంతమంది విద్యార్థులకు డబ్బు ఆశ చూపి దళారులు వారితోనే విక్రయాలు జరిపించే పరిస్థితి నెలకొంది. రాష్ట్రంలోని పలు ఇంజనీరింగ్, డిగ్రీ కళాశాలల్లో విస్తృతంగా గంజాయి వినియోగం పెరిగిపోయింది. తెలిసి ఉపాధ్యాయులు, అధ్యాపకులు ప్రశ్నిస్తే ఆయా విద్యార్థులు వారిపైనే దాడులకు సైతం దిగుతున్న ఉదంతాలు ఉంటున్నాయి.

మత్తుకోసం మరోలా...

గంజాయికి అలవాటుపడ్డ విద్యార్థులు, యువత అది దొరక్కపోతే ఇతర మార్గాలను వెతుక్కుంటున్నారు. రంగుల్లో వినియోగించే టన్నర్ (థిన్నర్), వైట్నర్, గమ్‌ట్యూబ్స్, గోళ్ల రంగులు లాంటివి మత్తు కోసం వినియోగి స్తున్నారు. ఈ రసాయన మిళితమైన పదార్థాలను, పాలిథీన్ కవర్లు, గొట్టాల్లో వేసి పీలుస్తూ మత్తులో జోగుతున్నారు. కొన్ని పాఠశాలల్లో ఎనిమిదో తరగతి నుంచి పది వరకూ విద్యార్థులు మత్తు కోరల్లో చిక్కుకుంటున్నారు. ఉపాధ్యాయులకు అనుమానం వచ్చి వెతుకుతుండగా విద్యార్థుల బాగుల్లోనూ ఈ మత్తు నిచ్చే పదార్థాలు దొరికిన సంఘటనలు ఉన్నాయి. బయటకు తెలిస్తే తమకు చెడ్డ పేరు అనే భావనతో వాళ్లు గోప్యంగా ఉంచుతున్నారు. గతంలో కొన్ని జిల్లాల పరిధిలోని పాఠశాలల్లో చదువుతున్న వందలాది మంది విద్యార్థులు గంజాయికి బానిసైనట్లు ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కమిటీలు, గ్రామ ప్రతినిధులు కలిసి గుర్తించారు. వీరి పేర్లు, చదువుతున్న తరగతి, ఎదురైన అనుభవాలను వివరిస్తూ విద్యాశాఖాధికారులకు సైతం అప్పట్లో సమాచారాన్ని తెలియజేశారు. అయినా ఫలితం రాలేదు. ప్రస్తుతం మరింత విస్తృతంగా ఈ మత్తు పదార్థాల వినియోగం పెరిగింది.

పెనుప్రమాదం

మత్తు పదార్థాలు ఎంతటి వారినైనా నాశనం చేస్తాయి. మత్తుకు అలవాటు పడిన వారు భవిష్యత్తుతోపాటు కుటుంబాలకు, సమాజానికి నష్టం చేకూర్చుతున్నారు. గంజాయి పీల్చి డ్రైవింగ్ చేస్తే, వారికే కాక ఇతరులకూ ప్రమాదం. వారి చేష్టలను ఎదిరించే వారిపై దాడిచేయటం, చంపేయటం వంటివి చేస్తుండటం చూస్తూనే ఉన్నాం. అందుకే ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలి. పిల్లల నడవడిక, వారి అలవాట్లు, స్నేహాలు, చదువు మొదలైన వాటిని దగ్గరుండి పర్యవేక్షించాలి.

రాజధానిలోనూ ...

రాజధాని కేంద్రమైన అమరావతి, విజయవాడ, గుంటూరు ప్రాంతాల్లో గంజాయి ముఠాలు స్వైర విహారం చేస్తున్నాయి. విజయవాడలోని సింగ్‌నగర్, గాంధీనగర్, కృష్ణలంక, భవానీపురం ప్రాంతాల్లో బహిరంగంగానే గంజాయిలో జోగుతూ ఊగుతూ రోడ్లపై స్వైర విహారం చేసే వారూ, రోడ్ల వెంబడి పడుకుని ఉండేవారు కనిపిస్తున్నారు. గంజాయి సాగు నుంచి విక్రయం వరకూ పెద్దఎత్తున అంతర్‌రాష్ట్ర ముఠాలు ఇందులో పనిచేస్తున్నాయి. ఆంధ్రా–ఒరిస్సా సరిహద్దుల నుంచి ఈ గంజాయి అక్కడి నుంచి అనేక ప్రాంతాలకు తరలించటంలో అనేక ముఠాలు పనిచేస్తున్నాయి. అడపా దడపా కొన్ని చోట్ల కేసులు పట్టుబడుతున్నా దొరక్కకుండా సునాయాసంగా వెళ్లిపోతున్న ఉదంతాలు కూడా అనేకం ఉంటున్నాయి.

మత్తు వ్యక్తికే కాదు; వ్యవస్థకూ పెను ప్రమాదం. ఇంటా బయటా ప్రతి ఒక్కరూ మత్తు పదార్థాల అమ్మకాలను, వినియోగాన్ని తీవ్రంగా భావించాలి. విద్యార్థులను, యువకులను మాదకద్రవ్యాల బారి నుంచి కాపాడుకోవాలి. అలాంటి అవగాహనను, అప్రమత్తతను పెంచటానికి ప్రభుత్వం వివిధ ప్రచార కార్యక్రమాలు చేపట్టాలి. మత్తులో కూరుకుంటే జీవితమంతా చిత్తవుతుందనే ఎరుకను అందరిలోనూ కలిగించాలి. •

సెమీస్‌కు భారత్

- షూటౌట్‌లో బెల్జియంపై 4–3గోల్స్‌తో గెలుపు
- ప్రపంచకప్ జూనియర్ హాకీ

చెన్నై: ప్రపంచకప్ జూనియర్ హాకీ సెమీఫైనల్లోకి భారతజట్టు దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో భారతజట్టు పెనాల్టీ షూటౌట్‌లో 4–3గోల్స్ తేడాతో పటిష్ట బెల్జియంను చిత్తుచేసింది. నిర్ణీత నాలుగు క్వార్టర్‌లు ముగిసే సరికి ఇరుజట్లు 2–2గోల్స్‌తో సమంగా నిలిచాయి. పెనాల్టీ షూటౌట్‌లో భారత్ తరఫున తొలి ఐదు షూటౌట్‌లు ముగిసేసరికి ఇరుజట్లు 3–3గోల్స్‌తో సమంగా నిలిచాయి. షూట్ ఆఫ్‌లో భారత్ జట్టు ఒక గోల్ చేయగా.. బెల్జియం గోల్ చేయడంలో విఫలమైంది. ఇక మ్యాచ్ ప్రారంభమైన 13వ నిమిషంలోనే బెల్జియం ఆటగాడు కార్నేజ్ ఫీల్డ్ గోల్ కొట్టి బెల్జియంను 1–0 ఆధిక్యతలో నిలిపాడు. రెండో క్వార్టర్‌లో ఇరుజట్లు గోల్ చేయలేదు. దీంతో తొలి అర్ధభాగం ముగిసేసరికి బెల్జియం జట్టు 1–0 ఆధిక్యతలో నిలిచింది. కానీ మూడో క్వార్టర్‌లో చివర్లో 45వ నిమిషంలో కెప్టెన్ రోహిత్ పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలిచాడు. దీంతో 1–1తో సమం కావడంతో భారత అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు. ఇక నాల్గో, చివరి క్వార్టర్ ప్రారంభమైన 48వ నిమిషంలో తివారి శ్రద్ధానంద ఒక గోల్ చేయడంలో భారతజట్టు 2–1 ఆధిక్యతలోకి దూసుకెళ్లింది. మరో నిమిషంలో మ్యాచ్ ముగుస్తుందనగా బెల్జియం తరఫున రోగే నాథన్ మరో ఫీల్ గోల్ చేయడంతో ఇరుజట్లు 2–2గోల్స్‌తో సమంగా నిలిచాయి. ఆదివారం జరిగే సెమీస్‌లో భారతజట్టు అర్జెంటీనాతో తలపడనుంది.

జర్మనీ, స్పెయిన్ కూడా...

ఎఫ్‌ఐహెచ్ ప్రపంచకప్ జూనియర్ హాకీ సెమీఫైనల్లోకి జర్మనీ, స్పెయిన్ జట్లు దూసుకెళ్లాయి. శుక్రవారం జరిగిన తొలి క్వార్టర్‌ఫైనల్లో స్పెయిన్ జట్టు 4–3గోల్స్ తేడాతో న్యూజిలాండ్‌ను చిత్తుచేయగా.. జర్మనీ జట్టు పెనాల్టీ షూటౌట్‌లో 3–1గోల్స్ తేడాతో ఫ్రాన్స్‌పై విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో ఇరుజట్లు నిర్ణీత సమయం ముగిసేసరికి 2–2గోల్స్‌తో సమంగా నిలిచాయి. ఇక హోరాహోరీగా సాగిన మూడో క్వార్టర్‌ఫైనల్లో అర్జెంటీనా జట్టు చివరి క్వార్టర్‌లో గోల్ కొట్టి సెమీస్‌కు చేరింది. ఉత్కంఠ భరితంగా సాగిన ఈ మ్యాచ్‌లో అర్జెంటీనా 1–0తో నెదర్లాండ్స్‌పై విజయం సాధించింది. అర్జెంటీనా తరఫున ఏకైక గోల్‌ను కెప్టెన్ రూస్ టోమస్ 52వ ని.లో. పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలిచాడు.

సెమీఫైనల్స్...
భారత్ × జర్మనీ
స్పెయిన్ × అర్జెంటీనా

కోహ్లి హ్యాట్రిక్ సెంచరీ సాధించేనా..?

- నేడు విశాఖలో భారత్, దక్షిణాఫ్రికా జట్ల మధ్య మూడో, చివరి వన్డే
- మధ్యాహ్నం 1.30గం॥లకు

విశాఖపట్నం: టీమిండియా రన్ మెషీన్ విరాట్ కోహ్లి హ్యాట్రిక్ సెంచరీపై కన్నేశాడు. రాంచీ, రాయ్‌పూర్‌లో జరిగిన వన్డేల్లో శతకాలు బాదిన కోహ్లి.. విశాఖలో జరిగే మూడో వన్డేలోనూ శతకం బాదితే 2018తర్వాత మరోసారి ఈ ఫీట్‌ను అందుకోనున్నాడు. నిర్ణయాత్మక మూడో వన్డేలో గెలిచిన జట్టుకు వన్డే సిరీస్ దక్కనున్న క్రమంలో విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ క్రీజ్‌లో నిలదొక్కుకుంటే పరుగుల వరద పారడం ఖాయం. విశాఖపట్నంలోని ఎసిఎ–విడిసిఎ మైదానంలో శనివారం కీలక మూడో వన్డే మ్యాచ్ జరగనుంది. ఈ మైదానం బ్యాటర్లకు అనుకూలం. దీంతో పరుగుల వరద పారడం ఖాయం. ఈ మ్యాచ్‌కు సంబంధించిన టికెట్లన్నీ హాట్‌కేకుల్లా అమ్ముడైనట్లు. విశాఖపట్నంలో జరిగే మూడో వన్డేకు సంబంధించి టికెట్లు నవంబర్ 28న ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచగా.. తొలుత ఈ మ్యాచ్‌కు టికెట్లకు పెద్దగా డిమాండ్ లేదు. రెండో వన్డేలో దక్షిణాఫ్రికా గెలుపుతో టికెట్ల కొనుగోలు ఊపందుకుంది. ఈ విషయాన్ని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ శుక్రవారం వెల్లడించింది. భారత్–దక్షిణాఫ్రికా జట్లు కలిసి తొలి రెండు వన్డేల్లో ఏకంగా 1,401 పరుగులు చేయగా.. 29 వికెట్లు పతనమయ్యాయి. ఈ క్రమంలో విశాఖలో జరిగే నిర్ణయాత్మక మ్యాచ్‌లో గెలిచిన జట్టు వన్డే సిరీస్ ట్రోఫీని ముద్దాడనుంది.

జట్లు(అంచనా)...

ఇండియా: కెఎల్ రాహుల్(కెప్టెన్, వికెట్ కీపర్), రోహిత్, కోహ్లి, జైస్వాల్, సుందర్, గైక్వాడ్, హర్షిత్, జడేజా, కుల్దీప్, ప్రసిధ్, అర్ష్‌దీప్.

దక్షిణాఫ్రికా: బవుమా(కెప్టెన్), మార్‌క్రమ్, రికెల్టన్, ముల్దర్, జోర్జి, స్టబ్స్, వెర్రెయనె(వికెట్ కీపర్), యాన్సెన్, బోచ్, హార్మర్, మహరాజ్.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68